10-9Pg1exHNWMJQE:10-9Pg1exHNWMJQE.qxd 9/9/2026 11:45 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి : fb.com/vaartha Digital

Published from Tirupathi, Kadapa, Nellore, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, ...

10-9-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 222 పేజీలు: 10+4 వెల: 6.50

## సింగపూర్ ప్రధాని వేతనం రూ. 27 కోట్లు

5లో

### విద్యార్థులకు నోటీసులు ఇస్తారా?

నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌పై సుప్రీం ఆగ్రహం



# రైల్వేకు కొత్త ఊపు!

## ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 8 విస్తరణ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- 7 రైల్వే కారిడార్లలో నాలుగు లేన్ల నిర్మాణం
- మొత్తం రూ.20,804 కోట్ల అంచనా వ్యయం
- అరక్కోణం - రేణిగుంట 3వ, 4వ లైన్ - 77 కి.మీ.
- 2029-30నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- వివరాలు వెల్లడించిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** కేంద్ర మంత్రవర్గ సమావేశంలో దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో రైలు మార్గాల అనుసంధాన ప్రాజెక్ట్‌లపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మొత్తం రూ.20,804 కోట్ల విలువైన 8 ప్రాజెక్టుల్లో ఐదు దక్షి ణాదిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలోనే ఉన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమా వేశమైన కేంద్ర మంత్రివర్గం దేశవ్యాప్తంగా రైలు మార్గాల అనుసంధాన ప్రాజెక్టులపై కీలక నిర్ణయం తీసుకున్నారు. 7 రైల్వే కారిడార్లలో నాలుగు లేన్ల నిర్మాణం చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ఇచ్చింది. రూ.20,804 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్ట్‌లకు ఆమోదం తెలిపింది. వీటిలో ఐదు దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలోనే ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యటక కేంద్రాలకు రైలు సౌకర్యం అందుబాటు లోకి రానుంది.

ప్రయాణికులతో పాటు సరకు రవాణా సులభతరం చేయడానికి ఇవి సహాయపడతాయి. వీటి ద్వారా దాదాపు కోటి మందికిపైగా ప్రయోజనం కలుగుతుంది. దాదాపు 1,196 కిలోమీటర్ల మేర విస్తరించే ఈ ప్రాజెక్టుల ద్వారా రైలు అనుసంధానం (కనెక్టివిటీ) మెరుగుపడటంతో పాటు, ప్రస్తుత మార్గాల్లో రద్దీ తగ్గి ప్రయాణికులు, సరుకుల రవాణా వేగవంతం కానుంది. ఈ ప్రాజెక్టులను 2029-30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టులు కనెక్టివిటీని పెంచడంతో పాటు ప్రయాణాన్ని సులభతరం చేస్తాయని, సరుకులు, ప్రయాణికుల రవాణాను >>2

# భక్తుల సంక్షేమానికి ప్రాధాన్యత!

## సులభతర దర్శనం... జీవిత బీమా వర్తింపు

- ఉద్యోగుల బీమా రూ.10లక్షలకు పెంపు
- 15న శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం
- ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు
- టిటిడి ఛైర్మన్ బి.ఆర్ నాయుడు వెల్లడి



బుధవారం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి ధర్మకర్తల మండలి సమావేశం దృశ్యం

**తిరుమల, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో తిరుమలలో పనిచేసేఉద్యోగుల సంక్షేమానికి టిటిడి అధిక ప్రాధాన్యతనిస్తూ నిర్ణయం తీసుకుంది. అలాగే శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు తిరుమలలో సహజ మరణం సంభవించిన సందర్భంలో జీవిత బీమా పథకాన్ని అమలు చేయాలని ధర్మకర్తల మండలి నిర్ణయించింది. ఈ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా ఆలయాల పరిపాలనలో టిటిడి ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా మరణించిన భక్తుని కుటుంబానికి రూ. 2 లక్షలు ఆర్థిక సాయం చెల్లిస్తారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టిటిడి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. బుధవారం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. టిటిడి ఇఒ ముద్దాడరవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపీనాథ్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 15 నుండి 23వరకు నిర్వహించనున్నారు. 14వ తేదీ సోమవారం సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 15న మంగళవారం సాయంత్రం 5.30 గంటలనుండి రాత్రి 7గంటలమధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. సెప్టెంబరు 15న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. రిలయన్స్ సంస్థ టిటిడికి విరాళంగా అందించిన 25 విద్యుత్ బస్సులను ఈనెల 16న సిఎం చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు. 2027 సంవత్సరానికి సంబంధించిన టిటిడి క్యాలెండర్లు, డైరీలను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ 10 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతున్నామని ఛైర్మన్ నాయుడు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో దేశవ్యాప్తంగా >>2

# ప్రజాసంక్షేమమే లక్ష్యం!

## ప్రతీకారం తీర్చుకోవాలంటే నిమిషం చాలు... కానీ సహనంతో వ్యవహరిస్తా

- అధికారంలో ఉండగా వైసిపి అరాచకాలు
- ఓటమి చెందాక కుట్రలు గొడ్డలి పార్టీ విధానం
- నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారు
- ఎపిపిఎస్సీలో అక్రమాలతో యువతను మోసం చేశారు
- గొడ్డలి పార్టీ కుట్రలకు ప్రజలే బుద్ధి చెప్పాలి
- పండువారిపేట సభలో సిఎం చంద్రబాబు పిలుపు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయ కక్షలకు తాను ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వనని, ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం సహనంతో ఓపిగ్గా ఉండడం తనకు అలవాటని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విలువలతో కూడిన రాజకీయం, పేద ప్రజలకు మెరుగైన జీవితం, తెలుగుజాతి అభివృద్ధి కోసం తాను నిరంతరం ఆలోచిస్తానని స్పష్టం చేశారు. "మీ భూమి- మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా బుధవారం కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పండువారిపేటలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన సమయంలో మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9న అర్ధరాత్రి వచ్చి తనను అరెస్టు చేస్తామని చెప్పారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఏ తప్పు చేయకపోయినా అర్ధరాత్రి పూట తనను అరెస్టు చేశారని తెలిపారు. తనపై ఉన్న ఆరోపణలు ఏమిటని ప్రశ్నిస్తే, అరెస్టు చేసిన తర్వాత చెబుతామని చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన తనను ఉన్నపళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారని పేర్కొన్నారు. తన జీవితంలో ఎన్నడూ ఊహించని ఆ సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగిందని వ్యాఖ్యానించారు.

తాను 48 యేళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, 31 యేళ్ల క్రితమే తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని చంద్రబాబు అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని తెలిపారు. తనపై అనేకమంది ఆరోపణలు చేశారని, కోర్టులకు వెళ్లారని, అయితే తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయలేకపోయారని చెప్పారు.



బుధవారం పండువారిపేటలో నిర్వహించిన 'మీభూమి-మీహక్కు కార్యక్రమంలో లబ్దిదారులకు పాస్‌బుక్కులు అందజేస్తున్న సిఎం చంద్రబాబు

అదే తన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాజకీయాలపై కుటుంబం ఆధారపడకూడదనే ఉద్దేశంతో 36 యేళ్ల క్రితమే కుటుంబ వ్యాపారాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. తాను ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో కుటుంబ వ్యాపారాన్ని తన సతీమణికి అప్పగించానన్నారు. తనకు ధన వ్యామోహం లేదని, తెలుగు జాతి బాగుండాలన్నదే నిరంతరం >>2

## ప్రతి వారమూ ప్రజల మధ్యలోనే

- సంక్షేమం- అభివృద్ధి- సుపరిపాలనే మూల మంత్రాలు
- గత పాలకుల పాపాల్ని కడిగి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- 16 లక్షల ఎకరాలు 22ఏ జాబితా నుంచి తొలగింపు
- రీసర్వే 2.0తో రాష్ట్రంలో భూ వివాదాలన్నీ పరిష్కారం
- పి.గన్నవరం 'మీ భూమి మీహక్కు' గ్రామ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇపిడిసిఎల్ చేపట్టిన విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణ పనులకు సిఎం శంకుస్థాపన

3లో

# మైనింగ్ రగడ

## ప్రకాశంలో ప్రజల తిరుగుబాటు

### ఉభయ కమ్యూనిస్టు పార్టీ నేతల ఆధ్వర్యంలో నిరసన

**ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** కొండపి నియోజకవర్గ పరిధిలోని ఇనుప ఖనిజం మైనింగ్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఐదు గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఒంగోలు రూరల్ మండలంలోని ఎర్రజెర్ల, సూర్యారెడ్డిపాలెం, టంగుటూరు మండలంలోని మార్లపాడు, కొణిజేడు, కందులూరు గ్రామాల ప్రజలు నిరసనలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై మైనింగ్ కారణంగా తమ భూములు, నీటి వనరులు, పశువుల మేత భూములు, జీవనోపాధికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా గ్రామస్థులు ఏకమై నిరసన చేపట్టారు. వైసీపీ, సిపిఐ, సిపిఎం నాయకులతోపాటు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు గ్రామస్థులకు మద్దతుగా నిలిచారు. కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆందోళనలో పాల్గొని మైనింగ్ పనులు, పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఎండీసీ, జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో ఓపెన్‌కాస్ట్ ఇనుప ఖనిజం మైనింగ్‌తోపాటు అక్కడే శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు. మొత్తం >>2

# ఎపిని నం.1 చేద్దాం



బుధవారం ఎన్ఆర్ఐ టిడిపి సెంట్రల్ కమిటీ కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి నారా లోకేష్

- ఎన్నారైల అండతో టిడిపి జెండా రెపరెపలు
- 2029 ఎన్నికల్లో ఎన్‌డిఏను గెలిపించాలి
- చంద్రబాబు అరెస్ట్ సమయంలో ఎన్ఆర్ఐల అండ మరువలేనిది
- ఎన్ఆర్ఐ టిడిపి సెంట్రల్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పార్టీ జాతీయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్

**అమరావతి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వచ్చే ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, తెలుగు జాతిని నెం.1గా చేసే బాధ్యత సమిష్టిగా తీసుకుందామని టిడిపి జాతీయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు, విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో ఎన్ఆర్ఐ టిడిపి సెంట్రల్‌కమిటీ కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎన్ఆర్ఐ టిడిపి సెంట్రల్ కమిటీ సభ్యులతో ఎన్ఆర్ఐ ఎంపవర్‌మెంట్ అండ్ రిలేషన్స్ మినిస్టర్ కొండపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. గ్లోబల్ ఎన్ఆర్ఐ టిడిపి అధ్యక్షుడిగా డా.పి.గురురాజా >>2

# పోలవరం పనులు పరుగులు పెట్టించాలి

## నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తికావాలి

- ప్రాజెక్టు పనుల్లో సాంకేతిక సమస్యలుంటే పరిష్కరించండి
- పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశంలో నిర్ణయం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయడం, ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) సర్వసభ్య సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రాజమహేంద్రవరంలో బుధవారం పిపిఎ సిఇఒ సంజీవ్ అధ్యక్షతన 18వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం 12 ప్రధాన అజెండా అంశాలను అధికారులు పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ పురోగతి, వివిధ విభాగాల పనుల పరిస్థితి, పెండింగ్ అంశాలు, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై అధికారులు వివరాలను సమర్పించినట్లు తెలిసింది. నిర్మాణ పనులు నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా సాగేందుకు అవసరమైన చర్యలపై సభ్యులుచర్చించారు. ప్రాజెక్టు పనుల్లో ఎక్కడైనా సాంకేతిక, పరిపాలనా పరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించ >>2

## పెదపంకిలో డి.సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక కార్యాచరణ

- గ్రామంలో పారిశుద్ధ్య లోపాలు సరిచేయడం
- మౌలిక సదుపాయాలతో ఆధునిక వాగులు
- గ్రామస్తుల వ్యక్తిగత హెల్త్ ప్రొఫైల్స్ ఆధారంగా డిజిటల్ హెల్త్ కార్డులు జారీ

# 'బోదకాళ్లు'కు చెక్!



**విజయవాడ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పార్వతీపురం మన్యం జిల్లా, పెదపెంకి గ్రామంలో ప్రత్యేకంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత, ప్రజల సౌకర్యానికి పెద్దపీట వేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యం ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఉండకూడదని, సుదీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించే విధంగా ఉండాలని సూచనలు చేశారు. నిర్మాణ పనులు పూర్తి చేసిన తర్వాత నిర్వహణా లోపాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రజల్లో కూడా పారిశుద్ధ్యం పట్ల అవగాహన కల్పిస్తూ, మార్పు తీసుకురావాలని చెప్పారు. రూ.4.68 కోట్ల ఉపాధి హామీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం, మండల పరిషత్, నీటిపారుదల శాఖ తదితర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో >>2

# జనసైన్యముండే చోట పోటీ

- సమన్వయంతో పనిచేయండి
- 100శాతం విజయం సాధించాలి
- భవిష్యత్ ప్రజాప్రతినిధులు మీరే
- జనసైనికులకు నాదెండ్ల మనోహర్ పిలుపు

**విజయవాడ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సన్నద్ధం కావాలని నేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపు నిచ్చారు. బుధవారం జనసేన స్థానిక సంస్థల ఎన్నికల అవగాహనకార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ జనసేనకు బలం ఉన్న ప్రాంతాల్లో తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు ఈసారి నేరుగా జరుగుతాయని వెల్లడించారు. గతంలో మాదిరిగా అందరూ కలిసి ఒకరిని ఎన్నుకునే విధానానికి స్వస్తి పలికినట్లు తెలిపారు. ఎన్నోపోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చామన్నారు. సందర్భం వచ్చిన ప్రతిసారీ జనసేనాని పవన్ కల్యాణ్ "మీ కష్టాలు, మీ పోరాటాలను గుర్తు చేసుకుంటూ ఉంటార్లు" అని తెలిపారు. జనసైనికుల సంక్షేమం కోసం తొలుత రూ.5 కోట్లతో ఇన్సూరెన్స్‌ను ఏర్పాటు చేశారని మంత్రిఅన్నారు. వైసిపి ప్రభుత్వంలో కౌలు రైతులు అనేక మంది ఆత్మహత్య చేసుకున్నారని, ఆ సమయంలో పవన్ తన సొంత డబ్బును ఆర్థిక సాయంగా అందించారని చెప్పారు. నిజాయితీకి మారు పేరుగాఉన్న పవన్ సారథ్యంలో అందరం పనిచేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నిక >>2



10-9pg2exHMNWJQEB:10-9pg2exHMNWJQEB.qxd 9/9/2026 11:46 PM Page 1





బుధవారం 'మీభూమి-మీహక్కు కార్యక్రమంలో పాస్‌బుక్కులు ప్రదర్శిస్తున్న లబ్దిదారులు

# ఎపిని నం.1 చేద్దాం

>> ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "ప్రపంచంలో తెలుగువారు లేని దేశం లేదు. ఏ దేశానికి వెళ్లినా తెలుగులో మాట్లాడితే కనీసం 20మందైనా స్పందిస్తారు. తెలుగువారి ఆత్మగౌరవం స్వర్గీయ ఎన్టీఆర్. రాజకీయాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకు వచ్చారు. రాజకీయాల్లో చదువుకున్న వారికి, మేధావులకు అవకాశం కల్పించారు. సమాజంలో మార్పు కోసం కృషిచేసిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. ఆయన ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో తొలిసారిగా 50శాతం స్థానాల్లో యువకులు గెలుపొందారు. ఏడుగురు ఎన్ఆర్ఐలకు కూడా అవకాశం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు ఎంపిగా విజయం సాధించి కేంద్ర మంత్రిగా పనిచేస్తున్నార్లు అని వివరించారు.

**చంద్రబాబు అరెస్ట్ సమయంలో ఎన్ఆర్ఐలు అండగా నిలిచారు:**

2019-24మధ్య రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులుపడ్డారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. ఆనాడు అమరావతి ఉద్యమానికి ఎన్ఆర్ఐలు మద్దతుగా నిలిచారు. కేసులు పెట్టినా భయపడలేదు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడారు. చంద్రబాబుని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు 50 దేశాల్లో 200 పట్టణాల్లో ఎన్ఆర్ఐలు కార్యక్రమాలు నిర్వహించారు. నారా బ్రాహ్మణి మనకు రాజకీయాలు అవసరమా అనిప్రశ్నించారు. అలాంటి సమయంలో నిర్వహించిన "ఐయామ్ విత్ సిబిఎన్ష్ కార్యక్రమం మా కుటుంబానికి కొండంత బలంగా నిలిచింది. మళ్లీ ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్నాం. ఐదు వేల డాలర్లు ఖర్చుపెట్టి ఓటు వేయడానికి రాష్ట్రానికి వచ్చారు. కొన్ని నెలల పాటు ఉద్యోగాలకు సెలవు పెట్టి గ్రామాల్లో తిరిగారు. ప్రజలను చైతన్య పరిచారు. ప్రజాప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములయ్యారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి 53 రోజుల పాటు నిర్బంధించిన నాటి చీకటి రోజులను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోవద్దు అని టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అన్నారు. తప్పు చేయని నాయ కుడిని జైలుపాలుచేసి, కుటుంబసభ్యులకు సైతం సరైనములాఖత్‌లు లేకుండా వేధించారని మండి పడ్డారు. గౌరవంగా బతికిన కుటుంబానికి ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలు అవసరమా? అని తనను బ్రాహ్మణి అడిగిన మాటలను గుర్తుచేస్తూ లోకేష్ భావోద్వేగానికి లోనయ్యారు. రాష్ట్రానికి దశాబ్దాలుగా సేవ చేసిన నాయకుడికి జరిగిన అన్యాయంపై ప్రపంచం మొత్తం కదిలిందని తెలిపారు. కోర్టు హాల్ బయట చంద్రబాబును చెక్క కుర్చీలో కూర్చోబెట్టిన నాటి ఫోటోను ప్రదర్శించిన లోకేష్, ఆ అవమానకర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని పోరాడిన తీరును ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. ఇక ఎలాంటి కుట్రలు, ఎన్ని అడ్డంకులు వచ్చినా ఐక్యంగా ముందుకు సాగి 2029లోనూ ఎన్డీఏను గెలిపించాలని లోకేష్ పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**తెలుగుజాతిని నం.1గా చేసే బాధ్యత తీసుకుందాం:**

"తెలుగుజాతి గురించి ఆలోచించే పార్టీ తెలుగుదేశం పార్టీ. టిడిపి అధికారంలో ఉన్నా, లేకపోయినా ఉత్తరాఖండ్ వరదల సమయంలో ప్రత్యేక విమానంపెట్టి తెలుగువారిని రక్షించాం. ఉక్రెయిన్‌పై దాడుల సమయంలో తెలుగువారికి అండగా సిబిఎన్ నిలిచారు. గతేడాది సంక్షోభం కారణంగా నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగువారి కోసం ప్రత్యేక విమానం ఏర్పాటుచేసి వారిని సురక్షితంగా ఇళ్లకు తరలించాం. ఎన్ఆర్ఐలు తెలుగుజాతికి బ్రాండ్ అంబాసిడర్లు. తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత తీసుకుందాం. ఇందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. మీరు పనిచేసే కంపెనీలు ఎపికి వచ్చేందుకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఎపికి వస్తున్నాయి. ఎపి అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వామ్యం కావాల్షి అని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

**టిడిపి కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ ప్రజాదర్బార్:**

ఎన్ఆర్ఐ టిడిపి సెంట్రల్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు, నాయకులను కలుసుకున్నారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.

# జనసైన్యముండేచోట పోటీ

>> లలో వంద శాతం ఫలితాలు సాధించాలని నేతలకు తెలిపారు. పంతాలకు పోకుండా జనసేనకు బలమున్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. పార్టీ సభ్యత్వంలో కీలకంగా పని చేసిన వారికి, పార్టీ కోసం పని చేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. 'భవిష్యత్తులో మీరే మేయర్లు, ఛైర్మన్‌లు, వార్డు సభ్యులుగా గెలుస్తారు. కానీ పార్టీ ఆదేశాలను పాటించేలా క్రమశిక్షణ ఉండాలి. అభ్యంతరాలు ఉంటే అంతర్గతంగా చెప్పండి. ఒకేసారి అందరికీ పదవులు ఇవ్వడం సాధ్యం కాదు. పార్టీ ఇచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోండ్షి అని నిర్దేశించారు. ఈనెల 15న మంగళగిరికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వస్తున్నారని మంత్రి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహంపై సమీక్ష చేస్తారన్నారు. జనసేన కూటమిలో భాగస్వామ్యంతో ప్రభుత్వంలో ఉన్నామని గుర్తించాలని చెప్పారు. 12న, 15న కూటమి పక్షాల సమన్వయ కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు. ప్రతీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల్లో తొలివిడతఎన్నికలు జరుగుతాయనిచెప్పారు. ప్రతి ఓటు చాలా ముఖ్యమని, ప్రతి గడపకూ వెళ్లాలని ఆదేశించారు. జనసేన సభ్యత్వం ఉన్న వ్యక్తులే అభ్యర్థులుగా ఉండాలన్నారు. హింసను ప్రేరేపించే విధంగా రక్తం ప్రవహిస్తుందని వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏకగ్రీవంపై జగన్.. వాళ్ల పార్టీ వారినే బెదిరిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో దాడులను ఎదుర్కొన్నామని గుర్తుచేశారు. పార్లమెంటు పరిధిలో ఉన్న నేతలు ముందుగానే సమావేశం పెట్టుకుని చర్చించుకుని ప్రశాంతంగా ముందుకు సాగాలని సూచించారు.

# రైల్వేకు కొత్త ఊపు!

>> చేస్తాయని ప్రభుత్వం తెలిపింది.

**దక్షిణాది రైల్వే నెట్‌వర్క్‌కు భారీ ప్రయోజనం:**

కేంద్ర మంత్రివర్గం తీసుకున్న తాజా నిర్ణయంతో దక్షి ణ భారత రైల్వే నెట్‌వర్క్‌కు భారీ ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హౌరా- చెన్నై రైల్వే కారిడార్‌లో భాగంగా విశాఖపట్నం, విజయవాడ మీదుగా నాలుగు లేన్ల రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధి చేయనున్నారు. ఈ విస్తరణతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణికులు, సరుకు రవాణాకు మరింత సౌకర్యం కలిగే అవకాశం ఉంది. అదేవిధంగా ముంబై-చెన్నై రైల్వే కారిడార్‌లో భాగంగా గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లేన్ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ మార్గం దేశంలోని పశ్చిమ, దక్షి ణ ప్రాంతాలను అనుసంధానించే కీలక రైల్వే మార్గాల్లో ఒకటిగా ఉంది. నాలుగు లేన్ల విస్తరణ పూర్తయితే రైళ్ల వేగం, మార్గ సామర్థం, సరుకు రవాణా సామర్థం మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అనేక ప్రధాన రైల్వే మార్గాల్లో ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో అదనపు లైన్ల నిర్మాణం ద్వారా రైళ్ల రాకపోకలకు ఎదురయ్యే సమస్యలను తగ్గించడమే కేంద్రం లక్ష్యంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాలను ప్రధాన పోర్టులు, నగరాలతో అనుసంధానించడంలో ఈ కారిడార్లు కీలకంగా మారనున్నాయి. కేంద్ర కేబినెట్ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే కీలక రైల్వే మార్గాలకు మరింత ప్రాధాన్యం లభించనుంది. విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్లు, రేణిగుంట వంటి ప్రధాన రైల్వే జంక్షన్ల మీదుగా నాలుగులేన్ల నెట్‌వర్క్ అభివృద్ధిచెందితే భవిష్యత్‌లో పెరగనున్న ప్రయాణి కుల, సరుకు రవాణా అవసరాలను తీర్చేందుకు ఇది ఉపయోగపడనుంది.

**ప్రాజెక్టుల వివరాలు:**

ఈ ప్రాజెక్టులలో రూ.10,021 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో 540 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. అరక్కోణం- రేణిగుంట మూడు, నాలుగో లైన్లు (77 కి.మీ), వైట్‌ఫీల్డ్ - బంగారపేట మూడు, నాలుగో లైన్లు (47 కి.మీ), హోసూర్ - ఓమలూర్ డబ్లింగ్ (147 కి.మీ), సేలం - కరూర్ - దిండిగల్ డబ్లింగ్ (159 కి.మీ), సికింద్రాబాద్ (ఘట్‌కేసర్) - కాజీపేట మల్టీట్రాకింగ్ (110 కి.మీ). మిగిలిన రూ.10,783 కోట్ల విలువైన మూడు ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 656 కిలోమీటర్ల మేర విస్తరిస్తాయి. ఖరగ్‌పూర్-ఝార్సుగూడ (బాగ్దేహి) నాలుగో లైన్, కట్నీ- పెండ్రా రోడ్ నాలుగో లైన్, బిలాస్‌పూర్ (ఉస్లాపూర్) - పెండ్రా రోడ్ మూడో లైన్. దక్షి ణాది రాష్ట్రాల్లోని ఐదు ప్రాజెక్టులు 17 జిల్లాల గుండా వెళ్తూ, 2,121 గ్రామాలకు రైలు సౌకర్యాన్ని కల్పిస్తాయి. దీని ద్వారా దాదాపు 52 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. తూర్పు, మధ్య భారతదేశంలోని మూడుప్రాజెక్టులు 14జిల్లాలను కవర్‌చేస్తూ, దాదాపు 56 లక్షల జనాభా ఉన్న 4,790 గ్రామాలను అనుసంధానిస్తాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా ఏటా దాదాపు 74 మిలియన్ టన్నుల మేర సరుకుల రవాణా సామర్థం పెరుగుతుందనిఅంచనా. నవీకరించిన ఈమార్గాలు బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహార ధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు ఎంతగానో తోడ్పడతాయి. పిఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ కింద చేపట్టే ఈ ప్రాజెక్టుల ద్వారా తిరుపతితో పాటు తమిళనాడు, కర్ణాటకలోని పలు ప్రధాన ఆలయాలు, ముఖ్యమైన పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగు పడుతుందని ప్రభుత్వం తెలిపింది. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రైల్వే రంగానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దేశంలో అధిక రద్దీ ఉన్న ఏడు కీలక రైల్వే కారిడార్లను నాలుగు లేన్లు, నాలుగు ట్రాక్‌లకు విస్తరించే ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. ముఖ్యంగా కోల్‌కతా- ఢిల్లీ, చెన్నై-కోల్‌కతా,ఢిల్లీ-ముంబై, ముంబై-చెన్నై, బిలాస్‌పూర్-కట్నీ వంటి కీలకమార్గాల్లో రైల్వే సామర్థ్యాన్ని పెంచనున్నారు. ముంబై-హౌరా హై డెన్సిటీ నెట్‌వర్క్‌లో భాగంగా ఖరగ్‌పూర్-ఝార్సుగూడ మధ్య 367 కిలోమీటర్ల నాలుగో లైన్‌కు రూ.6,528 కోట్లతో ఆమోదం తెలిపినట్లు మంత్రివెల్లడించారు. అలాగే అరకున్నం-రేణిగుంట మధ్య మూడో, నాలుగో లైన్ల నిర్మాణానికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఒక్కో లైన్ 77 కిలోమీటర్ల పొడవుతో ఉండగా, ఈ ప్రాజెక్టుకు రూ.1,936 కోట్లు ఖర్చు కానుంది. దేశంలోని సుమారు 11,000 కిలోమీటర్ల హై డెన్సిటీ రైల్వే కారిడార్లు దాదాపు 40 శాతం రైల్వే ట్రాఫిక్‌ను నిర్వహిస్తున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. ఇప్పటికే 2,000 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మరో 5,000 కిలోమీటర్ల పనులు పురోగతిలో లేదా ఆమోద దశలో ఉన్నాయని

# ప్రజాసంక్షేమమే లక్ష్యం!

>> స్పష్టం చేశారు.

**నాటి సంఘీభావాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటా..:**

జైలులో ఉన్న సమయంలో తనకేం జరుగుతుందోనన్న ఆందోళనతో తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నాడు పవన్ కల్యాణ్ తెలిపిన మద్దతును ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. తనకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారని చంద్రబాబు అన్నారు. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పవన్‌కల్యాణ్ తనకు సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయని, ఇడి వంటి సంస్థలుకూడా ఇందులో ఏమీ లేదని తేల్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో అచ్చెన్నాయుడు వంటి నేతలను బలవంతంగా అరెస్టు చేసి వేధించారని, పవన్ కల్యాణ్ విశాఖ వెళ్లినప్పుడు ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కి పంపించారని అన్నారు. ఇలాంటి ఘటనలు గత పాలనలో ఎన్నో జరిగాయని సిఎం పేర్కొన్నారు.

**రాజకీయ కక్షలకు దూరంగా..**

తాను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిమిషం చాలని చంద్రబాబు అన్నారు. కానీ తాను ఆ పని చేయలేదని స్పష్టం చేశారు. తాను సహనంగా ఓపిగ్గా ఉంటానని వెల్లడించారు. గత పాలకులు అంతగా వేధించినా ఏం చేయలేకపోతున్నానని చాలా మంది అనుకుంటారని, కానీ అది తన విధానం కాదన్నారు. తెలుగు జాతికి న్యాయం జరగాలన్న లక్ష్యంతోనే పని చేస్తానని, రాజకీయ కక్షలకు దూరంగా ఉంటానని సిఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. తనపై నక్సల్స్ దాడి చేసినా తన సిద్ధాంతాలను, తన లక్ష్యాన్ని మరిచిపోలేదన్నారు. ప్రజల కోసం పనిచేయడంలో వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. శాంతిభద్రతల విషయంలో తాను ఎప్పుడూ కఠినంగానే ఉంటానని అన్నారు. ముఠా కక్షల విషయంలో మాట వినని తనపార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను సైతం అరెస్టు చేయించిన చరిత్ర తనదని పేర్కొన్నారు. సిఎంగా తాను సమర్థంగా పనిచేయకపోతే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని చంద్రబాబు అన్నారు. అందుకే ప్రతి అంశాన్ని బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నానని తెలిపారు. ప్రజలు ఆనందంగా, ఆరోగ్యంగా, మంచి జీవన ప్రమాణాలతో ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నాడు నేడు కేరాఫ్ బెంగళూరే..**

ఇదే సమయంలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ నైజాన్ని, ఆయన కుటుంబ సభ్యులే చెప్పిన విషయాల ద్వారా అర్థం చేసుకోవాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఆయన కుమారుడి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తాను అప్పట్లోనే చెప్పానని గుర్తుచేశారు. జగన్‌ను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చదువుకోవడానికి అమెరికా పంపిస్తే తిరుగుటపాలో వచ్చేశాడని స్వయంగా వైఎస్ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన కుమారుడిని ఎప్పుడూ ఎపికి రానీయలేదని చంద్రబాబు అన్నారు. కొడుకుతో ఇబ్బందులు భరించలేక జగన్‌ను బెంగళూరులోనే ఉంచారని ఆయన తల్లి విజయమ్మ మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారని చంద్రబాబు నాటి సంగతులను గుర్తు చేశారు.

**విభజన కంటే 2019-24లోనే ఎక్కువ నష్టం:**

2019-24 మధ్య కాలంలో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం ఎపికి జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను కక్షతో గోదాట్లో కలిపేశారని ఆరోపించారు. ఇప్పుడు ఎల్ నినో లాంటి కరవు పరిస్థితుల్లో పోలవరం పూర్తై ఉంటే ఆ ప్రాజెక్టే ఎపిని ఆదుకుని ఉండేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 30 యేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును మళ్లీ తానే ప్రారంభించాల్సి వచ్చిందని అన్నారు. వెలిగొండ నుంచి నీళ్లు వచ్చినప్పుడు ఆ ప్రాంత ప్రజలకు ఎంత ఆనందం కలిగిందో, తనకూ అంతే ఆనందం కలిగిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీరిచ్చినప్పుడూ ఎంతో సంతోషించానన్నారు. గత పాలనలో బయటకు రావాలన్నా, మాట్లాడాలన్నా ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదని సిఎం విమర్శించారు. ఎపిపిఎస్సీ నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షల పేపర్లను ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లతో దిద్దించి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో నాసిరకం మద్యం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేశారని చంద్రబాబు అన్నారు. కల్తీ మద్యం కారణంగా 30 వేల మంది చనిపోయారని, అనేకమంది ఆరోగ్యాలు కోల్పోయారని పేర్కొన్నారు. వైసిపి ప్రజల జీవితాలతో ఆడుకుందని చంద్రబాబు అన్నారు. అందుకే 2024లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కూటమికి మద్దతు ఇచ్చారని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిలా పనిచేసిందని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని, పోలవరం, అమరావతి నిర్మాణాలను చేపట్టగలిగామని తెలిపారు.

**అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలి:**

ఓవైపు అభివృద్ధి చేస్తుంటే... గొడ్డలి పార్టీ అడుగడుగునా కుట్రపూరితంగా అడ్డంకులు సృష్టిస్తున్నదని సిఎం చంద్రబాబు మండిపడ్డారు. మెగా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తే 350 కేసులు వేసి అడ్డుకునేందుకు ప్రయత్నించారని చంద్రబాబు అన్నారు. యేడాది తర్వాత ఆ ఉపాధ్యాయుల కుటుంబాల్లో చిచ్చుపెట్టేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కేసులు వేసినా సరైన ఆధారాలు లేవని కోర్టులుకూడా చీవాట్లు పెట్టాయని తెలిపారు. అసెంబ్లీకివచ్చి ప్రజల సమస్యలపై చర్చించమంటే అసెంబ్లీకి వచ్చేదే లేదని గొడ్డలి పార్టీ నేతలు మొండికేస్తున్నారని చంద్రబాబు అన్నారు.ఎన్ని కుట్రలు చేసినా గొడ్డలి పార్టీకి తాము బెదిరేది లేదని, గట్టిగానే పోరాడతామని స్పష్టం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఇన్ని రకాలుగా ఆలోచించి ప్రజలకు మేలు చేసేలా ప్రయత్నిస్తుంటే ఆ పార్టీ చేస్తున్న కుట్రలపై ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రజలకు ఏ విధంగా మంచి చేయాలన్న అంశంపై రెండు రోజుల పాటు సమావేశాలు నిర్వహించి పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్లతోనూ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పౌరసేవలు మెరుగ్గా అందేలా స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి ఎప్పటికప్పుడు లోపాలను

# పరుగులు పెట్టించాలి

>> డంతో పాటు, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచడంపై దృష్టి సారించినట్లు సమాచారం. పోలవరం నిర్మాణం రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు కావడంతో పనుల వేగం పెంచేందుకు సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో పిపిఎ అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొని ప్రాజెక్టు తాజా పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు.

## వారం - వర్జ్యం

10-09-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.చతుర్దశి ఉ.10.35
న. మఖ మ.2.07
వ.రా.9.51 - రా.11.24
దు.ఉ.10.01 - ఉ10.50
2) మ.2.57 - మ.3.46
రాహు. మ.1.30-3.00. శుభ స. లేదు.

## వార్తాఫలం

**మేషం :** సోదరులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. నూతన విద్యావకాశాలు. ఆర్థిక మార్గాలు మెరుగ్గా ఉంటాయి.

**వృషభం :** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సంతానం నుండి శుభవార్తలు అందుతాయి. వస్తు, వస్త్ర, కొనుగోలు.

**మిథునం :** కోపతాపాలకు దూరంగా వుండండి. సోదరుల నుండి శుభవార్తలు. ఉద్యోగులకు అనుకూల మార్పులు.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా సన్నిహితుల సహాయం అందుతుంది.

**సింహం :** సంతానానికి నూతన విద్యావకాశాలు పొందుతారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** ఉద్యోగులకు పని ఒత్తిడులు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. ఆహ్వానాలు.

**తుల :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

**వృశ్చికం :** గృహనిర్మాణ ఆలోచనలు ముందుకు సాగవు. దీర్ఘకాలిక ఋణాలు తీరుస్తారు. శుభవార్తలు వింటారు.

**ధనుస్సు :** ప్రముఖులతో పరిచయాలు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా వుండును. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

**మకరం :** మిత్రుల నుండి విలువైన సమాచారం అందుతుంది. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. రాయబారాలు సాగిస్తారు.

**కుంభం :** వివాదాలకు దూరంగా వుండటం అన్ని విధాలా మంచిది. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** మిత్రులసహాయసహకారాలు అందుకుంటారు. ఉద్యోగ, వివాహ యత్నాలు అనుకూలిస్తాయి. శ్రమకు తగిన ఫలితం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




బుధవారం రాయ్‌బరేలీలో జరిగిన పర్యవేక్షణ కమిటీ సమావేశానికి హాజరైన రాహుల్ గాంధీ

# భక్తుల సంక్షేమానికి ప్రాధాన్యత!

>> 25 రాష్ట్రాలతో బాటు సింగపూర్, జర్మనీ దేశాల నుంచి కళాకారులు పాల్గొననున్నారు.

**భద్రత,పారిశుద్ధ్యానికి పెద్దపీట:**

తిరుమలలో జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అశేషభక్తుల భద్రతకు 3వేల మంది పోలీసులతో బాటు 2,500 మంది టిటిడి నిఘా, భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు ఛైర్మన్ బిఆర్ నాయుడు చెప్పారు. ఇక తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు మూడువేల మందిపైగా సిబ్బందిని నియమిస్తున్నారు. ఈయేడాది గరుడసేవకు గతేడాదితో పోలిస్తే 15 నుండి 20 శాతం మంది భక్తులు అదనంగావచ్చే అవకాశంఉందని, అందుకు అనుగుణంగా అన్నిఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 19వ తేదీ గరుడసేవ రోజున 9.30 లక్షల మందికి అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతేడాదితో పోలిస్తే 52 శాతం అదనమన్నారు. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దర్శనం, వసతి, అన్నప్రసాదం, రవాణా, భద్రత, వైద్యం, పారిశుద్ధ్యం, విద్యుత్, పుష్పాలంకరణలు తదితర అన్ని విభాగాల్లో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం, సురక్షి తమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించడమే టిటిడి ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని నాయుడు చెప్పారు.

**కీలక అంశాలకు ఆమోదం:**

టిటిడిలో పదవీ విరమణ పొందిన సిపిఎస్, ఎన్‌పిఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఒపిఎస్ పెన్షనర్ల తరహాలో ఇహెచ్‌ఎఫ్ సౌకర్యం కల్పిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్లు, హోటళ్ల నుండి వచ్చే ఆహార వ్యర్థాలను విభాగాలుగా విభజించి వాటర్ హైడ్రాలసిస్ ప్రక్రియ ద్వారా బయోగ్యాస్ తయారు చేసి టిటిడి అన్నప్రసాద కేంద్రానికి సరఫరా చేసేందుకు ఐఒసిఎల్ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ఇందుకోసం బయోగ్యాస్ ప్లాంట్ నిర్వహణను రూ.2.80 కోట్లతో జిపిఎస్ రెన్యువబ్లస్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపారు. శ్రీవారిపోటులో లడ్డూల తయారీని మరింత వేగవంతం చేసేందుకు 400 మంది అదనపు అవుట్‌సోర్సింగ్ కార్మికుల పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు పంపారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాలను పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అదనపు సిబ్బందికి తిరుమలకు రవాణా ఛార్జీలు చెల్లించేందుకు నిర్ణయించారు. ఇందుకోసం 3 సంవత్సరాలకు రూ.1.60 కోట్లు మంజూరు చేశారు. తిరుపతి జిల్లా నారాయణవనంలోని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం ఏర్పాటు చేసేందుకు ఆమోదించారు. చెన్నైలోని పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం చేసేందుకు రూ.17.05 కోట్లకు ఆమోదం తెలిపారు. తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమీకి కేటాయించిన టిటిడి భవనం లైసెన్సు

# 'బోదకాళ్లు'కు చెక్!

>> చారు. ఏళ్ల తరబడి బోదకాలు వ్యాధితో బాధపడుతున్న పెదపెంకి గ్రామంలో పారిశుద్ధ్య లోపాలు సరిచేయడంతో పాటు గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు పవన్ కల్యాణ్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. గ్రామంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అవసరమైన వాతావరణం కల్పించే దిశగా చేపట్టిన ఈ పనులు తుది దశకు చేరినట్టు అధికారులు తెలియజేశారు.

గ్రామంలో రూ.4.68 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో 27 అంతర్గత సిమెంటు రోడ్ల నిర్మాణం, 12 సిమెంటు డ్రెయిన్లు, ఆరు డ్రెయిన్ కమ్ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గ్రామంలో పూర్తి చేసిన అంతర్గత సిమెంటు రోడ్ల పొడుగు దాదాపు కిలోమీటరు ఉండగా, డ్రెయిన్లు కిలోమీటరున్నర వరకు ఉన్నాయి. మురుగు నివారణ, పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా నిర్మాణం చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్లు 48కిగాను 41 నిర్మాణం పూర్తయినట్టు వివరించారు. గ్రామంలోని తెలగ వీధి, కొత్త వీధి, పెద్ద వీధి, చీకటి వీధి, పిలక వీధి, ఎన్‌టిఆర్ కాలనీ, మెయిన్ వీధి, ఎస్టీ కాలనీలలో నిర్మించిన సిసి ఓపెన్ డ్రెయిన్లు, మ్యాజిక్ డ్రెయిన్లు మురుగు నీటి సమస్యలను గణనీయంగా తగ్గించాయని, బంకూరు వీధి మరియు చీకటి వీధిలో సిసి రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో ప్రజల రాకపోకలు సులభతరమయ్యాయని వెల్లడించారు. పూర్తయిన మ్యాజిక్ డ్రెయిన్ల పొడుగు రెండు కిలోమీటర్ల వరకు ఉంది. మరో 670 మీటర్లలో నిర్మిస్తున్న ఏడు మ్యాజిక్ డ్రెయిన్లు కూడా దాదాపు పూర్తి కావచ్చినట్టు తెలిపారు. దీంతోపాటు రోడ్లకు ఇరువైపులా కొబ్బరి చెట్లు, కోనేరు సుందరీకరణ తదితర పనుల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 3,000 వరకు మొక్కలు నాటినట్టు చెప్పారు. రోజుల వ్యవధిలో పూర్తి స్థాయిలో రోడ్లు, డ్రెయిన్లు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉంటాయని వివరించారు. పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా వ్యక్తిగత, సామాజిక ఇంకుడు గుంతలు, కంపోస్ట్ పిట్స్ పనులు కూడా చేపట్టినట్టు తెలిపారు. బోద కాలు సమస్య తీవ్రత నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పెదపెంకిలో ప్రతి గ్రామస్తుడికీ వ్యక్తిగత హెల్త్ ప్రొఫైల్స్ సేకరించి, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్స్ రూపొందించినట్టు వివరించారు.

పెదపెంకి గ్రామంలో అభివృద్ధి పనులు ముందుకు తీసుకువెళ్లేందుకు ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదుర్కొని ముందుకు తీసుకువెళ్లిన అధికారులను పవన్ కల్యాణ్ అభినందించారు. త్వరలో పెదపెంకిలో క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని, నిర్మించిన రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెదపెంకి గ్రామాన్ని పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# మైనింగ్ రగడ

>> సుమారు 1,300 ఎకరాల భూమి ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. కొణిజేడు ప్రాంతంలో 300 ఎకరాలు, కందులూరులో 100 ఎకరాలు, మార్లపాడులో 300 ఎకరాలు, ఎర్రజెర్లలో 300 ఎకరాలు, సూర్యారెడ్డిపాలెంలో 200 ఎకరాలకు పైగా భూములు ప్రాజెక్టు పరిధిలో ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్వహణలో జేఎస్‌డబ్ల్యూకు 89 శాతం వాటా, ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీకి 11 శాతం వాటా ఉండటంపై సురేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఏపీఎండీసీ జిమ్‌టెక్స్ అనే సంస్థను తీసుకువచ్చి అనంతరం జేఎస్‌డబ్ల్యూకు అప్పగించిందని ఆయన పేర్కొన్నారు. 2015లో మంజూరైన పర్యావరణ అనుమతులను ఆధారంగా చేసుకుని తాజా ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే డ్రిల్లింగ్, తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. 2011లో జిల్లా కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన సమయంలోనే గ్రామస్థులు మైనింగ్‌ను తీవ్రంగా వ్యతిరేకించారని, అప్పట్లో గ్రామాల్లో పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని గుర్తుచేశారు. ప్రస్తుతం మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లే గ్రామస్థులను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మైనింగ్ పనులకు సంబంధించి సరైన మైనింగ్ ప్రణాళికలు, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, జాయింట్ వెంచర్ పత్రాలు అందుబాటులో ఉన్నాయా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైనింగ్ ప్రాంతంలోని ఇనుప ఖనిజంలో మాగ్నటైట్ శాతం తక్కువగా ఉందని, దీంతో ఖనిజాన్ని శుద్ధి చేయడానికి విస్తృతమైన ప్రక్రియ అవసరమవుతుందని తెలిపారు. శుద్ధి ప్రక్రియకు భారీగా నీరు అవసరమవుతుందని, దీనివల్ల భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడంతోపాటు నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. స్థానికంగా సుమారు 500 ఎకరాల చెరువులు, కుంటలు, సమీపంలోని ఎన్ఎస్‌పీ కాలువపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వంద ఎకరాలకు పైగా పశువుల మేత భూములు దెబ్బతిని పశువులకు మేత, నీటి కొరత ఏర్పడుతుందని గ్రామస్థులు తెలిపారు. సారవంతమైన వ్యవసాయ భూములు దెబ్బతింటే రైతుల జీవనోపాధి తీవ్రంగా ప్రభావితమవుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతున్నప్పటికీ స్థానికులకు ఎక్కువగా ప్రమాదకరమైన, నైపుణ్యం లేని పనులే దక్కే అవకాశం ఉందని సురేష్ విమర్శించారు. మైనింగ్ పనులను తక్షణమే నిలిపివేసి జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రాంతాన్ని సందర్శించాలని, ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పత్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా బలవంతంగా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తే పెద్దఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని సురేష్ హెచ్చరించారు. గ్రామాల భవిష్యత్తు, పర్యావరణం, వ్యవసాయ భూములు, నీటి వనరులు, ప్రజల జీవనోపాధిని కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని గ్రామస్థులు స్పష్టం చేశారు.మైనింగ్ పనులు నిలిపివేయాలంటూ ఐదు గ్రామాల ప్రజలు ముఖ్యంగా మహిళలు యువత అన్ని వర్గాల వారు తీవ్ర నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వడంతో స్థానిక పోలీసులు ఆందోళనకు గురి అయ్యారు నిరసన కారులను అడ్డుకునేందుకు శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం భారీగా పోలీసు బలగాలను మోహరించాయి అయినప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా సామరస్య పూర్వకంగా తమ నిరసనను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి తమ ప్రాంతాలకు నష్టం జరగకుండా కాపాడాలని జిల్లా అధికారులను డిమాండ్ చేస్తూ నిరసనలు కొనసాగించారు.


10-9pg3exHMNWJQEBG:10-9pg3exHMNWJQEBG.qxd 9/9/2026 11:49 PM Page 1



# ప్రతి వారమూ ప్రజల మధ్యలోనే

## సంక్షేమం- అభివృద్ధి- సుపరిపాలనే మూల మంత్రాలు

- గత పాలకుల పాపాల్ని కడిగి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- 16 లక్షల ఎకరాలు 22ఏ జాబితా నుంచి తొలగింపు
- రీసర్వే 2.0తో రాష్ట్రంలో భూ వివాదాలన్నీ పరిష్కారం
- పి.గన్నవరం 'మీ భూమి మీహక్కు' గ్రామ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇపిడిసిఎల్ చేపట్టిన విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణ పనులకు సిఎం శంకుస్థాపన



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే మూల మంత్రాలుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రతి వారమూ ప్రజల మధ్యలోనే ఉంటున్నానని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే అసలైన సుపరిపాలన అని దానికి కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని అన్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం పండువారిపేటలో నిర్వహించిన 'మీ భూమి మీహక్కు' గ్రామసభలో సిఎం పాల్గొని సిఎం ప్రసంగించారు. ప్రతి నెలలోనూ వీలైనన్ని సార్లు ప్రజల మధ్యకు వచ్చి బాగోగులు తెలుసుకుంటున్నానని అన్నారు. ప్రతినెలా మొదటి తేదీనే పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ ప్రజల్ని కలుస్తూ వారి కష్ట సుఖాలను తెలుసుకుంటున్నానని అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కింద నాలుగో శనివారం హాజరవుతున్నట్టు సిఎం వివరించారు. పి4తో సామాజిక బాధ్యత కింద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి చేస్తేనే సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని జీవన ప్రమాణాలు పెంచి అంతా గౌరవంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**భూమికి భద్రత ఇచ్చేలా..:** ప్రతీ నెలా 9 తేదీనే 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమానికి హాజరై రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. భూమిపై రైతులు, యజమానులకు హక్కులు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పాలకులు రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి వ్యవస్థను ధ్వంసం చేశారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చి ప్రజల భూముల్ని కాజేసే ప్రయత్నం చేశారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసేశామని తెలిపారు. గత పాలకులు రీసర్వే పేరుతో అనేక ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని మండిపడ్డారు. పూర్వీకుల నుంచి వచ్చిన వారసత్వ భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారని అన్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్ధం కాలేదన్నారు. ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులు పెట్టారన్నారు. అందుకే పటిష్టంగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి ఎక్కడా అవకతవకలు లేకుండా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఇస్తున్నామన్నారు. ఇకపైపై, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ లాంటి భద్రతా ఫీచర్లను పెట్టి పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు.

**రెవెన్యూ సంస్కరణలు..:** భూమికి భద్రత ఇవ్వటమే కూటమి ప్రభుత్వ అజెండా అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ 8234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 36 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చినట్టు సిఎం వివరించారు. వచ్చే మార్చి నాటికి 8,582 గ్రామాల్లో 56 లక్షల పాస్ పుస్తకాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవల్ని అందుబాటులోకి తెచ్చామని అన్నారు. వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని రూ.వెయ్యికే పరిమితం చేశామని అన్నారు. 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు. తప్పులు సరిచేసి 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి సమస్యను పరిష్కరించామని వివరించారు. శెట్టిపల్లి కంగుంది, వట్టి చెరుకూరు, ముదినేపల్లి లాంటి చోట్ల దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు విముక్తి కల్పించామని అన్నారు. అమలాపురంలోని మాచవరం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటీష్ కాలంలో 1908 నుంచి 22 ఏ1 కింద భూములు నిషేధంలో ఉన్నాయని ఈ సమస్యను కూడా పరిష్కరిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. 56.37 ఎకరాల భూమిని 1410 మందికి లబ్ది కలిగేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గొడ్డలి పార్టీ చేసిన తారుమారు చేసిన రికార్డుల్ని ప్రక్షాళన చేసి భూ సమస్యల్ని కొలిక్కి తెస్తున్నామని సిఎం వివరించారు.

**నిత్యం ప్రజల గురించే తపన..:** నీటి భద్రతకు, భూమి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నుంచి ఈ యేడాది వెయ్యి టిఎంసిలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లిందన్నారు. ఆ నీటిని వినియోగించుకుంటే రాష్ట్రానికి ప్రయోజనం కలిగేదని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయిందని.. రాజకీయ కక్షతో కాంట్రాక్టర్ని మార్చటంతో ప్రాజెక్టు ఆలస్యమైందని స్పష్టం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిగా పనిచేసిందని రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నట్టు వివరించారు. ప్రజలకు మరింతగా మేలు చేసే అంశంపై రెండు రోజుల పాటు సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేలకూ దిశానిర్దేశం చేశామన్నారు. జిల్లా కలెక్టర్లతోనూ సమావేశాలను నిర్వహించి క్షేత్రస్థాయిలో పౌరసేవల్ని అందించే అంశంపై స్పష్టంగా ఆదేశాలు ఇస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇన్ని రకాల ఆలోచనలతో ప్రజలకు మేలు చేస్తుంటే గొడ్డలి పార్టీ నిత్యం కుట్రలు పన్నుతూ అభివృద్ధిని అడ్డుకుంటోందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. అంతకు ముందు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఇపిడిసిఎల్ రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన 3 ఫేజ్ కరెంటు ఇచ్చేలా గ్రిడ్ ఆధునీకరణ పనులకు సంబంధించి శిలాఫలకాన్ని సిఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, ఎంపి గంటి హరీష్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

# నేడు జిల్లా కలెక్టర్ల సదస్సు

- జిఎస్‌డిపి, సూపర్ 6, తాగునీరు, గృహనిర్మాణం, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్‌పై చర్చ
- ఇ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర నిధుల వినియోగంతో పాటు పలు అంశాలపై సమీక్ష

**విజయవాడ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు 10, 11వ తేదీల్లో జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొననున్నారు. 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతోనే మొదటి రోజు సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు లాంటి కీలక విభాగాల వారీగా సమీక్షించనున్నారు. అలాగే ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల అమలు వంటి వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు.

**రెండు రోజులు... 19 అంశాలు:** మొదటి రోజు జిఎస్‌డిపి, స్వర్ణాంధ్ర విజన్‌కు జిల్లాస్థాయి రోడ్‌మ్యాప్‌లపై సమీక్షిస్తారు. అదే విధంగా సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్యా రంగంలో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్ సదస్సులో పలువురు కలెక్టర్లు ప్రదర్శిస్తారు. ఇక రెండో రోజు సదస్సులో ఇగవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్‌టిజిఎస్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీ ర్యాంకింగ్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్షి ంచి అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్ధేశం చేయనున్నారు.

# గుంటూరు ఛానల్ భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్

**విజయవాడ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు ఛానల్ భూసేకరణ ఫైలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సిఎస్ సాయిప్రసాద్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సంతకాలతో ఫైలు మంజూరైంది. ఈ వారంలోనే గెజిట్ నోటిఫికేషన్ జారీకి రంగం సిద్ధం చేశారు. గుంటూరు ఛానల్ భూసేకరణ ప్రక్రియను ఎమ్మెల్యే ఏలూరి వేగవంతం చేశారు. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నా గుంటూరు ఛానల్‌కు ప్రాధాన్యత కల్పించేలా కృషి చేశారు. భూసేకరణకు అవసరమైన అనుమతులు పూర్తికావడంతో త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. గెజిట్ అనంతరం భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయనుంది. గుంటూరు ఛానల్‌తో సుమారు 28 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం చేకూరనుంది. గుంటూరు ఛానల్ ప్రాజెక్టు 28 వేల ఎకరాల సస్యశ్యామలానికి బాటలు వేస్తోంది. గుంటూరు ఛానల్ ఫైలుకు ఆమోదం లభించడంపై సిఎం చంద్రబాబుకు ఏలూరి కృతజ్ఞతలు తెలిపారు.

# చంద్రబాబు అరెస్ట్‌తోనే వైసిపి పతనం

- మంత్రి నాదెండ్ల మనోహర్



**అమరావతి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి ప్రభుత్వం అధికారంతో కళ్లు మూసుకునిపోయి చంద్రబాబును సెప్టెంబరు 2023న అక్రమంగా అరెస్ట్ చేసిందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటన చరిత్రలో చీకటి సంఘటనగా నిలిచిపోతుందన్నారు. ఆనాడు చంద్రబాబుకు తమ అధినేత పవన్ కల్యాణ్ మద్దతు తెలపకుండా వైసిపి ఆయనను అన్ని రకాలుగా అడ్డుకుందన్నారు. పవన్ ఎపికి రాకుండా ఫ్లైట్‌ను క్యాన్సిల్ చేసిందని, రోడ్డు మార్గంలో కూడా రాకుండా సూర్యాపేట నుంచే ఆటంకాలు కలిగించిందని దుయ్యబట్టారు. ఆ రోజు వీర మహిళలు, జనసైనికులు స్వచ్ఛందంగా రోడ్ల పైకి వచ్చి పవన్ కల్యాణ్‌కు అండగా నిలిచారన్నారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించిన వైసిపి ప్రభుత్వ పతనం సెప్టెంబరు9 నుంచే ప్రారంభమైందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితమైందన్నారు. అలాగే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా జగన్ ఓటమి ఖాయమని మనోహర్ విశ్వాసం వ్యక్తంచేశారు. ఆ విషయం జగన్‌కు కూడా తెలుసన్నారు. వైసిపికి అభ్యర్థులు కూడా లేరని అందుకే ఏకగ్రీవాలపై జగన్ బెదిరింపు తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుని వంద శాతం ఎన్నికల్లో విజయం సాధిస్తామని మనోహర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# వెలంపేటలో పేదల కల సాకారం

- 12 అంతస్తుల గృహ సముదాయానికి శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ
- రూ.28.44 కోట్లతో 177 కుటుంబాలకు గృహ సముదాయం



**విశాఖపట్నం, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** విశాఖ దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు పరిధిలోని వెలంపేటలో చేపట్టనున్న బహుళ అంతస్తుల గృహ సముదాయం రీడెవలప్మెంట్ పనులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి లబ్ధిదారులకు హామీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ పేదలకు గౌరవప్రదమైన, సురక్షితమైన, నాణ్యమైన గృహాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వెలంపేట, లక్ష్మీనగర్ ప్రాంతంలో సుమారు 55 సెంట్ల స్థలంలో 50 ఏళ్లుగా 177 కుటుంబాలు ఇబ్బందులతో నివసిస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, స్లమ్ రీడెవలప్మెంట్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. సుమారు రూ.28.44 కోట్ల వ్యయంతో 177 కుటుంబాలకు ఈ గృహ సముదాయాన్ని నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. మొత్తం 2,691 చదరపు అడుగుల విస్తీర్ణంలో, సుమారు 45 మీటర్ల ఎత్తుతో 12 అంతస్తుల భవనాన్ని ఆధునిక షేర్‌వాల్ టెక్నాలజీతో నిర్మించనున్నట్లు చెప్పారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా 9 నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఎన్‌సీసీ సంస్థకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఒక్కో గృహ యూనిట్ విలువ సుమారు రూ.16.07 లక్షలు ఉంటుందని తెలిపారు.

వెలంపేట స్లమ్ రీడెవలప్మెంట్ ప్రాజెక్టును రాష్ట్రంలోనే తొలి మోడల్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. 2014-19 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల టిడ్కో ఇళ్లను మంజూరు చేశామని, గత ప్రభుత్వ హయాంలో వాటి నిర్మాణాన్ని నిలిపివేశారని మంత్రి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, టిడిపి దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త సీతంరాజు సుధాకర్, బిజెపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి బొత్స సురేష్, జివిఎంసి అధికారులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ.రెహమాన్, కూటమి నాయకులు, వార్డు అధ్యక్షులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఉండవల్లిలో 53 కొవ్వొత్తులు వెలిగిస్తున్న టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్

# చంద్రబాబు అరెస్టుకు మూడేళ్లు.. 'నిజం గెలిచింది'

**విజయవాడ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి హయాంలో టిడిపి అధినేత, అప్పటి విపక్షనేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు గురై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా "ఎక్స్" వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు. 'నిజం గెలిచింది' అంటూ చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే అప్పటి అధికార పక్షమైన గొడ్డలి పార్టీ సరిగ్గా మూడేళ్ల క్రితం చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు జైలులో ఉన్న ఆ 53 రోజుల పాటు ఆయనకు అండగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరూ "నిజం గెలవాలి" అనే నినాదంతో మద్దతుగా నిలిచారని లోకేష్ గుర్తుచేసుకున్నారు. చివరకు ఆ అక్రమ కేసులన్నింటినీ న్యాయస్థానాలు కొట్టివేశాయని, న్యాయమే గెలిచి చంద్రబాబు నిర్బంధం నుంచి స్వేచ్ఛగా బయటకు వచ్చారని తెలిపారు. నాటి చీకటి రోజులను తలుచుకుంటూ, చంద్రబాబుకు, పార్టీకి అండగా నిలిచిన తెలుగుజాతి మొత్తానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**పార్టీ జాతీయ కార్యాలయం నుంచి బూత్ స్థాయి వరకు 53 కొవ్వొత్తులతో ప్రజలకు సందేశం:** చంద్రబాబు అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా 'నిజం గెలిచింది' అనే సందేశంతో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని 175 నియోజక వర్గాల్లో జాతీయ పార్టీ కార్యాలయం నుంచి బూత్ స్థాయి వరకు ఈ కార్యక్రమం జరిగింది. 21 మంది మంత్రులు, 113 మంది ఎమ్మెల్యేలు, 41 మంది నియోజకవర్గ ఇంచార్జీల ఆధ్వర్యంలో నిజం గెలిచింది కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించబడింది. చంద్రబాబు జైలులో గడిపిన 53 రోజులకు గుర్తుగా 53 కొవ్వొత్తులు వెలిగించి నాడు జరిగిన ఘటనను, ఆ తర్వాత ప్రజా తీర్పుతో నిజం గెలిచిన విషయాన్ని ప్రజలకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో 5 మంది జోనల్ కోఆర్డినేటర్లు, 23 మంది పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, 6 మంది ఎంపిలు, 110 మంది కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. వీరితో పాటు మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 53 కొవ్వొత్తులు నాటి చీకటి రోజులకు గుర్తుగా, చివరకు నిజం గెలిచిందనే విజయానికి ప్రతీకగా వెలిగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి జరిగిన ఈ కార్యక్రమం ద్వారా "నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం గెలిచింది.. ప్రజల తీర్పు గెలిచింది" అనే సందేశాన్ని టిడిపి శ్రేణులు చాటిచెప్పారు. ఉండవల్లి నివాసంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ 53 కొవ్వొత్తులు వెలిగించారు. ఐదు దశాబ్దాల నిస్వార్థ రాజకీయ విలువల శిఖరం నారా చంద్రబాబునాయుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది తెలుగు ప్రజల ఆశీస్సులతో కడిగిన ముత్యములా తప్పుడు కేసుల నుంచి బయటకు వచ్చారని లోకేష్ పేర్కొన్నారు. ప్రజా బలమే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకి శ్రీరామరక్ష అని ధీమా వ్యక్తం చేశారు.

# కళ్యాణదుర్గంలో టిడిపి భారీ ర్యాలీ




**అనంతపురం, సెప్టెంబరు 9 ప్రభాతవార్త బ్యూరో:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు 'నిజం గెలిచింది' అనే కార్యక్రమం కింద అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో బుధవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. టిడిపి అధినేత చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులతో 53రోజులు జైలులో గడిపి చివరికి సుప్రీం కోర్టులో నిరూపించలేకపోవడంతో ఆ కేసును కొట్టివేయడంతో నేటికి మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించారు. 'నిజం గెలిచింది' అన్న నినాదంతో నాటి వైసిపి నియంత్రత్వ పాలనపై కొవ్వొత్తులతో శాంతి ర్యాలీని పట్టణంలోని టీ సర్కిల్ నుంచి చేపట్టి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయనకు పూలమాలలు వేసి నివాళి అర్పించి అక్కడి నుంచి పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ వరకు వెళ్లి అక్కడ అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు నివాళి అర్పించారు.

# జైల్లో పెట్టగలిగారు.. కానీ నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు

## వారి రాక్షస చర్యకు నేను కుంగిపోలేదు ● 'ఎక్స్' వేదికగా సిఎం చంద్రబాబు భావోద్వేగ పోస్ట్

**విజయవాడ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి మూడేళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా సిఎం భావోద్వేగ పోస్ట్ పెట్టారు. 'ప్రజల కోసం నిలబడితే.. ప్రజలు మన వెంట నిలబడతారని వ్యాఖ్యానించారు. నిజం కోసం నిలబడితే. నిజమే మనల్ని నిలబెడుతుందని ఇదీ తన నమ్మకం' అని పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం కుట్ర పూరితంగా జరిగిన ఓ పరిణామం తనలో ఆ నమ్మకాన్ని, విశ్వాసాన్ని మరింత పెంచిందని తెలిపారు. "గత ప్రభుత్వ హయాంలో ఇదే రోజున ఏ తప్పూ చేయని నన్ను అక్రమంగా అరెస్ట్ చేసి 53 రోజులు జైల్లో నిర్బంధించారు. నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు. వారి రాక్షస చర్యకు నేను కుంగిపోలేదు. లొంగిపోలేదు. దీనికి కారణం నాకు లభించిన ప్రజా మద్దతు. ఆ రోజు ప్రజాస్వామ్యం కోసం తెలుగు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు నిలబడ్డారు. నాటి నిర్బంధ పరిస్థితుల్లో ప్రజలు చూపిన సంఘీభావం, తెగువ నా జీవితంలో ఎన్నటికీ చెరగని జ్ఞాపకం. నన్ను నిర్బంధించగలిగారు.. కానీ దేశ విదేశాల్లో నా కోసం మీరెత్తిన గొంతును నొక్కలేకపోయారు. ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని, సత్యాన్ని గెలిపించేందుకు మీరు పోరాడారు. 2024 ఎన్నికల్లో ఓటు ద్వారా మరింత బలంగా ప్రజలు మద్దతును చాటారు. కక్షసాధింపు రాజకీయాలను ఓడించి.. నిజాన్ని గెలిపించి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను అప్పగించారు. నాటి ఘటనలను, పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ 'నిజం గెలిచింది' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించడం ప్రజల కోసం మరింత కష్టపడాలనే సంకల్పాన్ని ఇంకా బలపరిచింది. నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలుగు జాతిని నంబర్ వన్ చేయాలనే నా కలను మీ అందరి సహకారంతో నిజం చేస్తానని మాట ఇస్తున్నాను' అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.



మూడేళ్ల కితం పోలీసుల అదుపులో అప్పటి విపక్ష నేత, ఇప్పటి సిఎం చంద్రబాబు(ఫైల్)

# ఆ రోజే వైసిపి పతనం మొదలైంది: మంత్రి నారాయణ




**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి రోజని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన, అపార రాజకీయ అనుభవం కలిగిన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడిని అక్రమ కేసులో అరెస్ట్ చేసి 53 రోజులు జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టుకు మూడేళ్లు పూర్తైన సందర్భంగా నెల్లూరు జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహించిన 'నిజం గెలిచింది' కార్యక్రమంలో మంత్రి నారాయణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్, పార్టీ ముఖ్యనేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 53 జ్యోతులను వెలిగించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ దర్యాప్తు పేరుతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రత్యర్థిని వేధించేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యంలో అతిపెద్ద తప్పిదమన్నారు. చంద్రబాబు అరెస్టును దేశవ్యాప్తంగా ప్రజలు, రాజకీయ వర్గాలు తీవ్రంగా వ్యతిరేకించాయని తెలిపారు. అక్రమ అరెస్టుకు ప్రజలు ఎన్నికల్లోనే సమాధానం చెప్పారు. వైసిపిని కేవలం 11సీట్లకే పరిమితం చేసి, ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని అన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేసిన రోజే వైసిపి పతనానికి నాంది పడిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలని ప్రయత్నించిన వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పారన్నారు. అధికారంతో ఎన్ని కుట్రలు చేసినా చివరకు గెలిచేది నిజమే. అందుకే నేడు నిజం గెలిచింది అని గర్వంగా చెప్పుకుంటున్నాం అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేసిన రోజే వైసిపి పతనం ప్రారంభమైందన్నారు. ప్రజాస్వామ్యాన్ని వైసిపి పరిహాసం చేసిందని, ఆ ఘటనకు నేటితో మూడేళ్లు పూర్తయ్యాయని అన్నారు. ప్రజల హక్కులను, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు టిడిపి కార్యకర్తలు పోరాడారని తెలిపారు. చంద్రబాబును జైల్లో పెట్టినా ప్రజల గుండెల్లో నుంచి మాత్రం దూరం చేయలేకపోయారన్నారు. ప్రజల తీర్పుతో వైసిపికి గట్టి గుణపాఠం ఎదురైందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, జిల్లా పార్టీ కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అనూరాధ, మాజీ జడ్‌పిటిసి విజేతా రెడ్డి, కార్పొరేటర్లు, టిడిపి ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గట్టిగా పోరాడదాం.. జరిగేది కురుక్షేత్ర సంగ్రామం

- స్థానిక సంస్థల ఎన్నికలపై జగన్ కీలక వ్యాఖ్యలు



**విజయవాడ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలపై వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికలు జరుగుతాయో లేదో కూడా స్పష్టత లేదన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు బిసిలకు 34 శాతం రిజర్వేషన్ల పేరుతో డ్రామా చేస్తున్నారని, ఆ అంశాన్ని సాకుగా చూపించి ఎన్నికలను వాయిదా వేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి శ్రేణులు గట్టిగా నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు, ఎలా జరిగినా ప్రజలకు వైసిపి తోడుగా నిలబడుతుందన్నారు. ఎన్నికలు సాఫీగా జరిగితే వైసిపిదే విజయం అని, ఎన్నికలు సాఫీగా జరగనివ్వకపోయినా గట్టిగా పోరాడదాం అని, జరిగేది కురుక్షేత్ర సంగ్రామం అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో పర్చూరు నియోజకవర్గ వైసిపి నేతలతో జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సిఎం జగన్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతున్నప్పటికీ, అది న్యాయస్థానంలో నిలబడదని సిఎం చంద్రబాబుకు ముందే తెలుసని వ్యాఖ్యానించారు. కోర్టు ఆ రిజర్వేషన్లను కొట్టివేస్తే అదే కారణంతో స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని ప్రభుత్వమే చెబుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు నిజంగా సజావుగా జరుగుతాయా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నికలు సాఫీగా జరిగే అవకాశం లేదని విమర్శించారు. అధికారాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, అరెస్టులు, జైలు పంపడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. రోజుకో డ్రామా, రోజుకో నటన, డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందన్నారు. అయితే ఎన్నికలు ఎప్పుడు, ఎలా జరిగినా ప్రజలకు వైసిపి అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేశారు.

**పాదయాత్ర 2.0పై వైఎస్ జగన్ క్లారిటీ:** వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ పాదయాత్రపై కీలక వ్యాఖ్యలు చేశారు. పర్చూరు నియోజక వర్గానికి చెందిన వైసిపి నేతలతో జరిగిన సమావేశంలో 'పాదయాత్ర 2.0'పై జగన్ ప్రస్తావించారు. వచ్చే యేడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో పాదయాత్ర చేపట్టే అవకాశం ఉందని చెప్పారు. ఈ ప్రకటనతో వైసిపి శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.


రచయితతో అరగంటసేపు మాట్లాడే అవకాశం గనుక దొరికితే ఆయన రాసిన గ్రంథాన్ని చదవను.

న- ఉడ్రోవిల్సన్

# వంటబట్టని ఇంటి భోజనం!

ఏం కొనేటట్టు లేదు. ఏం తినేటట్టు లేదు. అక్షరాలా నిజం. ఎవరి పుణ్యమైనా ప్రస్తుతం ఉద్యోగ ఉపాధుల సంపాదన పరిమితి పెరగలేదు. కానీ నిత్యావసరాల ధరలు పెరిగిపోయి సామాన్యునికి వేదన మిగిలింది. పప్పో, ఉప్పో కలిసి తిందామన్నా వాటి ధరలు ఊహించనంత పెరిగిపోయాయి. మార్కెట్‌లో వాటి ధరలు పెరిగినప్పుడల్లా ఆ ఇంటి ఇల్లాలు వినియోగ వస్తువుల వాడకాన్ని పొదుపు చేసే మార్గం గురించి ఆలోచిస్తుంది. కానీ బజార్‌కు వెళ్తే ఏ వస్తువునూ కొనేందుకు వినియోగదారుని జేబులో ఉన్న డబ్బులు చాలవు. సరిపడనంతగా లేవు. ప్రభుత్వమైనా, ప్రైవేట్ వారైనా ఉద్యోగులకు ఇటీవల కాలంలో ఏమాత్రం జీతాలు పెరుగలేదు. దాంతో ఒక్కసారిగా మీదపడిన ధరల భారంతో సామాన్యుడు సతమతమవుతున్నాడు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో తొలుత వంటింటి గ్యాస్ మీద దెబ్బ పడింది. కొరత ఏర్పడింది. ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర పెరిగింది. ఇప్పుడు ఇల్లు ఇరకటం అయికూర్చుంది. అంతకుముందే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధర బాగా పెరిగిపోయి 'బజారు భోజనం రేటు పెంచేశారు. ఇప్పుడా కమర్షియల్ గ్యాస్ ధర తగ్గినా బయట హోటళ్లలో టిఫిన్, లంచ్ తదితర అల్పాహార ధరలు తగ్గుముఖం పట్టలేదు. పైగా ఇంటికి సరఫరా చేసే గ్యాస్ సిలిండర్ల సరఫరా బుకింగ్‌లో గడువు తేదీని, మార్కెట్ పొదుపు రీత్యా గతంలో 45 రోజులకు పెంచారు. తాజాగా గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేనందున ఆ వ్యవధిని 25 రోజులకే పరిమితిని తగ్గించారు. దీనివలన కూడా ఇంటి భోజనానికి ఎలాంటిఊరట కలుగలేదు. సామాన్యుడు మార్కెట్‌కు వెళ్లి సంచి కూరగాయలు కూడా కొని తెచ్చుకోలేకపోతున్నాడు. అందుకే గత 5 నెలల్లో బయటి భోజనం నషాళానికెక్కి వండిన పదార్థాలు వంటబట్టడం లేదు. ఎక్కడి భోజనమైనా ధర పోసి సమకూర్చుకునే పరిస్థితుల్లేవు. ఈ అంశాలపై తాజాగా రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఆగస్టు నెల నివేదికను విడుదల చేసింది. శాకాహార భోజనం ధరలు బాగా పెరిగాయి. ప్లేటు వంద రూపాయలపైమాటే. మాంసాహారం పైన 5 శాతం ఖర్చు పెరిగింది. ఇది అతిసాధారణమైన సర్వేగా చెప్పుకోవాలి. క్షేత్రీయంగా బజార్లలోకి వెళ్లి పరకాయిస్తే అంతకన్నా ఎక్కువే ధర పలుకుతుంది. గట్టిగా సాధారణ గృహస్థుడు సకుటుంబసపరివార సమేతంగా ఏ పంచభక్ష్య పరమాన్నాలు తినే పరిస్థితి కనిపించడం లేదు. ధరాభారంతో వంట ఆ ధరువులను తగ్గించుకోవాల్సి వస్తోంది. ఉల్లిపాయలు, వంటనూనెలు, బియ్యం, ఎల్‌పిజి గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గత యేడాదితో పోల్చిచూస్తే ఖర్చు అధికమైంది. బంగాళాదుంపలు, టమోటా ధరలు తగ్గినా వాటి ప్రభావం వంటింటి భోజనంపై పడలేదు. కూరగాయల ధరలు 5శాతానికి పెరిగాయి. క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదికను 'రోటీ రైస్ రేట్' పేరిట విడుదల చేసింది. ఇంటిభోజనం ఖరీదైతే కుటుంబ ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిపోతుందన్న విషయం తెలుసుకుని నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో కేంద్రం జోక్యం చేసుకోవాల్సిన అవసరముంది. ఆమధ్య ఖాద్యతైలాల ధరలు వంట గ్యాస్ ధరలు పెరగడం ఇతరత్రా రవాణా చార్జీలపై ప్రభావం పడి దాదాపు అన్ని ముడిసరుకుల మీద ధరల భారం పడింది. ఈసారి బియ్యం ధరలు అనూహ్యంగా పెరిగాయి. భారతదేశానికి బియ్యం వంటి ఉత్పత్తులకు ఆహార భద్రత, మిగులు ఉన్నందున బియ్యం రేట్లు తగ్గినా ఆశ్చర్యపోనక్కర్లేదనే విశ్లేషణలు ప్రసారమయ్యాయి. కానీ ఎందుకో బియ్యం రేట్లు కూడా ఆకాశానికెక్కాయి. తాజాగా చిన్న చిన్న దుకాణాలు వద్ద టీ ఉత్పత్తులు, పంచదార ధరలు పెరిగాయని అరకప్పుటీ ధర 12 రూపాయలు పెంచేసి అమ్ముతున్నారు. ధరవరలు పెరిగితే సామాన్యుడు విలవిల్లాడిపోతాడు. తాజాగా మధ్యతరగతి కుటుంబాలను ఈ భారం మోయలేనంతస్థాయికి చేరుకుంది. భారతీయ కుటుంబాలు తమ బడ్జెట్‌లో 40 శాతానికిపైగా ఆహార పదార్థాల కోసమే ఖర్చు చేస్తుంటాయి. జులై 2026లో వినియోగదారుల ద్రవ్యోల్బణం 4.5 శాతంకు చేరగా అది రిజర్వుబ్యాంకు పరిమితి 4 శాతం కన్నా ఎక్కువైంది. ఈ మధ్యనే విడుదలైన క్రిసిల్ నివేదిక ప్రకారం ఉల్లి, వంట నూనెలు, ఎల్‌పిజి గ్యాస్ ధరల పెరుగుదల కారణంగా 'సొంత ఇంటి భోజనం' కూడా భారమైంది. ఆగస్టులో ఉల్లి ధర 43శాతానికి పెరగ్గా, వంట నూనెల ధరలు 11శాతం, అల్లం ధర 50.41 శాతానికి, ఎల్‌పిజి ధర 10 శాతానికి పెరిగాయి. టమోటో ధరలు 28శాతం పడి పోయినట్లు తేలింది. టమాటో ధరలు కూడా తగ్గాయి. టమాటో రేటు కూడా పెరిగి ఉంటే సామాన్యుడి ఇంట ఆహార ఆవేదన మరీ దారుణంగా ఉండేది. ఇప్పుడు కూరగాయలే కాదు పప్పులు, గుడ్లు, మాంసం ధరలు కూడా పెరిగాయి. గల్ఫ్ దేశాల సంక్షోభం వల్ల ఎరువుల సరఫరాకు అంతరాయం ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ధరలు 7శాతం పెరిగితే వేతనాలు ఆ మేరకు పెరగలేదు. అసలు పెరగనే లేదని చెప్పాలి. మరో విషయం ఏమిటంటే పప్పు,నూనె కూరగాయలు తగ్గించి పచ్చడి మెతుకుల వైపు ఆశగా చూస్తున్నారు. రోజురోజుకు వంటగది ఖర్చు పెరుగుతోంది. నిత్యావసర కూరగాయల ధరలు ఆటుపోట్లు కారణంగా మొత్తం తాలికి అవసరమైన దినుసుల వినియోగంలో ధరల పెరుగుదల ఎక్కువ తక్కువల కారణంగానే ఇంటి భోజనం ఖర్చు కాస్త పరిమితంగానే ఉందని, లేకుంటే అసాధారణ స్థాయికి ఖర్చులు చేరిపోయి ఉండేవి. రబీ సరఫరా, ఖరీఫ్ పంటదాకా ఆలసనయం చేత రాబోయే కొద్ది కాలంలో ఉల్లిపాయల ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ధరల స్థిరీకరణ చర్యలు మరింత సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉంది.

యుద్ధకాలంలోనైనా, శాంతి సమయంలోనైనా ప్రభుత్వ ఆశయం ఒక్కటే కావాలి. పాలకుల కీర్తి కన్నా సామాన్యుల సంతోషం మిన్న.



విలియం హెన్రీ బ్రాయన్

యాచన వల్ల మానవుడు అల్పుడౌతాడు. బలి చక్రవర్తిని యాచించడానికి విష్ణుమూర్తి వామనుడు కావలసి వచ్చింది.



రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు



### రేబిస్ విషయంలో నిర్లక్ష్యం తగదు

రేబిస్ విషయంలో నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదు. వ్యాధిలక్షణాలు కనిపించిన తర్వాత రేబిస్‌దాదాపు వంద శాతంప్రాణాంతకమైనవ్యాధి. అందువల్ల జంతువు కాటుకు గురైన వెంటనే వైద్యుల సూచన మేరకు సమర్థమైన టీకాలు, అవసరమైన చికిత్స తీసుకోవడం అత్యంత కీలకం. ఇటీవల నకిలీ రేబిస్ టీకాలు గుర్తించబడిన ఘటన వైద్య భద్రతలో ఔషధాల సరఫరా వ్యవస్థను కట్టుదిట్టంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. నకిలీ టీకా తీసుకున్న వ్యక్తికి తాను రక్షణ పొందుతున్నాననే తప్పుడు భద్రతాభావం కలుగుతుంది. అదే ప్రాణాంతక ప్రమాదంగా మారవచ్చు. ప్రపంచ రేబిస్ భారంలో భారత దేశం వాటా సుమారు 40శాతం. దేశంలో ఏటా దాదాపు 20,000 మంది రేబిస్‌తో మరణిస్తున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. కాబట్టి ప్రతి టీకా మోతాదు నాణ్యతపై రాజీకి అవకాశం ఉండకూడదు. తయారీదారు నుంచి వైద్య కేంద్రం వరకు ప్రతి టీకాను గుర్తించగలిగే సమగ్ర డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రతి సీసాకు ప్రత్యేక గుర్తింపు, బ్యాచ్‌సంఖ్య, గడువు తేదీ వంటి వివరాలను సులభంగా ధృవీకరించే అవకాశం ఉండాలి.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### నైతిక విలువలను నేర్పించాలి

ప్రభుత్వ, ప్రైవేటువిద్యాసంస్థలలోఎల్కేజీ, యూకేజీ నుండి డిగ్రీస్థాయి వరకు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్రంలో వారంలో ఒకరోజు మధ్యాహ్నం విద్యార్థులకు నైతిక విలువల గురించి ఒక ప్రత్యేకమైన క్లాస్ బోధించాలి. విద్యార్థులకుక్రమశిక్షణ నేర్పడం చాలాఅవసరం. ఇది లేకపోవడం వలన సమాజంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురువులను గౌరవించడం, పూజించడం, సీనియర్లను గౌరవించడం, జూనియర్లను ప్రేమించడం, వంటి నైతిక విలువలను విద్యార్థులకు విద్యాసంస్థలలో తప్పని సరిగా నేర్పించాలి.

- కె. శ్రీనివాస్, వరంగల్

### సాంకేతిక లోపం

మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ఓపెన్ కావడం లేదు. తరుచూ సాంకేతిక లోపాలు ఎదురవుతున్నాయి. ఈ ట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజా వివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలి.

### రీల్స్‌కు బానిసలు కావద్దు

స్మార్ట్‌ఫోన్ చేతిలోకి వచ్చినప్పటి నుంచి ఈ మధ్య చాలా మంది రీల్స్ చేయడం, చూడటం ఒక వ్యసనంలా మార్చుకుంటున్నారు. కొద్దిసేపు వినోదం కోసం మొదలుపెట్టి గంటల తరబడి వాటిలోనే గడుపుతున్నారు. దీనివల్ల విలువైన సమయాన్ని కోల్పోవడమే కాకుండా ఆరోగ్య సమస్యలను కూడా కొని తెచ్చుకుంటున్నారు. మరికొందరు రీల్స్ మోజులో పడి ప్రమాదకరమైన పనులు చేస్తూ ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. రీల్స్ కోసం మన ప్రాణాలను, సమయాన్ని పణంగా పెట్టడం ఏమాత్రం మంచిదికాదు. స్మార్ట్‌ఫోన్‌నుసమాచారం, విజ్ఞానం, విద్య వంటి మంచి విషయాల కోసం ఉపయోగించాలి. వినోదానికి కొంత సమయం కేటాయించి, మిగిలిన సమయాన్ని మన అభివృద్ధికి ఉపయోగించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఫోన్‌లో ఏంచూస్తున్నారో, ఎంత సమయం గడుపుతున్నారో గమనిస్తూ వారికి మంచి అలవాట్లు నేర్పాలి. రీల్స్ మోజుకు దూరంగా ఉండి, అవసరానికి మాత్రమే ఉపయోగిద్దాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### రైతుల ఆదాయం పెంచాలి

ఉపాధిహామీ రూపాంతరం చెందిన పిమ్మట కేంద్ర ప్రభుత్వం ఉపాధికి హామీ పడుతూ ఆస్తుల సృష్టి, బహుళ రకాల ఆదాయమార్గాలపైన దృష్టిపెట్టినట్టు అర్థంఅవుతున్నది. ఇవ్వాలా ఎవరు అవునన్నాకాదన్న నీటివసతి పెరిగింది. అలాగే నీటిని ఒడిసిపట్టడం పైన ప్రజలలో అవగాహనా కూడా పెరిగింది. అయితే నీటి వసతి పెరగడం మూలంగా గాలిలో తేమ పెరిగి వివిధ రకాల పండ్లమొక్కల సాగుకి వీలుఅవుతున్నది. కాబట్టి ఉపాధిహామీ ద్వారామునుగా నేరేడు మామిడి, నిమ్మ దానిమ్మ బత్తయి వంటి మొక్కల పెంపకం పైన దృష్టి పెట్టాలి అంత మాత్రమేకాదు దీనివల్ల స్థిరమైన ఆదాయం సాధ్యం అవుతుంది. ఏపథకం సాఫల్యత ఆ పథకం అందించే ఆదాయం పైన ఆధారపడి ఉంటుంది. ఆకోణంలో చూసినప్పుడుఉపాధి హామీ రైతుల ఆదాయం సృష్టికి గొప్ప ఆదెరువు కాగలదు.

- భారత అవినాష్, జనగామ

### పత్రాలలో వివరాలు సరిగ్గా ఉండాలి

మన సామాజిక జీవితంలో ఏదైనా దరఖాస్తు చేయాలన్నా తగిన గుర్తింపుకార్డు ఇవ్వాలన్నా మనదగ్గర ఉన్నవివిధ ప్రభుత్వంచే గుర్తింపబడిన పత్రాల వివరాలు సరిగ్గా ఉండాలి. లేదంటే ఎక్కడైనా అవసరంవస్తే తిరస్కరించే అవకాశాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముందుగానే వివరాలు తెలుసుకుని సక్రమంగా ఉంచుకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులుండవు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)


# బిసి రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వాలదే అధికారం!

*తెలుగు దేశంపార్టీ అంటే బిసిల పార్టీ అనే ప్రచారంలోకి వచ్చింది. స్థానికసంస్థల పదవుల బిసిల రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వం మారినప్పుడల్లా విధానాలు మారకుండా వుండటానికి వీలుగా శాశ్వతంగా 34 శాతం రిజర్వేషన్ల అమలు చేయడానికి, ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోకుండా రాజ్యాంగంలో 9వ షెడ్యూల్లో పొందుపర్చాల్సిన అవసరం వుంది. తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం బిసి రిజర్వేషన్ అమలు చేయడానికి ఇదే విధానాన్ని అవ లంబించింది. అందువల్ల బీసీల పార్టీగా గుర్తింపు పొందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో తిరుగులేని మెజారిటీ (4/3 పై చిలుకు) వుండటమే కాకుండా కేంద్రంలో కూడా భాగస్వా మ్యం కలిగి ఉన్నందున శాశ్వతంగా 34 శాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా ఈ మేరకు కృషిచేస్తే బిసిల హృదయాలలో తెలుగు దేశం పార్టీ చిరస్థాయిగా నిలిచిపోతుంది అనడంలో అతిశయోక్తి కాదు.*



అన్నవరపు బ్రహ్మయ్య

రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో పట్టణ ప్రాంతాలలో 33.3 శాతం, గ్రామీణ ప్రాంతాలలో 34 శాతం వంతున బిసిలకు రిజర్వేషన్ కల్పించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ పిటీషన్ దాఖలు అభినందనీయం. కౌంటర్ పిటీషన్ దాఖలు చేయడం ద్వారా తెలుగు దేశం ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను ఏదో మొక్కుబడిగా కాకుండా ప్రకటించిన రిజర్వేషన్ల శాతాన్ని అమలు చేయడానికి కట్టుబడి వున్నట్టు స్పష్టమవుతోంది. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో తొలిగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నిర్వహించిన స్థానిక ఎన్నికల్లో కూడా బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలు నిర్వహించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే సమయంలో కోర్టు ఉత్తర్వులంటూ బిసిలకు 24 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేసింది. నిజానికి ఆనాడే 34 శాతం రిజర్వేషన్లపై కోర్టులో కౌంటరు దాఖలు చేయాలని బిసి సంఘాలు కోరినప్పటికీ నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. దాంతో గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 24 శాతానికి పరిమితమై ఎన్నికలు నిర్వహించగా బిసిలు 10 శాతం మేరకు రాజకీయ అవకాశాలను కోల్పోయారు. ప్రస్తుతం అధికారంలోవున్న తెలుగుదేశం ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే మరల బిసి 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించింది. మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగానే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మించకూడదనే విషయాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 34 శాతం ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టు ఒక ప్రజాప్రయోజన పిటీషన్ దాఖలైంది. రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తున్నట్టుగా రాష్ట్ర పరిధిలో స్థానిక అవసరాలను బట్టి రిజర్వేషన్లు అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు వుంది. దేశవ్యాప్తంగా బిసిలు 52 శాతం వున్నట్టుగా మండల కమీషన్ ప్రకటించడంతోపాటు ఇటీవల బీహార్, తెలంగాణ వంటి వివిధ రాష్ట్రాలలో నిర్వహించిన బిసి జనాభా గణన నేపథ్యంలో బిసిలు 50 నుంచి 56 శాతం వున్నట్టు నివేదికలు వచ్చాయి. ఈ స్థితిలో బిసి జనాభా నిష్పత్తి ప్రకారం కాకపోయినా కనీసం 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం సమంజసమే అవుతుంది. మండల కమీషన్ నివేదిక అమల్లోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న 27 శాతం రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ అవకాశాలకు మాత్రమే పరిమితమై ఉండేకానీ, రాజకీయ పదవులకు సంబంధించినది కాదు. అంతేకాకుండా రాజ్యాంగ పరంగా స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి బిసి రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్రాల పరిధిలోనే వుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 330, 332ల ప్రకారం చట్టసభలలో ఎస్సి,ఎస్టీలకు రిజర్వేషన్




ఏర్పడింది. ఇదే సమయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4), 243డి/243టిల ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు దఖలు చేశారు. స్థానిక అవసరాలను బట్టి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు బిసిలకు రిజర్వేషన్లు అమలు చేసే అధికారం వుంది. ఆ నేపథ్యంలోనే కేంద్రప్రభుత్వ అమలుతో సంబంధం లేకుండా 1986లో ఎన్.టి. రామారావు, 1995లో చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల పదవులలో రిజర్వేషన్లు అమలు చేశారు. అయితే దక్షిణాది రాష్ట్రాలలో స్వాతంత్ర్యం లభించిన నాటి నుంచి కూడా బీసీలకు ఎంతో కొంత శాతంతో రిజర్వేషన్లు అమలు అవుతూనే వున్నాయి. కానీ ఉత్తరప్రదేశ్‌తో సహా అనేక ఉత్తరాది రాష్ట్రాలలో (బీహార్ మినహా) 1975 వరకు ఎటువంటి రిజర్వేషన్లు అమలు కాలేదు. స్థానిక సంస్థల పదవులలో బిసి రిజర్వేషన్ల చరిత్రక విషయానికి వస్తే తెలుగుదేశంపార్టీ ఆవిర్భావానికి ముందు వరకు స్థానిక సంస్థల పదవులలో బిసిలకు ఎటు వంటి రిజర్వేన్లు లేవు. నాటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామా రావు తొలిగా 1986వ సంవత్సరంలో స్థానిక సంస్థలలో బిసిలకు 20 శాతం రిజర్వేషన్లను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 1995వ సంవత్సరం నుంచి స్థానిక సంస్థల పదవులలో రిజర్వేషన్‌ను 20 నుంచి 34 శాతానికి పెంచారు. దాంతో గ్రామ, తాలూకా, జిల్లా, స్థాయిలో బిసిలలో రాజకీయ చైతన్యం ప్రారంభమైంది. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ ప్రారంభానికి ముందు వరకు రాజకీయం అంటే అగ్రకులాలవారికే పరిమితంగా వుండేది. గ్రామాలలో భూస్వాములు, ఉన్నత కులాలకు చెందినవారు మాత్రమే సర్పంచులు, మండల/సమితి అధ్య క్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా వుండేవారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల పుణ్యమా అని బీసీలు సమితి/మండల అధ్యక్షులు, జిల్లాపరిషత్ అధ్యక్షులుగా ఎన్నికావడం ప్రారంభమయ్యాయి. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోవున్న 295 అసెంబ్లీ స్థానాలలో కనీసం 10శాతం స్థానాలు కూడా బిసిలకు దక్కేవి కావు. నాటి ఆంధ్రప్రదేశ్‌లో వున్న 26 జిల్లాలో జిల్లాకి ఒకరిద్దరు బిసిలకు శాసనసభ స్థానాలు లభించడం గగనంగా వుండేది. గౌతు లచ్చన్న, ప్రగడ జోటయ్య, బాలా గౌడ్, కొండ లక్ష్మణ బాపూజీ, పెదసింగు లక్ష్మణ రావు వంటి నేతలు మాత్రమే కనిపించేవారు. ఇక లోక్‌సభ స్థానాల విషయానికి వస్తే రాష్ట్రంలో వున్న 42 స్థానాలలో అడపాదడప బాలాగౌడ్, గౌతు లచ్చన్నలు కనిపించడం మినహా బిసిలెవ్వరూ వుండేవారు కాదు. ఆనాడు రాజకీయ చైతన్యానికి మారుపేరుగా వుండే కృష్ణాజిల్లాలో వున్న 17 అసెంబ్లీ స్థానాలలో బిసిలకు కేవలం ఒకస్థానం (బందరు నుంచి పెదశంగు లక్షణరావు)లో గెలుపొందేవారు. అటువంటి స్థితిలో ఎన్.టి.రామారావు బిసి నాయకులకు పార్టీ సీట్లు కేటాయించడం ద్వారా నూతన ఒరవడి సృష్టించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా నుంచి రెండు లేక మూడు స్థానాలలో బిసి అభ్యర్థులు శాసన సభ్యులుగా విజయం సాధిస్తున్నారు. నిన్న నేడు తెలుగురాష్ట్రాలో రాజకీయాలలో కీలకంగా కనిపిస్తున్న కె.వి. కృష్ణమూర్తి, దేవేంద్రగౌడ్, శ్రీనివాస యాదవ్, అచ్చెం నాయుడు వంటి నాయకులు తెలుగుదేశంపార్టీ ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి చేరుకొన్నారు. ఈ కారణంగానే తెలుగు దేశంపార్టీ అంటే బిసిల పార్టీ అనే ప్రచారంలోకి వచ్చింది. స్థానికసంస్థల పదవుల బిసిల రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వం మారినప్పుడల్లా విధానాలు మారకుండా వుండటానికి వీలుగా శాశ్వతంగా 34శాతం రిజర్వేషన్ల అమలు చేయడా నికి, ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోకుండా రాజ్యాంగంలో 9వ షెడ్యూల్లో పొందుపర్చాల్సిన అవసరం వుంది. తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం బిసి రిజర్వేషన్ అమలు చేయడానికి ఇదే విధానాన్ని అవలంభించింది. అందువల్ల బీసీల పార్టీగా గుర్తింపు పొందిన తెలుగుదేశంపార్టీ రాష్ట్రంలో తిరుగులేని మెజారిటీ(4/3 పై చిలుకు) వుండటమే కాకుండా కేంద్రంలో కూడా భాగస్వామ్యం కలిగి ఉన్నందున శాశ్వతంగా 34 శాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా ఈ మేరకు కృషిచేస్తే బిసిల హృదయాలలోతెలుగు దేశం పార్టీ చిరస్థాయిగా నిలిచిపోతుంది

# విద్యాప్రగతికి నాణ్యమైన గురువులే మూలం

సి.హెచ్.ప్రతాప్


దేశంలో ఉన్నత విద్య విస్తరిస్తోంది. కొత్త విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, కొత్త కోర్సులు, పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య ఇవన్నీ విద్యా విస్తరణకు సంకేతాలే. కానీ తరగతి గదిలో బోధించే అధ్యాపకులు లేకపోతే ఈ విస్తరణ ఎంతవరకు ప్రయోజనకరం? విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న వేగానికి అనుగుణంగా అధ్యాపక నియామకాలు జరగకపోవడం ఉన్నత విద్య నాణ్యతకు మోనముప్పుగా మారుతోంది. విశ్వవిద్యాలయానికి భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు అవసరమే. అయితే వాటికి ప్రాణం పోసేది నాణ్యమైన అధ్యాపక బృందమే. దేశంలోని 23 ఐఐటీల్లో 12,498 మంజూరైన బోధనా పోస్టులకు గాను 4,804 ఖాళీగా ఉన్నట్లు 2026 జనవరి 30 నాటి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే 38.4 శాతం పోస్టులు భర్తీ కాలేదు. ఐఐటీ పట్నాలో 54.6 శాతం, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 51.3శాతం పోస్టులు ఖాళీగా ఉండగా, మరో 12 ఐఐటీల్లో మూడో వంతుకు పైగా ఖాళీలున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్నతవిద్యలో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఎఐఎస్‌హెచ్ఇ గణాంకాల ప్రకారం 2014-15లో 3.42 కోట్లుగా ఉన్న ఉన్నతవిద్యలో విద్యార్థుల నమోదు 2022-23 నాటికి 4.46కోట్లకు చేరింది. విద్యార్థుల సంఖ్య ఈ స్థాయిలో పెరుగుతున్నప్పుడు వారికి తగిన అధ్యాపక బలం కూడా ఉండాలి. లేకుంటే విస్తరించిన తరగతి గదులు తగ్గినబోధనానాణ్యత అనే విరుద్ధ పరిస్థితి ఏర్పడుతుంది. అధ్యాపకుల కొరత ప్రభావం ఒక్క తరగతి గదితో ఆగదు. అందుబాటులో ఉన్న సిబ్బందిపై అదనపు బోధనా భారం పడుతుంది. విద్యార్థుల సందేహ నివృత్తి, వ్యక్తిగత మార్గదర్శకత్వం, ప్రాజెక్టుల పర్యవేక్షణకు సమయం తగ్గుతుంది. ప్రయోగశాల బోధన, పరిశోధన, పీహెచ్‌డీ విద్యార్థుల పర్యవేక్షణ కూడా దెబ్బతినవచ్చు. అధ్యాపకుల సంఖ్య తక్కువగా ఉంటే విశ్వవిద్యాలయం జ్ఞానాన్ని సృష్టించే కేంద్రం నుంచి కేవలం పాఠ్యాంశాలను పూర్తి చేసే సంస్థగా మారే ప్రమాదం ఉంది. ఈ విషయంలో ప్రైవేటు విద్యాసంస్థల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలున్నాయి. విద్యార్థులను ఆకర్షించడంలో పరస్పర పోటీ పెరగడంతో పలు ప్రైవేటు సంస్థలు అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయి. మెరుగైన వేతనాలు, పరిశోధనా అవకాశాలు, పరిశ్రమ అనుసంధానం, ఆధునిక బోధనా విధానాలు, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రతిభను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నాయి. విద్యార్థులుకూడా ఇప్పుడు సంస్థ భవనాల కంటే అక్కడి అధ్యాపకుల నాణ్యత, పరిశోధన, బోధనా ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఐఐటీల్లో ఖాళీలకు ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులకు ఉన్న డిమాండ్, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, బహుళజాతి పరిశోధనా సంస్థలు, డీప్‌టెక్ కంపెనీలతో పోటీ, కఠినమైన ఎంపిక ప్రమాణాలు కారణమవుతున్నాయని ఆయా సంస్థలు చెబుతున్నాయి. కాబట్టి ఖాళీలను భర్తీ చేయడం కోసం ప్రమాణాలను తగ్గించడం పరిష్కారం కాదు. ప్రతిభావంతులైన అధ్యాపకులను ఆకర్షించే, నిలుపుకునే విద్యావాతావరణం కల్పించడమేఅసలుమార్గం. రాష్ట్ర విశ్వవిద్యాలయాల పరిస్థితిపైనా ప్రత్యేక దృష్టి అవసరం. దేశంలోని ఉన్నత విద్యార్థుల్లో అత్యధికులు రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ద్వారానే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. అక్కడ అధ్యాపక ఖాళీలు దీర్ఘకాలం కొనసాగితే దాని ప్రభావం లక్షలాది మంది విద్యార్థులపై పడుతుంది. అందువల్ల ఖాళీలను ఎప్పటికప్పుడుగుర్తించి, కాలపరిమితితో కూడిన నియామక ప్రక్రియను అమలు చేయాలి. నియామకాలు వేగంగా జరగాలి. అయితే వేగంతో పాటు మెరిట్, పారదర్శకత, అనుభవం, పరిశోధనా సామర్థ్యం కూడా కీలకం. అధ్యాపక నియామకం ఒక ఉద్యోగ భర్తీప్రక్రియ కాదు. దేశ భవిష్యత్తుకు మేధో పునాది నిర్మించే కార్యక్రమం. విద్యార్థుల సంఖ్య పెరగడం విద్యా విస్తరణ, వారికి నాణ్యమైన గురువులు అందడం విద్యాప్రగతి. భారత ఉన్నత విద్య రెండో అడుగును మరచిపోకూడదు. ●

# వినియోగదారునిపై బ్యాంకు చార్జీల భారం!



ప్రొఫెసర్ చెన్నప్ప దాసరి

దేశ ఆర్థిక వ్యవస్థకు బ్యాంకింగ్ రంగం వెన్నెముక. ప్రజల పొదుపులను సమీకరించి ఉత్పాదక రంగాలకు మూలధనంగా మళ్లించడం, నగదు లావాదేవీలను సురక్షితంగా నిర్వహించడం, పెట్టుబడులకు ఊతమివ్వడం, ప్రభుత్వ సంక్షేమపథకాల అమలులో భాగస్వామ్యం కావడం వంటి అనేక కీలక బాధ్యతలను బ్యాంకులు నిర్వహిస్తున్నాయి. ఒకప్పుడు బ్యాంకు సేవలు ప్రధానంగా నగరాలకే పరిమితమైతే, నేడు గ్రామీణ ప్రాంతాల వరకు వీటి సేవలు విస్తరించాయి. దేశంలో ప్రతీ పదిమందిలో సగటున 8 మంది బ్యాంకింగ్ సేవలు పొందుతున్నవారే. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన తర్వాత బ్యాంకింగ్ సేవలు తప్పని సరిగా, మరింత వేగవంతగా మారాయి. డిజిటల్ సాంకేతికతతో బ్యాంకింగ్ సేవలు మొబైల్ ఫోన్లోకి వచ్చాయి. అయితే ఈ సౌలభ్యాల వెనుక వినియోగదారులపై రోజురోజుకూ పెరుగుతున్న వివిధ రకాల రుసుములు (చార్జీలు) తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఇటీవల రాజ్యసభలో ప్రవేశ పెట్టిన బ్యాంకు చార్జీల గణాంకాలు చూసి దేశంలో సగటు మనిషి ఒకింత అసహనానికి గురిఅయ్యారు. ప్రజల డబ్బును భద్రపరచే బ్యాంకులే అదే ప్రజలపై అనవసరపు చార్జీల భారం మోపడం సమంజసమేనా అనే ప్రశ్న నేడు మరింత బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం బ్యాంకులు వివిధ పేర్లతో వినియోగదారుల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నాయి. కనీస నిల్వ నిర్వహించలేదని జరిమానా, నిర్ణీత పరిమితికి మించి ఏటీఎం లావాదేవీలకు చార్జీలు, డెబిట్‌కార్డుల వార్షిక రుసుములు, చెక్బుక్ ఫీజులు, ఎస్ఎంఎస్ అలర్ట్ చార్జీలు, నగదు జమ లేదా ఉపసంహరణ పరిమితిని దాటితే అదనపు రుసుములు, ఖాతా నిర్వహణ చార్జీలు ఇలా వివిధ రకాల చార్జీలతో బ్యాంకులు ఖాతాదారుడి జేబుకు కన్నం వేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో వెల్లడించిన తాజా వివరాల ప్రకారం, గత 4 ఆర్థిక సంవత్సరాలలో దేశంలోని బ్యాంకులు వినియోగదారుని బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వ (మినిమం బ్యాలెన్స్) ఉంచనందుకు పెనాల్టీ ద్వారా సుమారు రూ. 26,190 కోట్లు వసూలు చేశాయి. కేవలం ఒక్క 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే బ్యాంకులు సుమారు రూ.7,086 కోట్లు వరకు పెనాల్టీలను వినియోగదారుల నుండి వసూలు చేశాయి. ఇందులో మొత్తం 19 ప్రైవేట్ బ్యాంకులు తమ ఖాతాదారుల నుండి రూ. 4,948.71 కోట్లు వసూలు చేయగా దేశంలోని 12ప్రభుత్వ బ్యాంకులు 2,137.92 కోట్లవరకు వసూలు చేసాయి. వీటిలో కొన్ని బ్యాంకులు కేవలం కరెంటు ఖాతాలమీద పెనాల్టీలు వసూలు చేస్తే. మరికొన్ని సేవింగ్ కరెంటు ఖాతాలమీద కలిపి పెనాల్టీలు వసూలు చేశాయి. ఇక ప్రైవేట్ రంగబ్యాంకులలో




అత్యధికంగా ఒక ప్రముఖ బ్యాంకు 1,798.14 కోట్లు వసూలు చేయగా మరో బ్యాంకు 1,081.33 కోట్లు వసూలు చేసింది. మొత్తం 19 ప్రైవేట్ బ్యాంకులు వసూలు చేసిన పెనాల్టీలలో కేవలం ఈ రెండు బ్యాంకులు వసూలు చేసిన పెనాల్టీలు విలువ సుమారు 58 శాతం. 2022-2026 ఆర్థిక సవత్సరం వరకుఅంటే మొత్తం నాలుగు ఆర్థిక సంవ త్సరాలలో 'కనీస సగటు బ్యాంకు బాలెన్స్' నిర్వహించని కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు కస్టమర్స్ నుండి వసూ లు చేసిన పెనాల్టీలు సుమారు 10,230.75 కోట్లు. ఇక ప్రైవేట్‌రంగ బ్యాంకులు గత నాలుగేళ్లలో సుమారు15,939 కోట్ల పెనాల్టీలు వసూలు చేశాయి. అయితే, బేసిక్ సేవింగ్ ఖాతాలు, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలకు కనీస సగటు బాలన్స్ నిల్వవర్తించదు. ఈ ఖాతాల ద్వారా లావాదేవీలు ఆంక్షలతో కూడుకుని ఉండటం చేత, ప్రజలు ఇతర సేవింగ్ అకౌంట్‌ను ఓపెన్ చేస్తున్నారు. బ్యాంకులు కూడా కనీస నిల్వ ఉండే అకౌంట్స్ మాత్రమే కస్టమర్స్ ఓపెన్ చేసేలా వ్యవహరిస్తున్నాయి. అలాగే, ఎస్ఎంఎస్ చార్జిల రూపంలో బ్యాంకులు వేలకోట్ల రూపాయలు విని యోగదారుల నుండి వసూలు చేస్తున్నాయి. గత మూడు ఆర్థిక సంవత్సరాలలో యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా సుమారు 1188.14 కోట్ల రూపాయలు ఎస్ఎంఎస్‌ల రూపంలో వసూలుచేసింది. ఈ విషయం ప్రభుత్వానికి ఆర్‌బిఐకి తెలియనిదికాదు కానీ బ్యాంకులపై ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. టెక్నాలజీ వలన బ్యాంకులు డిజిటల్ సేవలు అందిస్తున్నాయి. దీనివలన బ్యాంకులకు 'మాన్ పవర్' ఉపయోగం తగ్గింది. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం బ్యాంకుల నిర్వహణ వ్యయం భారీగా తగ్గింది. ఒక వైపు బ్యాంకులకు రావద్దు. ఆన్లైన్ సేవలు వినియోగిం చుకోండి అని చెప్పే బ్యాంకులు, ఆయా ఆన్లైన్ సేవల పై కూడా అనవసరపు చార్జీలు వసూలు చేయడం విడ్డురంగా ఉంది. ఇక ఏ.టి.ఎం లావాదేవీలపై కూడా బ్యాంకులు అనవసరపు చార్జీలు వసూలు చేస్తున్నాయి. మొదట బ్యాంకుని బట్టి ఎ.టి.ఎం రూల్స్ ఉండగా, ఇప్పుడు కార్డుని బట్టి ఎ.టి.ఎం రూల్స్ ఉంటున్నాయి. ఫైనాన్సియల్ నాన్ ఫైనాన్సియల్ ఏ.టి.ఎం వ్యవహారాలపై ఆంక్షలు పెట్టి పరిమితి దాటిన వారినుండి చార్జీలు వసూలు చేస్తున్నాయి. వినియోగదారులు ఎటిఎంల వినియోగ పరిమితి దాటితే సుమారు 23రూపాయల పైననే ప్రతీ వ్యవహారానికి ఛార్జ్ చేస్తున్నాయి. మొదట్లో ఏటిఎంల ద్వారా ఎటుంటి చార్జీలు ఉండవని తెలిపిన బ్యాంకులు రాను రాను ఏటీఎం వ్యవహారాలపై చార్జీలు విధించాయి. ఈ ఏ.టి.ఎం చార్జీల వలెనే ప్రజలు యూ.పి.ఏ ప్రెమెంట్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఇటీవల కాలంలో యూపిఏ ప్రెమెంట్స్ దేశంలో విపరీతంగా పెరిగాయి. అందుకే బ్యాంకులు యూపిఏ వ్యవహారాల మీద కూడా చార్జీలు వసూలు వసూలు చేయాలని భావిస్తున్నాయి. ఇటీవల యూపీఐ లావాదేవీలపై 'మర్చంట్ డిస్కౌంట్ రేట్'ను విధిస్తూ రూపొందించిన యూపీఐ ట్రాన్సాక్షన్ చార్జీల బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో దేశ ప్రజలు ఆందోళనకు గురి అయ్యారు. ఎంత మేరకు ఎండీఆర్ చార్జీలు విధిస్తారన్న దానిపై ఇప్పుడే స్పష్టత లేకపోయినప్పటికీ, రూ.2 వేలకు మించిన లావాదేవీలపై 0.3శాతం నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్ను విధించే అవకాశం ఉన్నది. అయితే ఈచార్జీల భారం వ్యాపారులపైనే ఉండనున్నట్టు ప్రభుత్వవర్గాలు చెప్తున్నప్పటికీ, అంతిమంగా కొనుగోలుదారుల పైనే భారం పడిపోతుంది. సేవలను వినియోగించినందుకు తగిన రుసుము వసూలు చేయడాన్ని ఎవరూ వ్యతిరేకించరు. కానీ ప్రతి చిన్న సేవకూ వేర్వేరు పేర్లతో రుసుములు విధించడం ప్రజలకు ఆర్థిక భారంగా మారుతోంది. వినియోగ దారులపై అధిక చార్జీల భారం తగ్గించిన

10-9Pg5:10-9Pg5.qxd 9/9/2026 11:39 PM Page 1



# వేడెక్కిన 'మ్యాప్' వివాదం

## యుఎన్ రూపొందించిన మ్యాప్‌పై భారత్ తీవ్ర అభ్యంతరం

## తక్షణమే మార్పులు చేయాలంటూ అల్టిమేటం

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 9:** ఐక్యరాజ్యసమితి (ఐరాస) విడుదల చేసిన కొత్త ప్రపంచ మ్యాప్‌పై తీవ్ర వివాదం చెలరేగింది. ఈ మ్యాప్‌లో భారత భూభాగాలైన అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్‌లను భారత్, చైనాల మధ్య ఉన్న ప్రత్యేక ప్రాంతాలుగా చూపడంపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని ఐరాసలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై ఆందోళన వ్యక్తం చేశామని స్పష్టం చేసింది. జులై 1న ఐరాస ఈ కొత్త మ్యాప్‌ను తొలిసారిగా ప్రచురించింది. సెప్టెంబరు 4న సర్వసభ్య సమావేశంలో ఒక తీర్మానంపై చర్చ సందర్భంగా కూడా దీనిని ఉపయోగించారు. ఈ మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్‌ను అసోం, చైనాలకు మధ్య ఉన్న ఒక స్వతంత్ర ప్రాంతంగా చూపారు. నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును కూడా ఇందులో గుర్తించలేదు. అదేవిధంగా అక్సాయ్ చిన్‌ను కూడా ఒక ప్రత్యేక భూభాగంగా చిత్రీకరించారు. దీనికి పశ్చిమాన భారత్, తూర్పున చైనా ఉన్నట్లుగా చూపారు. ఈ విధంగా సరిహద్దులను వక్రీకరించి చూపడంపై ఐక్యరాజ్యసమితి ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. మ్యాప్‌లోని ఈ వైరుధ్యాలను తాము గుర్తించామని, సంబంధిత అధికారులతో ఈ విషయాన్ని ప్రస్తావించామని తెలిపారు. ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో ప్రవేశపెట్టిన కరెక్ట్ ది మ్యాప్ అనే తీర్మానానికి భారత్ మద్దతుగా ఓటు వేసిన మాట వాస్తవమేనని, అయితే ఆ మద్దతు కేవలం ఒక సూత్రానికి మాత్రమే పరిమితమని ఆయన స్పష్టం చేశారు.

"ప్రపంచ పటంలో ఖండాల పరిమాణాన్ని సరిగ్గా, వాస్తవిక నిష్పత్తిలో చూపించే ఈక్వల్ ఏరియా ప్రొజెక్షన్ అనే సూత్రానికి మాత్రమే మా మద్దతు. సంప్రదాయ మెర్కేటర్ మ్యాప్‌లలో ధ్రువాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలు వాస్తవం కంటే పెద్దవిగా కనిపిస్తాయి. ఈ వక్రీకరణను సరిదిద్దాలనేదే తీర్మానం ఉద్దేశం. అంతేకానీ, ఐరాస ప్రచురించిన ఈ ప్రత్యేక మ్యాప్‌ను మేము ఆమోదించడం లేదు" అని జైస్వాల్ వివరించారు. జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు (అక్సాయ్‌చిన్ సహా), అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం మొత్తం భారత్‌లో విడదీయరాని అంతర్భాగాలని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కొత్త మ్యాప్‌లో జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖను చుక్కల గీతతో చూపిస్తూ, దీనిపై ఇరు పక్షాల మధ్య తుది ఒప్పందం కుదరలేదని ఒక ఫుట్‌నోట్ కూడా జోడించడం గమనార్హం.



# సింగపూర్ ప్రధానికి ప్రపంచంలోనే అత్యధిక వేతనం

## వార్షిక వేతనం రూ.27 కోట్లు అని వెల్లడి

**సింగపూర్‌సిటీ, సెప్టెంబరు 9:** ప్రపంచంలోని వివిధ దేశాల ప్రధానుల వేతనాలను పరిశీలిస్తే వారి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. వారిలో సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ వేతనం అత్యధికంగా ఉంది. రాజకీయ నేతల వేతనాలను పెంచుతున్నట్లు ఆయన మంగళవారం పార్లమెంటులో ప్రకటించారు. దాంతో ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్న సింగపూర్ రాజకీయ నేతల జీతాలు మరో 60 శాతానికిపైగా పెరగనున్నాయి. ప్రస్తుతం ప్రధాని వార్షిక బెంచ్‌మార్క్ వేతనం 2.2 మిలియన్ సింగపూర్ డాలర్లు. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.16.5 కోట్లు. తాజా పెంపుతో ఈ మొత్తం 3.6 మిలియన్ సింగపూర్ డాలర్లకు చేరుతుంది. అంటే సుమారు రూ.27 కోట్లు. మొత్తంగా జీతం దాదాపు రూ.10.5 కోట్లు పెరగనుంది. డిప్యూటీ ప్రధాని వేతనం 1.87 మిలియన్ సింగపూర్ డాలర్లనుంచి 3.06 మిలియన్ డాలర్లకు పెరుగుతుంది. అంటే ప్రస్తుతం సుమారు రూ.14 కోట్లుగా ఉన్న జీతం రూ.23 కోట్లకు చేరనుంది. క్యాబినెట్ మంత్రులకు 1.80 మిలియన్ నుంచి 2.88 మిలియన్ సింగపూర్ డాలర్ల వరకు చెల్లిస్తారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.13.5 కోట్ల నుంచి రూ.21.6 కోట్ల వరకు ఉంటుంది. తనకు పెరిగే మొత్తాన్ని పదవీకాలంలో వివిధ కార్యక్రమాలకు విరాళంగా ఇస్తానని వాంగ్ తెలిపారు. రాజకీయ నేతల జీతాల పెంపు ప్రజల్లో భావోద్వేగపూరిత అంశమని ఆయన అన్నారు. సామాన్యుల ఆదాయంతో పోలిస్తే ఈజీతాలు చాలా ఎక్కువగా ఉండటంతో ప్రజలు వాటిని నిశితంగా పరిశీలించడం సహజమేనని చెప్పారు. మంచి పాలనకు సమర్థ నాయకత్వం అవసరమని వాంగ్ తెలిపారు.

భవిష్యత్తులో దేశాన్ని ముందుకు తీసు కెళ్లేందుకు నాణ్యమైన నాయకత్వాన్ని కొనసాగించడమే లక్ష్యమని వివరించారు. వేతనాల పెంపు స్వతంత్ర కమిటీ సిఫార్సుల మేరకు జరి గింది. అయితే కొత్త వేతనాలను ప్రస్తుత పదవుల్లో ఉన్నవారికి వెంటనే వర్తింపజేయరు. అక్టోబరు 15 నుంచి వ్యక్తిగత పరిస్థితులు, పనితీరును బట్టి గరిష్ఠంగా 9 శాతం వరకు ఒకేసారి సర్దుబాటు చేస్తారు.



# మానవాళికి ప్రాణాంతకంగా మారే ఎఐ

## ఎఐ పరిశోధకుడు జాకబ్ కాక్సన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** ఎఐ ప్రపంచంలో పనిచేస్తున్న 27 ఏళ్ల పరిశోధకుడు జాకబ్ కాక్సన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంత్రోపిక్‌లో మూడేళ్ల పనిచేసిన తర్వాత ఆయన రాజీనామా చేశారు. అనంతరం సోషల్‌మీడియా వేదికగా ఎఐ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐ సంస్థలు ప్రమాదాలను గుర్తిస్తున్నా పోటీలో వెనుకబడి పోతామనే భయంతో ముందుకు వెళ్తున్నాయని ఆరోపించారు. కాక్సన్ గతంలో ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్‌లో ప్రీట్రైనింగ్ పరిశోధనలు చేశారు. ఏఐ రంగంలో పనిచేస్తున్న పలువురు నిపుణులు ఈ సాంకేతికత ఈ దశాబ్దం ముగిసేలోపే మానవాళికి ప్రాణాంతకంగా మారొచ్చని నిజంగానే నమ్ముతున్నారని చెప్పారు. ఈ విషయం బయట మాట్లాడేటప్పుడు మాత్రం కొందరు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో మనుషుల కంటే ఎంతో శక్తిమంతమైన ఎఐ వ్యవస్థలు రావచ్చని కాక్సన్ హెచ్చరించారు. అవి సైబర్ దాడులు చేయగలవని, ఎన్నో రంగాలను ఒక్కసారిగా మార్చగలవని అన్నారు. వాస్తవ ప్రపంచంలో ప్రభావం పెంచుకునే స్థాయికి చేరవచ్చని తెలిపారు. ఆంత్రోపిక్ అలైన్‌మెంట్ సైన్స్ లీడ్ ఇవాన్ హ్యూబింగర్ కూడా కాక్సన్ వ్యాఖ్యలను సమర్థించారు. భవిష్యత్తులో ఎఐ మానవాళిని అంతం చేసే అవకాశం ఉందని తాము నిజంగానే భావిస్తున్నామని చెప్పారు. వచ్చే పదేళ్లలో ఆ ప్రమాదం 10 శాతానికి మించి ఉంటుందని తన వ్యక్తిగత అంచనా అని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎఐ మోడళ్లతో ప్రమాదం తక్కువేనని హ్యూబింగర్ స్పష్టం చేశారు. అయితే ఎఐ తనసామర్థ్యాలను తానే పెంచుకునే స్థాయికిచేరితే పరిస్థితి చాలా ప్రమాదకరంగా మారొచ్చని హెచ్చరించారు. సూపర్ ఇంటెలిజెన్స్ కోసం అలైన్‌మెంట్ సమస్యకు పరిష్కారం చూపే స్పష్టమైన ప్రణాళిక తమ వద్ద ఇంకా లేదని అంగీకరించారు. ఎఐ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా పోటీకి దిగే పరిస్థితిని అడ్డుకోవడం కష్టమని కాక్సన్ అన్నారు. అవసరమైతే ఎఐ మోడళ్ల సామర్థ్యాలను పెంచే పనిపై తాత్కాలిక నిషేధం విధించాల్సి రావచ్చని సూచించారు

# అమెరికా మానవరహిత సబ్‌మెరైన్ ఇరాన్ స్వాధీనం

**టెహ్రాన్, సెప్టెంబరు 9:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా నిఘా కోసం ఉపయోగిస్తున్న మానవరహిత సబ్‌మెరైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇరాన్ నేవీ ప్రకటించింది. అత్యంత ఆధునిక సాంకేతికతతో రూపొందించిన జలాంతర్గామిని క్లిష్టమైన నిఘా ఆపరేషన్‌లో చేజిక్కించుకున్నట్లు వెల్లడించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అధికారిక మీడియా సంస్థ సెపాహ్ న్యూస్ విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపింది. స్వాధీనం చేసకున్న వాహనం డైవ్‌ఎల్‌డీ అని పేర్కొంది. ఇది నీటి అడుగున పనిచేసే అత్యాధునిక మానవరహిత జలాంతర్గామి అని తెలిపింది. ఇదే సమయంలో హర్మూజ్ జలసంధిపై అమెరికాకు చెందిన ఎంక్యూ9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ పేర్కొంది. అయితే ఇరాన్ ప్రకటనపై అమెరికా స్పందించింది. నీటి అడుగున పనిచేసే తమ డ్రోన్ ఒకటి పనిచేయడం ఆగిపోయిందని అమెరికా సైన్యం తెలిపింది. ప్రాంతీయ జలాలను పరిశీలించే సమయంలో ఈ సమస్య తలెత్తిందని పెంటగాన్ ప్రతినిధి చెప్పారు. అయితే ఇరాన్ స్వాధీనం చేసుకున్నది అదేనా కాదా అన్న విషయాన్ని మాత్రం అమెరికా స్పష్టం చేయలేదు. అది పాత మోడల్ అని, ఎలాంటి కీలక సమాచారం సేకరించలేదని, రహస్య సోనార్ లేదా రాడార్ పరికరాలు లేవని పేర్కొంది. డైవ్‌ఎల్‌డీ ఒక్కసారి స్థావరానికి తిరిగి రాకుండా 10 రోజుల వరకు పనిచేయగలదు. దాదాపు 6,000 మీటర్ల లోతు వరకు వెళ్లగలదు. ఒక్కో వాహనం ధర సుమారు రూ.21 కోట్లుగా ఉన్నట్లు అమెరికా రక్షణ రంగ మీడియా వెల్లడించింది.

# దుబాయ్ ఎయిర్‌పోర్టులో క్లిక్ ట్రావెల్




**దుబాయి, సెప్టెంబరు 9:** దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల అనుభవాన్ని పూర్తిగా మార్చేసే ఒక విప్లవాత్మక సేవను ప్రారంభించింది. రద్దీ సమయాల్లో, అత్యవసర పరిస్థితుల్లో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు క్లిక్ ట్రావెల్ పేరుతో ఒక సరికొత్త మొబైల్ సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చింది. దుబాయ్ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఐడెంటిటీ అండ్ ఫారినర్స్ అఫైర్స్ ఈ సేవను రూపొందించింది. ఈ విధానంలో ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. పాస్‌పోర్ట్ కంట్రోల్ అధికారులే నేరుగా ప్రయాణికులు ఉన్న చోటికి వచ్చి ఎంట్రీ లేదా డిపార్చర్ ప్రక్రియలను పూర్తి చేస్తారు. ఈ సేవ కోసం ఇమ్మిగ్రేషన్ అధికారులు ప్రత్యేక మొబైల్ పరికరాలను ఉపయోగిస్తారు. ఈ పరికరాలు జీడీఆర్‌ఎఫ్‌ఎ సెంట్రల్ సిస్టమ్స్, డేటాబేస్‌లకు అనుసంధానమై ఉంటాయి. దీని ద్వారా అధికారులు ప్రయాణికుల సమాచారాన్ని వెంటనే యాక్సెస్ చేయగలరు. బయోమెట్రిక్ వెరిఫికేషన్ టెక్నాలజీ సహాయంతో ప్రయాణికుడి గుర్తింపును నిర్ధారించి, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు.

# వందేమాతరం పూర్తి గేయాలాపనను గౌరవించిన ఫరూక్, ఒమర్ అబ్దుల్లా



## తీవ్ర అభ్యంతరం చెప్పిన కాంగ్రెస్

**శ్రీనగర్, సెప్టెంబరు 9:** శ్రీనగర్‌లోని షేర్‌ఎకశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన జమ్మూకశ్మీర్ తొలి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో వందేమాతరం పూర్తి గేయం ఆలపించడం, ఆ సమయంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాలు గౌరవ సూచకంగా పూర్తి సమయం నిలబడటం పొత్తు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ రెండూ ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్నప్పటికీ, ఈ వ్యవహారంలో కాంగ్రెస్ తన మిత్రపక్ష వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అంశంపై కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల ఆలోచనలు, 1937 నాటి కాంగ్రెస్ తీర్మానం ప్రకారం వందేమాతరం మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలని సూచించారు. జాతీయ గేయాన్ని పూర్తిగా ఆలపించడం భారత్ లౌకిక, సమగ్ర భావనకు విఘాతం కలిగిస్తుందని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయుల నిర్ణయాలను గౌరవించి, మొదటి రెండు చరణాలకే కట్టుబడి ఉండాలని, ఈ పాటను కోరి రాజకీయం చేయకుండా లౌకికత్వాన్ని కాపాడాలని కాంగ్రెస్ తమ భాగస్వామ్య పక్షాలను కోరింది.

మరోవైపు, కెసి వేణుగోపాల్ ట్వీట్‌పై నేషనల్ కాన్ఫరెన్స్ అదే స్థాయిలో ప్రతిస్పందించింది. ఇండియా కూటమి భాగస్వామిగా, ఎప్పుడు పాడాలి లేదా ఎంత పాడాలి అనే విషయాలపై మీరు షరతులు విధించలేరు. ట్వీట్ చేసే హక్కు వేణుగోపాల్‌కు ఉంది. కానీ ఆయన దేనినీ బలవంతంగా రుద్దలేరు. ఇది ప్రజల నిర్ణయం. ప్రజలపై దేనినీ రుద్దడాన్ని మేము వ్యతిరేకిస్తాము. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నూతన మార్గదర్శకాలకు అనుగుణంగానే ఒమర్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లాలు మూడు నిమిషాల పాటు సాగిన పూర్తి గేయాలాపన ముగిసే వరకు నిలబడి గౌరవించారని ఎన్సీ నేత బషీర్ అహ్మద్ తెలిపారు.

# విద్యార్థులకు నోటీసులు ఇస్తారా?

## నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌పై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** నిరసనలో పాల్గొన్న ఓ న్యాయ విద్యార్థికి నోటీసులు జారీ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. విద్యార్థులపై చర్యలు తీసుకోవద్దని సెప్టెంబరు 1న దేశవ్యాప్తంగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా న్యాయ విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపట్టింది. ఆ నోటీసులను తర్వాత ఉపసంహరించుకున్నప్పటికీ ఈ వ్యవహారం చాలా తీవ్రమైనదని సిజెఐ జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొన్నందుకు విద్యార్థికి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయం బుధవారం సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి వచ్చింది. మేజిస్ట్రేట్ నోటీసులు ఇచ్చే ధైర్యం ఎలా చేశారు ఏ విద్యార్థిపైనా బలవం తపు చర్యలు తీసుకోవద్దని మేం స్పష్టంగాచెప్పాం. ఆ ఆదేశాలను ఏ మేజిస్ట్రేట్ ఉల్లంఘించకూడదని సిజెఐ వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో విద్యార్థి కార్యకర్త ఆకృతి చౌధరిపై జాతీయ భద్రతా చట్టం ప్రయోగించిన విషయంలో అలహాబాద్ హైకోర్టు కూడా యుపి అధికారులను తీవ్రంగా మందలించింది.

అధికారుల చర్యల వల్ల ఉత్తరప్రదేశ్ ఆర్వెలియన్ డిస్టోపియాగా మారే పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. అధికారులు తమ విధేయత రాజ్యాంగం పట్ల ఉండాలి తప్ప రాజకీయ నేతల పట్ల కాదని స్పష్టం చేసింది. నోయిడా డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ మేధా రూపమ్ ఆమోదించిన ఆకృతి చౌధరి ఎన్ఎస్ఏ నిర్బంధాన్ని సెప్టెంబర్ 2న హైకోర్టు కొట్టివేసింది. ఆమెకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. నిరసనకు సంబంధించిన కేసుల్లో తగిన ఆధారాలు లేకుండానే కఠినమైన ఎన్ఎస్ఏను ప్రయోగించడంపై గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా యంత్రాంగం, పోలీసులపై ధర్మాసనం మండిపడింది.

# మసూద్ అఫ్ఘానిస్థాన్‌లో ఉన్నాడని పాక్.. లేనేలేడని అఫ్ఘాన్

**కాబూల్, సెప్టెంబరు 9:** మసూద్ అజార్ కరుడుగట్టిన ఉగ్రవాది. నిషేధిత ఉగ్రవాదసంస్థ జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు. ఇండియాలో జరిగిన అనేక కీలక ఉగ్రదాడులకు ప్రధాన సూత్రధారి. ప్రస్తుతం మసూద్ అజార్ ఎక్కడ ఉన్నాడు అనే అంశంపై స్పష్టత లేదు. అతడు పాకిస్తాన్‌లోనే తలదాచుకున్నాడు అని ఇండియా సహా అనేక దేశాలు ఆరోపిస్తుంటే.. పాకిస్తాన్ మాత్రం తమ దేశంలోలేడని, ఆఫ్గనిస్థాన్‌లో ఉన్నాడని చెబుతోంది. మసూద్ అజార్ ఆఫ్గనిస్థాన్ వెళ్లిపోయాడని పాకిస్తాన్ కొన్నేళ్లుగా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలపై ఆఫ్గనిస్తాన్ స్పందించింది. అతడు తమ దేశంలోనే లేడని వెల్లడించింది. ఈ అంశంపై ఆఫ్గన్ విదేశాంగ శాఖ స్పందిస్తూ మసూద్ తమ దేశంలో లేడని స్పష్టం చేసింది. ఇతర దేశాల మీద దాడికి, వ్యతిరేక కుట్రలకు తమ భూభాగాన్ని వినియోగించబోమని వెల్లడించింది. ఇండియాలో 2001లో పార్లమెంట్‌పై జరిగిన దాడికి, 2008 ముంబై దాడులకు, 2016లో పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై జరిగిన దాడికి, 2019లో జరిగిన పుల్వామా దాడికి పాల్పడింది జైషే మహ్మద్ సంస్థే. ఈ సంస్థను నడిపించి, ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి, మన

## మసూద్ అజహార్‌పై పాక్ పన్నాగం

దేశం మీదకు ఉసిగొల్పింది మసూద్ అజారే. అందువల్లే అతడిని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి 2019లో అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అలాంటి మసూద్ అజార్‌కు ఆశ్రయమిచ్చినందుకు పాకిస్తాన్‌ను ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటిఎ) నిషేధిత జాబితాలో చేర్చింది. అంటే, యూరప్ సహా అనేక దేశాలు అందించే ఆర్థిక సహాయాన్ని తీవ్రవాదులకు వినియోగిస్తే.. ఎఫ్ఏటిఎ ఆయా దేశాలను నిషేధిత జాబితాలో చేరుస్తుంది.

అలా, పాకిస్తాన్‌ను ఈజాబితాలో చేర్చారు. ఇలా చేయకూడదనుకుంటే మసూద్ అజార్‌ను అరెస్ట్ చేయాలి. 2019 నుంచి అతడు తమ దేశం వదిలి ఆఫ్గన్ వెళ్లిపోయాడని పాక్ చెబుతోంది. 2022లో తాలిబన్లు ఆఫ్గన్‌లో అధికారం చేపట్టిన తర్వాత కూడా మసూద్ అజార్ తమ దేశంలో లేడని వెల్లడించారు. రెండు దేశాలు అతడు తమ దేశంలో లేడని చెబుతుంటూ అతడు ఎక్కడ ఉన్నాడు అనే విషయంలో స్పష్టత లేదు.

# నాలుగు పార్టీలతో టివికె కూటమి

## సెక్యులర్ సోషల్‌జస్టిస్ విక్టరీ అలయన్స్‌గా ప్రకటించిన సిఎం విజయ్

**చెన్నై, సెప్టెంబరు 9:** తమిళనాడు ముఖ్యమంత్రి, టివికె అధినేత సి. జోసెఫ్ విజయ్ తమ పార్టీతో కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ కలిసి ఏర్పాటు చేస్తున్న రాజకీయ కూటమికి అధికారికంగా " సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అనే పేరును ఖరారు చేశారు. బుధవారం చెన్నైలోని పనయూర్‌లో ఉన్న టివికె పార్టీ ప్రధాన కార్యాలయంలో కూటమి నేతల సమావేశం అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. రాజకీయ కూటమిని అధికారికంగా ఏర్పాటు చేయడం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం కోసం ఈ సమావేశాన్ని నిర్వహించారు. కూటమికి పేరు పెట్టడంతో పాటు ఉమ్మడి కనీస కార్యక్రమం రూపకల్పనపై కూడా నేతలు చర్చించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ తరఫున మాణికం ఠాగూర్, తారగై కుత్బర్ట్, ప్రవీణ్ చక్రవర్తి; వీసీకే నుంచి తోల్ తిరుమావళవన్, వన్ని అరసు, రవి కుమార్, చింతనై సెల్వన్; ఎండీఎంకే నుంచి వైకో, దురై వైకో; ఐయూఎంఎల్ నుంచి కేఎం కాదర్ మొయిదీన్, షాజహాన్ హాజరయ్యారు. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత మాణికం ఠాగూర్ మాట్లాడుతూ కూటమికి చైర్‌పర్సన్‌గా సిఎం విజయ్ వ్యవహరిస్తారని తెలిపారు. రాబోయే ఉప ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులనుకూడా కూటమి తరఫునే ప్రకటిస్తామని వెల్లడించారు. జూలై 1న విజయ్‌తో మిత్రపక్షాల నేతలు జరిపిన తొలి సంప్రదింపుల అనంతరం ఇది రెండో కీలక సమావేశం. తొలి సమావేశంలో అధికారిక రాజకీయ కూటమి ఏర్పాటు, సమన్వయ వ్యవస్థ, ఉమ్మడి కనీసకార్యక్రమంపై చర్చ జరిగినప్పటికీ కూటమి పేరును అప్పట్లో ప్రకటించలేదు. తాజాగా టీవీకే కూటమి ఏర్పాటును అధికారికంగా ఖరారు చేసే దిశగా చర్యలు చేపట్టింది. బుధవారం జరిగిన సమావేశానికి ముందు పార్టీ మంత్రులు మిత్రపక్షాలు, ఇతర పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపారు. వీసీకే అధినేత తిరుమావళవన్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో సమావేశానికి హాజరవుతున్నట్లు ముందుగానే ధృవీకరించారు. అయితే సిపిఐ, సిపిఎం మాత్రం కూటమిలో చేరకుండా టివికె ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తామని స్పష్టం చేశాయి.

# 'భారతరత్న'కే ఓటరు జాబితాలో పేరు గల్లంతు!

**బెంగళూరు, సెప్టెంబరు 9:** భారతదేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న గ్రహీత ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్. రావు పేరు ఓటర్ జాబితాలో తప్పుగా నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది. కర్ణాటకలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఆయన పేరులో అక్షర వ్యత్యాసం గుర్తించారు. దీంతో తన గుర్తింపును నిర్ధారించేందుకు విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసు జారీ చేశారు. 2002 నాటి ఓటర్ జాబితాలో సి.ఎన్.ఆర్. రావు పేరు "Prof C N R Rao"గా నమోదైంది. అయితే ప్రస్తుత ఓటర్ జాబితాలో ఆయన పేరు ప్రొఫెసర్ అన్న పదంలో డబుల్ ఎఫ్ ఉంది. అంటే పేరులో అదనంగా ఒక ఎఫ్ చేరింది. ఈ చిన్న అక్షర వ్యత్యాసమే సర్ ప్రక్రియలో అధికారుల దృష్టికి వచ్చింది. రావుకు నోటీసు పంపినట్లు సమాచారం.

సెల్ఫ్ నేమ్ మిస్‌మ్యాచ్ అంటే ఏమిట ఎన్యూమరేషన్ ఫారమ్‌లో ఓటరు 2002 ఓటర్ జాబితాలో ఉన్న తన వివరాలను ఉపయోగించినప్పుడు, ఆ వివరాలు ప్రస్తుత ఓటర్ జాబితాలో ఉన్న వివరాలతో సరిపోలకపోతే దాన్నిమిస్‌మాచ్‌గా పరిగణిస్తారు. పేరు, స్పెల్లింగ్ వంటి వివరాల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నప్పటికీ అవి అధికారిక పరిశీలనకు కారణమవుతున్నాయి. ఇలాంటి కేసుల్లో నోటీసు అందుకున్న వ్యక్తి మాత్రమే విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అందువల్ల ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్. రావు బెంగళూరులోని మల్లేశ్వరం ప్రాంతంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సమీపంలోని నిర్దేశిత ప్రదేశంలో వ్యక్తిగతంగా హాజరు కావాలని సూచించారు. బెంగళూరులో జన్మించిన 92 ఏళ్ల సి.ఎన్.ఆర్. రావు భారత శాస్త్రరంగంలో విశేష సేవలు అందించారు. మెటీరియల్స్ సైన్స్, కెమిస్ట్రీ తదితర రంగాల్లో ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఆయనకు 2014లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న లభించింది. ఈ గౌరవాన్ని అందుకున్న శాస్త్రవేత్తల్లో ఆయన మూడో వ్యక్తిగా గుర్తింపు పొందారు. సాధారణంగా ఓటర్ జాబితాలో పేరు లేదా ఇతర వివరాల్లో చిన్నపాటి వ్యత్యాసాలు ఉన్నప్పుడు వాటిని సరిచేసుకునే అవకాశం ఉంటుంది. అయితే సర్ ప్రక్రియలో భాగంగా వివరాలను ధ్రువీకరించేందుకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్. రావు వంటి దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్త పేరు కేవలం ఒక అక్షరం తేడాతో ఓటర్ జాబితాలో భిన్నంగా నమోదై, దాని కారణంగా నోటీసు రావడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# సంక్షిప్త వార్తలు

## ఢిల్లీ మాజీ చీఫ్ సెక్రటరీ రాకేశ్ మెహతా ఆత్మహత్య

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** ఢిల్లీ మాజీ చీఫ్ సెక్రటరీ, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాకేశ్ మెహతా (74) తీవ్ర విషాదకర రీతిలో ప్రాణాలు తీసుకున్నారు. నోయిడా సెక్టార్82 లోని కేంద్రీయ విహార్2 సొసైటీలో ఉన్న తన ఫ్లాట్‌లో ఆయన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహం వద్ద లభ్యమైన సూసైడ్ నోట్‌లో తాను గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, మానసిక ఆందోళనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారని పోలీసులు వెల్లడించారు. రాకేశ్ మెహతా 1975 బ్యాచ్‌కి చెందిన ఐఎఎస్ అధికారి.

## ఇరాన్ ట్యాంకర్లపై అమెరికా దాడులు..

**టెహ్రాన్, సెప్టెంబరు 9:** ఇరానీ ట్యాంకర్లపై అమెరికా దళాలు అటాక్ చేశాయి. సుమారు అయిదు ట్యాంకర్లను పేల్చినట్లు తెలుస్తోంది. గత రెండు రోజుల నుంచి అమెరికా యుద్ధనౌకను ఇరాన్ టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో అగ్రరాజ్యం ప్రతీకార దాడులకు దిగినట్లు సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. గల్ఫ్ ఆఫ్ ఓమన్‌లో ఉన్న ఐఆర్జీసీకి చెందిన నాలుగు ఇరానీ ఆయిల్ ట్యాంకర్లను టార్గెట్ చేసింది అమెరికా. ఖర్గ్ దీవి దగ్గర మరో ట్యాంకర్‌ను కూడా పేల్చేశారు. అమెరికా తాజా దాడులకు కౌంటర్‌గా ఇరాన్ కూడా ప్రతిదాడులు చేసింది.



## టిబెట్‌లో మళ్లీ స్వల్ప భూకంపం

**లాసా, సెప్టెంబరు 9:** టిబెట్‌లో బుధవారం భారీ భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో పొరుగు దేశమైన నేపాల్‌లోనూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.3గా నమోదైనట్లు యూరోపియన్‌మెడిటరేనియన్ సిస్మోలాజికల్ సెంటర్ (ఈఎంఎస్సీ) వెల్లడించింది. భూ అంతర్భాగంలో 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు ఈ సంస్థ పేర్కొంది. కాగా, భారత జాతీయ భూకంప పరిశోధన కేంద్రం (ఎన్సీఎస్) మాత్రం భూకంప తీవ్రతను 5.0గా నిర్ధారించింది.

## కర్ణాటక మంత్రి జర్కిహోళి నివాసాల్లో ఇడి సోదాలు

**బెంగుళూరు, సెప్టెంబరు 9:** కర్ణాటక పిడబ్ల్యూడీ శాఖ మంత్రి సతీశ్ జార్కిహోలీ నివాసాల్లో ఇవాళ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. మంత్రి సతీశ్ కుమార్తె, ఎంపీ ప్రియాంకా జార్కిహోలీ నివాసాల్లోనూ ఇడి తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రాపర్టీలకు చెందిన కేసులో ఈ విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం 18ప్రదేశాల్లో సోదాలు జరుగుతున్నాయి. బెంగుళూరులోని డాలర్స్‌కాలనీలోఉన్న మంత్రి సతీశ్ ఇంటితో పాటు అనేక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## బుల్లెట్‌రైలు ఢీకొని కేరళ యువతి మృతి

**కన్నూరు, సెప్టెంబరు 9:** జపాన్‌లో నర్సింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న 22 యేళ్ల కేరళ యువతి దేవిక బుల్లెట్ రైలు ఢీకొని మృతిచెందింది. జపాన్ వెళ్లేందుకు డబ్బులేక, కూతురి మృతదేహాన్ని తీసుకురాలేక ఆమె పేరెంట్స్ అంతిమ వీడ్కోలు పలకలేకపోతున్నారు. జపాన్‌లో ఉన్న కేరళ సంఘం నిహన్ కైరేలీ దేవిక అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో మరో ఇద్దరు హిందువుల దారుణ హత్య

**ఢాకా, సెప్టెంబరు 9:** బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు ఆందోళనకరంగా మారుతున్న వేళ వేర్వేరు ఘటనల్లో ఇద్దరు హిందువులు దారుణ హత్యకు గురయ్యారు. మృతుల్లో ఓ మహిళ కూడా ఉంది. తాజా ఘటనలతో హిందూ మైనారిటీల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నౌగావ్ జిల్లా మహాదేవ్‌పూర్‌లో 45 ఏళ్ల హిందూ స్వర్ణకారుడు అలీఫ్ చంద్ర దత్తా హత్యకు గురయ్యాడు.

10-9Pg6exHMNWJQE:10-9Pg6exHMNWJQE.qxd 9/9/2026 11:50 PM Page 1



# తంపరలో 'భూ' దోపిడి

### - డి పట్టా, ఎల్ సి భూములే అక్రమార్కుల టార్గెట్ - వారికి అండగా రెవిన్యూ అధికారులు - నకిలీ దస్త్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్‌లు

**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా), సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** సంతబొమ్మాళి మండలం ఈస్ట్ కోస్ట్ పవర్ ప్లాంట్ స్థలంకు ఎదురుగా ఉన్న తంపర భూముల్లో కొందరు అక్రమార్కులు భూ దోపిడికి పాల్పడుతున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో డి పట్టా భూములకు నకిలీ దస్తాలు సృష్టించి యదేచ్ఛగా క్రయ విక్రయాలు జరిపిస్తున్నారంటే వీరి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. ఈ విధంగా సుమారు 150 ఎకరాలకు పైగా ఈ ప్రాంతంలో భూములు అక్రమంగా చేతులు మారినట్లు సమాచారం. ముఖ్యంగా డి పట్టా భూములు, అస్సైన్డ్ భూములు భూ యజమానులు వాటిని సాగు చేసుకొని అనుభవించడానికి తప్ప ఎటువంటి క్రయ విక్రయాలు తావుండదు. అయితే ఇక్కడ రెవిన్యూ సిబ్బంది సహకారంతో అక్రమార్కులు చీకటి ఒప్పందాలు చేసుకొని ఎటువంటి భూములలైనా క్రయ విక్రయలు యదేచ్ఛగా జరిపిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో సుమారు వంద ఎకరాలకు పైగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తుంది.మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణం ప్రారంభం కావడంతో నౌపడ, యమాల పేట, పోతునాయుడుపేట, హనుమంతు నాయుడుపేట వడ్డీతాండ్ర, కోటపాడు, కాశీపురం పరిసర ప్రాంతాల్లో భూములు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. అమాంతంగా భూములు రేట్లు పెరిగిపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో చోటా రాజకీయ నాయకులు కన్ను డీ పట్టా భూములపై పడింది. డీ పట్టా భూములు యజమానులకు పరిశ్రమలు వస్తే మీకు ఇచ్చిన భూములు ప్రభుత్వం మళ్ళీ వెనక్కు తీసుకుంటుందని నమ్మ బలికి రెవిన్యూ సిబ్బంది సహకారంతో తక్కువ ధరకు వాటిని కొనుగోలు చేసి అక్రమార్కులు తమ పేర్లకు ఆ భూములు మార్చుకున్నారు. వీటిలో కొంత మంది నకిలీ పత్రాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు సమాచారం. ఈ విధంగా వడ్డీతాండ్ర బొంట్లీలో సర్వే నెంబర్ 1803, 1703, 1832.దాదాపు 8ఎకరాల డి పట్టా భూములు చేతులు మారినట్లు సమాచారం ఉంది. అలాగే యమాలపేట నుంచి ఇజ్జువరకు మధ్యలో ఉన్న 150ఎకరాల ఇనాం (ఎల్ సి) భూములు కూడా సాగు చేస్తున్న రైతుల నుండి తక్కువ ధరకే కొనుగోలు చేసి లోపరిక ఒప్పందాలు జరిగినట్లు స్థానిక రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో భూదోపిడీ సంబంధించి తాజాగా స్పందించిన ఓ రైతు చేసిన వ్యాఖ్యలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. భూముల వాస్తవ విస్తీర్ణం, యాజమాన్య హక్కులు, ఒప్పందాలు, సర్వే ప్రక్రియ, అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ భూదోపిడీని క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది ఈ అక్రమార్కులకు అండగా నిలబడడంతో ఈ వ్యవహారం యదేచ్ఛగా జరుగుతుందన్నారు. ఈ వ్యవహారంలో నౌపడ, హెచ్ ఎన్ పేట సచివాలయంలో ఇదివరకు పని చేసిన రెవిన్యూ సిబ్బంది (సర్వేయర్లు) కీలక పాత్ర వహించి సొమ్ము చేసుకున్నారని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ భూ దోపిడి, చీకటి ఒప్పందాలు జరిగాయాని సాక్షత్ ఒక జిల్లా



అధికారి పేర్కొనడం చూస్తుంటే అక్రమాలు ఏ మేరకు జరిగాయో బహిర్గతమవుతుంది. తంపరలో జరిగిన భూములు దోపిడిపై రెవిన్యూ ఉన్నత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహిస్తే ఈ దోపిడి వెనుక ఉన్న అధికారుల పాత్ర ఏ మేరకు ఉందో వాస్తవాలు బయటపడతాయి. నిజంగా ఇక్కడ డి పట్టా భూములు విక్రయాలు జరిగాయా లేదా రికార్డులలో తారుమారు అయ్యాయా అనేది తేటతెల్లం కావచ్చుననే అభిప్రాయాం సర్వత్రా వినిపిస్తుంది. ఒప్పటికైనా అధికారులు ఈ భూ దోపిడిపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానిక రైతాంగం కోరుతున్నారు. ఈ భూ దోపిడీపై తహసీల్దార్ హేమసుందరరావు వద్ద ప్రస్తావించగా తంపరలో ఉన్న డి పట్టా భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి రికార్డులు తారుమారు అయినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే తాను ఇక్కడ బాధ్యతలు చేపట్టిన తర్వాత నిర్వహించిన రీ సర్వేలో ఆ భూములన్ని ప్రభుత్వ భూములుగా గుర్తించామన్నారు. ఇంకా ఈ సర్వే సంబంధించి ఈ ఎల్ ఆర్ ప్రక్రియ పూర్తి కాలేదని ఇది పూర్తి అయితే వాస్తవ భూయజమానుల పేర్లు తెలుస్తాయని తహసీల్దార్ తెలిపారు.

## భక్తుల సేవలోకి రూ.4 కోట్ల నూతన కళ్యాణ మండపం ప్రారంభం

**గడ్డమణుగు, జీలుగుమిల్లి, సెప్టెంబర్ 09,(ప్రభాతవార్త)** శ్రీ ద్వారక తిరుమల చిన్న వెంకన్నను సామాన్య భక్తులకు సైతం మరింత దగ్గర చేసేందుకు స్వామివారి ఉపాలయమైన ఎన్టీఆర్ జిల్లా మైలవరం శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో రూ.4.00 కోట్ల వ్యయంతో శ్రీ లక్ష్మీ నరసింహా నూతన కళ్యాణ మండపాన్ని ఆలయ చైర్మన్ రాజా సూరనేని వెంకట సుధాకర రావు ఆధ్వర్యంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డితో కలిసి ప్రారంభోత్సవంలో పాల్గొనట్లు మాజీ జెడ్పిటిసి, జనసేన జిల్లా సీనియర్ నాయకులు, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం స్టేట్ ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళ్యాణ మండపానికి శ్రీశ్రీశ్రీ కొచ్చర్లపాటి నరసింహం గురువుగారి సూచన మేరకు శ్రీ లక్ష్మీ నరసింహా కళ్యాణ మండపంగా పేరు పెట్టడం జరిగిందన్నారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఏర్పడక ద్వారకాతిరుమలలో భక్తుల సౌకర్యార్థం రూ.50.00 కోట్లుతో క్యూ కాంప్లెక్స్, తూర్పు గోపురం, అనివెట్టి మండపం (వివాహాలు, అన్నప్రాసనలకు) తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరో దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాధపురం శ్రీ లక్ష్మీ నరసింహా ఆలయంలో ఈనెల 19వ తేదీ వరకు పవిత్రోత్సవాలు, వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆలయానికి శ్రీశ్రీశ్రీ కొచ్చర్లపాటి నరసింహం గురువుగారి ఆధ్వర్యంలో మునుముందు మహర్దశ పట్టణం ఉందని రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు

# తిరుమల సమాచారం

## అంగరంగవైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

### - సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ విడుదల



**తిరుమల,సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబర్ 15నుండి 23వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12నుండి 20వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా జరిపించేందుకు టిటిడి సకల ఏర్పాట్లు చేసింది. సెప్టెంబర్‌లో సాలకట్ల, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఉత్సవాల షెడ్యూల్‌తో కూడిన బుక్‌లెట్‌ను బుధవారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో చైర్మన్ బిఆర్ నాయుడు ఆవిష్కరించారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. బ్రహ్మోత్సవాల సమయంలో జరిగే వాహన సేవలు, ఇతర ముఖ్య కార్యక్రమాల వివరాలను భక్తులకు సులభంగా తెలియజేసేందుకు దీనిని రూపొందించినట్లు బిఆర్ నాయుడు తెలిపారు. ఉత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపీనాథ్,బోర్డు సభ్యులు,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, సివిఎస్ఒ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఘాట్‌రోడ్డులో భక్తుల భద్రతకు ప్రాధాన్యత




**తిరుమల,సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల ఘాట్‌రోడ్డులో భక్తులు, ప్రయాణికుల రాకపోకలు పెరిగే నేపథ్యంలో భద్రతకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తిరుపతి జిల్లా రవాణాధికారి కొర్రపాటి మెరళీమోహన్ తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రవాణా శాఖ ,పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తిరుమల ఘాట్ రోడ్‌లో బుధవారం మధ్యాహ్నం వాహన తనిఖీలు చేశారు. ఆర్‌టిఒ కొర్రపాటి మురళి మోహన్ ఆధ్వర్యంలో ఘాట్‌రోడ్డులో ప్రయాణిస్తున్న వివిధ రకాల వాహనాలను తనిఖీ చేసి, వాహనాల సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలించడం, సీట్‌బెల్ట్, హెల్మెట్ వంటి భద్రతా నిబంధనలు పాటించకపోవడం తదితర ఉల్లంఘనలను గుర్తించారు. ప్రత్యేకంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న జీపులపై 8 కేసులు నమోదు చేశారు. అలాగే సీట్‌బెల్ట్ ధరించని, హెల్మెట్ ధరించని 20 వాహనదారులపై కూడా నిబంధనల మేరకు కేసులు నమోదు చేసి, వాహనదారులకు భద్రతా సూచనలు అందించారు. తిరుమల ఘాట్ రోడ్డులో రక్షణాత్మకమైన డ్రైవింగ్ చేస్తూ , చిన్నపాటి నిరక్ష్యం కూడా చేయకుండా ప్రమాదాలకు దారితీసే ధోరణి విడిచి వాహనదారులు తగు జాగ్రత్త వహించాలని తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో దేశం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు వచ్చే నేపథ్యంలో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే ప్రయాణికులను తీసుకెళ్లాలని, వేగ పరిమితులను పాటించాలని, సీట్‌బెల్ట్/హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ఘాట్‌రోడ్డులో ఓవర్‌టేకింగ్ మరియు నిరక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తిరుమలకు వచ్చే భక్తులు కూడా వాహనదారుల సూచనలు పాటిస్తూ, సురక్షితంగా శ్రీవారి దర్శనం చేసుకుని క్షేమంగా తిరిగి వెళ్లేలా సహకరించాలని రవాణా శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ ప్రత్యేక తనిఖీలలో ఎంవిఐలు వెంకటరమణ నాయక్, ప్రసాద్ వర్మ, ట్రాఫిక్ సిబ్బంది

## తిరుమల ఘాట్‌లో చిరుత - భయంతో భక్తులు



**తిరుమల,సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం ఏడుకొండలపైకి గోవింద నామస్మరణతో కాలి నడకన వచ్చే అలిపిరి మార్గంలో మరోసారి చిరుతపులి సంచరించింది. ఈ సంఘటనతో భక్తులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. అలిపిరి మార్గంలోని ఏడో మైలు రాయి సమీపంలో చిరుత సంచరిస్తుండటాన్ని గమనించిన కాలినడక భక్తులు వెంటనే అప్రమత్తమై ఈ విషయాన్ని టిటిడి విజిలెన్స్, అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న వెంటనే అటవీశాఖ, టిటిడి భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అప్రమత్తమైన అధికారులు కాలినడకన వెళ్లే భక్తుల భద్రత దృష్ట్యా ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులు ఎవరూ ఒంటరిగా నడవకుండా, గుంపులు గుంపులుగా (బృందాలుగా) మాత్రమే ముందుకు సాగేలా చూస్తున్నారు. భక్తులకు రక్షణగా సెక్యూరిటీ, అటవీశాఖ సిబ్బందిని నడక మార్గంలో మోహరించారు. ఏడో మైలు పరిసర ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేసి, సిసికెమెరాల ద్వారా చిరుత కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, నడక మార్గంలో వెళ్లే సమయంలో పిల్లలను కనిపెట్టుకుని ఉండటంతో పాటు అధికారుల సూచనలు పాటించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## తిరుమల మొదటి ఘాట్‌లో సినిమా ఫక్కీలో ప్రమాదం



**తిరుమల,సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌లో చివరిమలుపు వద్ద భక్తుల కారు సినిమాఫీట్‌లా రెయిలింగ్‌పైకి దూసు కెళ్ళింది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. లేకుంటే కొంచెం ముందుకు కారు వెళ్ళివున్నా 30అడుగుల లోయలో బోల్తాపడి ప్రాణనష్టం జరిగేది. తమిళనాడుకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో బుధవారం సాయంత్రం తిరుపతికి వెళుతుండగా చివరి మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. కారును డ్రైవర్ ఆపడంతో రెయిలింగ్‌పై దూసుకెళ్ళి ఆగిపోయింది. ఈ సంఘటనతో దిగే ఘాట్‌లో వాహనాలు ఆగిపోయాయి. అలిపిరి ఎవిఎస్ఒ రమేశ్ కృష్ణ ,సిబ్బంది కారును తొలగించి వాహనాలను క్రమబద్ధీకరించారు.

## బిఎఎంఎస్, బిహెచ్ఎంఎస్, బియూఎంఎస్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

**విజయవాడ,సెప్టెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా సీట్లను దీని ద్వారా భర్తీ చేయనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఇప్పటి నుంచి ఉదయం 11 నుంచి 16వ రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఒరిజినల్ ధ్రువ పత్రాలను అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలి.

## శ్రీకాళహస్తిలో 22 నుంచి పవిత్రోత్సవాలు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 22 నుంచి ఐదు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించుటకు వేదపండితులు,అర్చకులు ఖరారుచేసినట్లు ఆలయ ఇఒ బికె వెంకటేశులు బుధవారం మీడియాకు తెలిపారు.ఈ ఐదు రోజులు ఆలయంలో పలుమార్పులుచేర్పులుంటాయని వివరించారు.ఈ మార్పులను భక్తులు గమనించాలన్నారు.ఈ నెల 22 నుంచి 26 వరకు జరుగు పవిత్రోత్సవాల సందర్భంగా 26వ తేది అన్ని అర్జిత సేవలు రద్దు చేసినట్లు తెలిపారు. ఇక ప్రతి రోజూ ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు,సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు స్వామి అమ్మవార్ల గర్భాలయంలో విశేష పూజలు,అభిషేకాలు నిర్వహిస్తామని కాబట్టి ఆ సమయంలో అంతరాలయ దర్శనం ఉండదని వివరించారు ఈ నేపథ్యంలో రూ.500ల టిక్కెట్ల మీద అ ంతరాలయ దర్శనం కూడా ఉండదని స్పష్టం చేసారు. కాబట్టి ప్రతి రోజూ ఉదయం 10గంటలకు నిర్వహించే ఉచ్చికాల అభిషేకాలను సమయం కొంత మార్పు చేసి ఉదయం 9.30గంటలకు నిర్వహిస్తామన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా 22 నుంచి 26 వరకు విఐపిలకు ప్రత్యేకాహ్వానాలు ఉండద న్నారు. ఈ మార్పును భక్తులు గుర్తించాలని సహకరించాలని ఇఒ వెంకటేశులు కోరారు.

## సిఎం దూరదృష్టితో విద్యుత్ వాహనాలకు మరింత ప్రోత్సాహం

### - ఇవి పాలసీతో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు బలమైన పునాది - విద్యుత్ వాహనాల కొనుగోలుపై 5 శాతం రాయితీ.. ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి,సెప్టెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణ పట్ల ఉన్న నిబద్ధతతో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదూరదృష్టి ఈ కీలక నిర్ణయాన్ని అమలు చేస్తున్నామన్నారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024-29 సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ ద్వారా విద్యుత్ వాహనాల తయారీదారులతో పాటు కొనుగోలుదారులకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్ల కొనుగోలుపై ఎక్స్‌షోరూమ్ ధరలో 5 శాతం వరకు రాయితీ కల్పించామని తెలిపారు. ఈ ప్రోత్సాహకం 2027 మార్చి వరకు వర్తిస్తుందని చెప్పారు.రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకునే విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు కల్పించడం ద్వారా ప్రజలు ఈవీల వైపు మళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించేందుకు తొలి 5,000 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఖర్చులో 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈవీలకు పెరుగుతున్న ఆదరణ..దేశంలో విద్యుత్ వాహనాల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఆగస్టులో దేశవ్యాప్తంగా సుమారు 2.98 లక్షల విద్యుత్ వాహనాలు విక్రయించబడటం, గత ఏడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదవడం ఈ రంగానికి పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమన్నారు. మొత్తం వాహన మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరగడం భవిష్యత్ రవాణా వ్యవస్థలో విద్యుత్ వాహనాల ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు.ఏపీలో ఈవీ విప్లవానికి చంద్రబాబు నాయకత్వం.2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ ద్విచక్ర వాహనాలు, కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త విద్యుత్ కార్లను ప్రోత్సహించడంతో పాటు ప్రజా రవాణాలో ఈవీల వినియోగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ప్రతి 30 కిలోమీటర్లకు ఒక విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి తీసుకురావడం, ఈమొబిలిటీ నగరాల అభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి చర్యలు రాష్ట్రంలో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆలోచన, దూరదృష్టి, నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా బాల బాలికలకు పాటల పోటీలు : డా గజల్ శ్రీనివాస్

**విజయవాడ,సెప్టెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** నాలుగవ ప్రపంచ తెలుగు మహా సభలు-బాలలు సందర్భంగా డా.భానుమతి రామకృష్ణ వేదికపై 16 ఏళ్ల లోపు బాల బాలికలకు పాడనా తెలుగు పాట ( కరోకే మాధ్యమం ద్వారా) కార్యక్రమం రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ సారసత్వ పరిషత్తు నిర్వహించ నున్నదని ఆ పరిషత్ అధ్యక్షులు డా గజల్ శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ప్రాధమిక పరిశీలన ఎంపిక కై కరోకే మాధ్యమం ద్వారా రెండు గీతాల్ని రికార్డు చేసి శ్రీవిద్య8 జిమెయిల్.కామ్ ఈమెయిల్ ద్వారా జొన్నలగడ్డ వల్లీ శ్రీవిద్య కి 30 సెప్టెంబర్ లోపున పంపాలి. ఎంపిక అయిన వారికి సమాచారం నేరుగా 15 అక్టోబర్ లోపున తెలియజేయబడుతుంది. ఎంపిక అయిన వారు రెండు గీతాలు సోలో, యుగళ గీతం లో పాడవలసి వుంటుంది. తెలుగు సాహిత్య , సంగీత విలువలు ఉన్న గీతాలు పాడాలి. అశ్లీలమైన గీతాలు , జాతీయ సమైక్యత కు విఘాతం కల్గించే గీతాలు పాడరాదు . ఎంపిక కాబడిన వారికి స్థానిక దార్మంటరీ సదుపాయం, స్థానిక రవాణా కలుగు జేయబడతాయి. వేదికపై ప్రశంసా పత్రము, శాలువా, పతకము తో సత్కారం ఉంటుందని కార్యదర్శి రెడ్డప్ప ధవేజి, సమన్వయ కర్తలు డా. కే . మురళీ ధర్ రెడ్డి, కోగంటి శ్రీకాంత్ లు తెలిపారు.డిసెంబరు నెల 5,6 తేదీల్లో నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఒంగోలు ప్రాంగణం లో నాలుగవ ప్రపంచ తెలుగు మహా సభలునిర్వహిస్తున్నారు.

## వైసిపి ఎమ్మెల్సీ భరత్ వ్యాఖ్యలు అరాచకం

### టిటిడి బోర్డుసభ్యుడు జి. భానుప్రకాశ్ రెడ్డి

**తిరుపతి,సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** రక్తాభిషేకం చేసైనా గెలుస్తామన్న వైసిపి ఎమ్మెల్సీ భరత్ వ్యాఖ్యలు దారుణమని, 11 సీట్లకు పడిపోయినా ఆ పార్టీ నేతల్లో మార్పు రాలేదని బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి, టిటిడి బోర్డు సభ్యుడు జి. భానుప్రకాశ్ రెడ్డి విమర్శించారు. భరత్‌పై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజక వర్గంలో నిర్వహించిన వైసిపి కార్య కర్తల సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్సీ భరత్ చేసిన వ్యాఖ్యలపై భానుప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "చంపడానికైనా, చావడానికైనా సిద్ధపడేవారికే టికెట్లు ఇస్తామని, ప్రత్యర్థులు రక్తాన్ని కోరుకుంటే రక్తాభిషేకం చేసైనా సరే గెలుస్తాం" అని ఎమ్మెల్సీ భరత్ వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా అవమానించడమేనని, ఇది వైసిపి నాయకత్వం లోని అరాచకత్వానికి పరాకాష్ఠ అని మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని కేవలం 11 స్థానాలకే పరిమితం చేసి ఘోర పరాజయాన్ని అందించినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. ప్రజల మధ్య హింసను ప్రేరేపిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడిన ఎమ్మెల్సీ భరత్‌పై పోలీసులు తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తిరుమలలో దుకాణాలకు జియో ఫెన్సింగ్



**తిరుమల,సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలోని దుకాణాలు, హోటళ్లు, వాణిజ్య సంస్థల వివరాలను డిజిటల్ విధానంలో సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడంతో బాటు లైసెన్సుల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు టిటిడి ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందిస్తోంది. ఇందుకోసం టిటిడి అదనపు ఇఒ చారుమామిళ్ళవెంకయ్య చౌదరి బుధవారం సాయంత్రం తిరుమల పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో యాప్ ను రూపొందిస్తున్న అమరావతి సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఆ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా యాప్ గురించి అదనపు ఇఒకు వివరించారు. తిరుమలలోని దుకాణాలు, వ్యాపార సంస్థలు, హోటళ్లు, ఇతర వాణిజ్య కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం, లైసెన్సు వివరాలు, గడువు తేదీలు తదితర అంశాలు ఒకే వేదికపై అందుబాటులో ఉండేలా యాప్ ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. జియో ఫెన్సింగ్ సాంకేతికత ఆధారంగా దుకాణాల ఖచ్చితమైన స్థానాలను గుర్తించి, వాటి నిర్వహణ, పర్యవేక్షణను సులభతరం చేసేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. అనంతరం యాప్ రూపకల్పన పురోగతి, అందులో పొందుపరుస్తున్న సదుపాయాలు, జియో ఫెన్సింగ్ వ్యవస్థ అమలు, లైసెన్సింగ్ నిర్వహణ తదితర అంశాలపై అదనపు ఇఒసమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకత సమర్థతకు ప్రాధాన్యతనిస్తూ యాప్ ను అభివృద్ధి చేయాలని సూచించారు. తిరుమలలోని అన్ని వ్యాపార సంస్థల వివరాలను సమగ్రంగా నమోదు చేసి, సేవల నిర్వహణను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టిటిడి ఇన్ ఛార్జ్ ఎప్ఎసిఎఒ రవి ప్రసాదు, ఎస్టేట్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు, సిఎఒ వెంకట రమణ, ఇన్ ఛార్జ్ ఐటి జిఎం వేంకటేశ్వర్లు నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి,అమరావతి సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఇఒ లోకనాథం సస్పెన్షన్



**తిరుమల,సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ఇటీవల ఆదాయానికి మించి ఆస్తులు కలిగి వున్న కేసులో ఎసిబికి పట్టుబడి అరెస్ట్ అయిన టిటిడి తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ ఎం. లోకనాథంను టిటిడి సస్పెన్షన్ చేసింది. ఆయనపై టిటిడి బోర్డు సమావేశంలో చర్యలు తీసుకుంది. ఎసిబికి పట్టుబడి జైల్లో ఉన్న ఆయన్ను సస్పెండ్ చేస్తూ టిటిడి ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకే ఆలయ ఇన్‌ఛార్జి డిప్యూటీ ఇఒగా భాస్కర్ నియమితులైన్నారు.

## శివయ్య హుండీ రాబడి రూ.1.51కోట్లు



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఇఓ వెంకటేశులు, చైర్మెన్ సాయి ప్రసాద్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లతో పాటు పరివార దేవతల ఆలయాల వద్ద భక్తులు 15రోజుల పాటు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. లెక్కింపులో రూ.1.51కోట్లు వచ్చినట్లు ఇఒ బికె వెంకటేశులు తెలిపారు .దేవాదాయశాఖ ఆదేశాలతో ప్రతి 15రోజుల కొకమారు హుండీలను లెక్కిస్తు న్నట్లు తెలిపారు. ఆలయంలో రూ.500ల పూజలు నిర్వహించే మండపంలో లెక్కింపు జరిపినట్లు వివరించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం భక్తులు హుండీల్లో సమర్పిస్తున్న కానుకలు పెరుగుతున్నాయని ఇఒ అభిప్రాయపడ్డారు. హుండీల ద్వారా రూ.1,51,82,310లు నగదు వచ్చిందన్నారు.అలాగే రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకునే భక్తులు వెండి నాగపడగల రూపంలో 360కిలోలు వచ్చిందని అలాగే బంగారం 22 గ్రాములు వచ్చిందన్నారు. కాగా వివిద దేశాలకు చెందిన కరెన్సి నోట్లు 103 వచ్చినట్లు వివరించారు.ఆలయంలో ప్రవేశ పెట్టిన సంస్కరణలు సత్ఫలితాలు నిస్తుందన్నారు. అంతేకాక ఆన్‌లైన్ విధానాలతో దళారుల బాధను తప్పిందన్నారు. హుండీల లెక్కింపుల్లో ఆలయ చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ ఇఇ శ్రీనివాసురాజు, ఎఇఒలు లోకేష్‌రెడ్డి, హేమామాలిని శివసేవకులు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారని ఇఒ వెంకటేశులు తెలిపారు.

## సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో నిందితులను కస్టడీకి ఇవ్వాలని కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు

**విజయవాడ,సెప్టెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** రౌడీ షీటరు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు సిట్ దర్యాప్తు అంశంలో మరో కీలక పరిణామం చేరుకుంది. ఈ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా విజయవాడ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది.కసులో ఏ2 నిందితుడు అశోక్ కుమార్, ఏ7 నిందితుడు వెంకటరాజులను రెండు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని సిట్ అధికారులు కోరారు. ఈ కేసులో గతంలో మాజీ సీఐ నాగరాజు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా మరిన్ని వాస్తవాలను రాబట్టేందుకు, లోతైన విచారణ జరిపేందుకు వీరి కస్టడీ అవసరమని అధికారులు పేర్కొన్నారు. నిందితుల నుంచి మరిన్ని కీలక ఆధారాలు సేకరించాల్సి ఉందని పిటిషన్‌లో వివరించారు.సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించిన న్యాయస్థానం, దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని నిందితుల తరఫు న్యాయవాదులను ఆదేశించింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం, నిందితులను కస్టడీకి అప్పగించే అంశంపై కోర్టు తుది నిర్ణయం తీసుకోనుంది.

10-9Pg7exHMNWJQE:10-9Pg7exHMNWJQE.qxd 9/10/2026 12:18 AM Page 1



# గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసిపికి లేదు : మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, సెప్టెంబర్9,ప్రభాతవార్తప్రతినిధి:** గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు లభించకపోవడంపై వైసీపీ నేతలు మాట్లాడటం చూస్తుంటే... అసలు వారికి ఆ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఎవరు ఇచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఐదేళ్ల అధికారంలో ఉండి కళాశాల అభివృద్ధిని పట్టించుకోని వారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రజలకు మెరుగైన పశువైద్య సేవలు అందించడంతో పాటు, ఈ ప్రాంతంలో వెటర్నరీ విద్యను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో గరివిడిలో వెటర్నరీ కళాశాలను ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అని అచ్చెన్నాయుడు తెలిపారు. 2017 ఏప్రిల్‌లో రూ.81.72 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని, 2018 ఫిబ్రవరిలో సుమారు 90 ఎకరాల భూమిని కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన ఐదేళ్ల సమయం అధికారంలో ఉన్న వైసీపీ ఏం చేసింది? అని మంత్రి నిలదీశారు. ఐదేళ్లలో ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా? అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చారా? వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించారా? నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారా? కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారా? ఈ ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2024 ఆగస్టు నాటికి పూర్తికావాల్సిన నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని స్పష్టం చేశారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ప్రధాన లోపాలు లేవని తాజా వీసీఐ పరిశీలన స్పష్టం చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. వీసీఐ జూలై 27, 28 తేదీల్లో కళాశాలను తనిఖీ చేసిందని, భవనాలు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. ఒక వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు రావాలంటే ఎలాంటి ప్రమాణాలు పాటించాలో మీకు తెలుసా? ఐదేళ్లలో కళాశాలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు సమకూర్చారా? మౌలిక సదుపాయాలు కల్పించారా? అవసరమైన భవనాలు నిర్మించారా? కనీసం ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా? కేవలం 4 ప్రొఫెసర్లు, 8మంది అసోసియేట్ ప్రొఫెసర్ల కొరత కారణంగానే అనుమతి నిరాకరించబడిందని తెలిపింది. ఇది కూడా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏర్పడిన సమస్య కాదా? అని మంత్రి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్లినికల్ కాంప్లెక్స్, బాలురు, బాలికల వసతిగృహాల నిర్మాణ పనులను పూర్తి చేసిందన్నారు. వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా దాదాపు 99 శాతం మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని తెలిపారు.

కళాశాలలో సిబ్బంది కొరతను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తం 253 బోధనా పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి పొందామని మంత్రి తెలిపారు.

# బ్రహ్మోత్సవాలలో నాణ్యంగా ప్రత్యక్ష ప్రసారాలు



**తిరుమల,సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని ఎస్వీబిసి భక్తుల మదిని దోచే కార్యక్రమాలను రూపొందించి, ప్రసారం చేసేలా ఉద్యోగులందరూ సమన్వయ సహకారాలతో పనిచేయాలని ఎస్వీబీసి ఛైర్మన్ బి. శ్రీధర్‌వర్మ పిలుపునిచ్చారు. ఛానల్ కార్యాలయంలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నిర్వహణపై బుధవారం సాయంత్రం జరిగిన సమీక్షా సమావేశంలో ఛైర్మన్ శ్రీధర్‌వర్మ, టిటిడి జెఇఒ ,ఎస్వీబీసి సిఇఒ డాక్టర్ ఎ. శరత్‌తో కలిసి విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఛానల్‌కు అవసరమైన పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రాధాన్యతనిస్తామని వెల్లడించారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో నాణ్యంగా ప్రత్యక్ష ప్రసారాలు అందించాలని, ఇతర ఛానళ్లకు క్లీన్ ఫీడ్ ఇవ్వాలని సూచించారు. ఎస్వీబీసి సామాజిక మాధ్యమం భక్తులను ఆకట్టుకునే విధంగా రీల్స్‌ను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్వీబీసి సిఇఒ డాక్టర్ ఏ. శరత్ మాట్లాడుతూ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్‌లో, నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ నెలలో జరుగుతుండటం వల్ల భక్తజనరంజకమైన కార్యక్రమాలను రూపొందించడానికి ఉద్యోగులందరూ కర్మోన్ముఖులు కావాలని సూచించారు. శ్రీవారి వాహనసేవలు, స్నపన తిరుమంజనం,

సాంస్కృతిక ప్రదర్శనలు, ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలను నాణ్యంగా ప్రసారం చేయాలని సూచించారు. కళాకారుల మనోభావాలు, నా దివ్యానుభూతులు, టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తుల అభిప్రాయాలను ప్రసారం చేయాలని సూచించారు. తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# బ్రహ్మోత్సవాలకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

## - రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్ రామచంద్రమోహాన్

**కాణిపాకం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీ స్వయంభూ వినాయకస్వామి దేవస్థానంలో ఈ నెల 14వ తేదీ నుండి జరుగనున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంకు దేవస్థానం సిబ్బంది, ధర్మకర్తల మండలి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ కమీషనర్ రామచంద్రమోహాన్ తెలిపారు. బుధవారం దేవస్థానం వద్ద చేపడుతున్న బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఇఓ కార్యాలయంలో దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఇఓ పెంచల కిషోర్‌లతో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాటు విషయంపై దేవస్థానం అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా గత ఏడాది కంటే ఈ ఏడాది 20 శాతం మంది ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశం వుందన్నారు. ఈ మేరకు భక్తులకు అవసరం వున్నా సౌకర్యాలను ఏర్పాట్లను ఈ నెల 12 కల్లా పూర్తి చేయడానికి అవసరమైన సూచనలు చేయడం జరిగిందన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం వద్ద చేపడుతున్న ఏర్పాట్లు సంతృప్తికరంగా వున్నాయని తెలిపారు. అయితే బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ క్రమబద్దీకరణకు ఏర్పాటు చేస్తున్న క్యూ లైన్ల పొడవును పెంచాలని ఆలయ అధికారులకు సూచించినట్లు చెప్పారు. అలాగే భక్తులకు తాగునీటి వసతి కల్పించడంతో పాటు అదనపు మరుగుదొడ్లను ఏర్పాటు చేసి వాటికి నీటి సరఫరా వుండేవిధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం పరిసరాల్లో పూర్తిగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపినట్లు చెప్పారు. భక్తుల అత్యవసర పరిస్థితులను దృష్టిలో వుంచుకుని ఆలయం వద్ద 4 అంబులెన్స్‌లను అందుబాటులో వుంచడంతో పాటు 2 ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు కమీషనర్ రామచంద్రమోహాన్ తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులు సంతృప్తికరంగా స్వామి వారిని దర్శించుకుని తిరిగి వెళ్ళేవిధంగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా బ్రహ్మోత్సవాల్లో సిఎం ఆదేశాల మేరకు సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భక్తుల భద్రతను దృష్టిలో వుంచుకుని ఆలయ క్యూలైన్ల వద్ద పెద్ద ఎత్తున సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కమీషనర్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఇఓ పెంచల కిషోర్, ఇఇ జగదీష్, సిఏఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 14వ తేదీ నుండి దేవస్థానంలో జరుగనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లను దేవాదాయశాఖ కమీషనర్ రామచంద్రమోహాన్ పరిశీలించారు. భక్తుల సౌకర్య దృష్ట్యా దేవస్థానం వద్ద అదనపు క్యూలైన్లు, సిసి కెమెరాల ఏర్పాట్లు, తాత్కాలిక షెడ్ల నిర్మాణం తదితర పనులను ఆయన ఛైర్మన్ మణినాయుడు, ఇఓ పెంచల కిషోర్‌లతో కలిసి పరిశీలించారు. దేవస్థానం అధికారులు ఇంజనీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఇ సతీష్, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి సేవలో కమీషనర్...

కాణిపాకం బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించడానికి విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ కమీషనర్ రామచంద్రమోహాన్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు రాజు గోపురం వద్ద దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఇఓ పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ఆయన పూజలు నిర్వహించారు. ఆయనకు వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి సినిమాకు ఇంటర్వెల్ పూర్తయింది

## వైసీపీ రీజియన్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి



వైసిపి సమావేశంలో ఐడి కార్డులు పంపిణీ చేస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి

**అనంతపురం, సెప్టెంబర్ 9(ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్రంలో ఎక్కడ చూసినా కూటమి ప్రభుత్వం కంటే వైఎస్ జగన్ పాలనే బాగుందని జనంలో చర్చ జరుగుతుందని , టిడిపి సినిమా కు ఇంటర్వెల్ అయిపోయిందని, స్థానిక ఎన్నికలకు క్యాడర్ తో పాటు పెద్ద నాయకులు కూడా సిద్ధం కావాలని వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి వెల్లడించారు. బుధవారం అనంతపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికిముఖ్యఅతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన పార్టీ రీజనల్ కోర్డినేటర్ మిథున్‌రెడ్డి తో పాటు పార్లమెంట్ పరిశీలకులు నరేష్ రెడ్డి, సమన్వయకర్తలు సాకే శైలజనాథ్, తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి , జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిథున్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఎక్కడా లేనివిధంగా ఒకే నోటిఫికేషన్‌తో పెద్ద ఎత్తున సచివాలయ ఉద్యోగుల నియామకాలు పూర్తి చేస్తే.. ఒక్క ఆరోపణ కూడా రాలేదు. కానీ కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీ పేరుతో దగా డీఎస్సీ నిర్వహించింది అన్నారు. రెండేళ్లుగా రైతాంగం కష్టాలు అన్నీఇన్నీ కావు. విద్యార్థులు, యువత ఉద్యోగాల కోసం ర్యాలీలు చేస్తున్న పరిస్థితి ఉంది అన్నారు .కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఎంతో మంది వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారు. వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకుంటునే క్యాడర్‌కు న్యాయం జరుగుతుంది అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో మనమంతా పటిష్టంగా పని చేద్దాం. అందరూ పార్టీ ఆదేశాల మేరకు పోటీ చేయాల్సి ఉంటుంది. మేం పెద్ద నాయకులమని భావించవద్దు. అందరూ పోటీకి సిద్ధంగా ఉండండి.ప్రజల పక్షాన మనం బలంగా పోరాడుతున్నాం. అధికారం ఉందని మనపై అక్రమ కేసులు పెడుతున్నారు.

# నెల్లూరులో విద్యా యజ్ఞం.. ప్రభుత్వ బడులకు మహర్దశ : మంత్రి నారాయణ

**నెల్లూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటైన విద్య, వసతులు అందించాలనే లక్ష్యంతో ఆధునీకరిస్తున్న ఆర్ఎస్ఆర్, డిఎస్ఆర్ హైస్కూల్స్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నెల 16వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ రెండు పాఠశాలలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల ఆధునీకరణ పనులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ బుధవారం తన కుమార్తె షరణితో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 15వ తేదీలోపు మిగిలిన పనులన్నీ పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం మూసివేసిన వీఆర్‌సీని ముందుగా ఆధునీకరించామని తెలిపారు. అక్కడ సీటు కోసం సుమారు 5 వేల మంది పేద విద్యార్థులు పోటీ పడటం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ఉన్న డిమాండ్‌కు నిదర్శనమన్నారు. నెల్లూరు సిటీలోని 15 ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నారు.

# ఖాకీలనే టార్గెట్ చేసిన దొంగల ముఠా

## 11 మంది అరెస్ట్, వాహనాలు, మారణాయుధాలు స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**హిందూపురం టౌన్ సెప్టెంబరు 09 ప్రభాతవార్త** పందుల దొంగల ముఠా సభ్యులు ఏకంగా పోలీసులనే టార్గెట్ చేస్తూ పందుల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రూరల్ సీఐ జనార్ధన్ ముఠా సభ్యుల వాహనాలను ఆపేందుకు ప్రయత్నించగా ముఠా సభ్యులు వాహనాన్ని ఆపకుండా తప్పించుకుపోయారు దీంతో పోలీసులు ముఠా సభ్యుల వాహనాన్ని వెంబడించి కాల్పులు కూడా జరిపారు ముఠా సభ్యులు పోలీసు వాహనంపై రాళ్ల రువ్వి తప్పించుకు పారిపోయారు. దీంతో హిందూపురం, పరిగి పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు అయింది. ఈ మేరకు బుధవారం హిందూపురం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎరుకుల చంద్రశేఖర్, సాకే రాజేష్, ఎరుకుల రమేష్, వెంకటేష్, సాకే మహేష్, ఎరుకుల గంగన్న, లక్ష్మణ్, రోహిత్, వెంకటేష్, బెస్త రాకేష్, ఎరుకుల సునీల్, అనంతపురంకు చెందిన పదిమంది, హిందూపురం చెందిన ఒకరు ఓ ముఠాగా ఏర్పడి పందులను దొంగతనం చేయడమే అలవాటుగా మార్చుకున్నారు. ఈ క్రమంలో అడ్డువచ్చే ప్రజలపై, పోలీసులపై దాడులు చేయడం కూడా జరిగింది. దీంతో నేడు హిందూపురం కొడికొండ సిరా హైవే సమీపంలో కొంతమంది వ్యక్తులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు హిందూపురం ఒకటవ పట్టణ సీఐ ప్రసాద్ బాబు, రూరల్ సీఐ ఆంజనేయులు, రెండవ పట్టణ సీఐ కరీం, ఎస్సై రాజేష్ వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా పోలీసు వాహనాలను ఢీ కొట్టింది తామేనని పందుల దొంగతనమే తమ వృత్తిగా మార్చుకున్నట్లు నిందితులు అంగీకరించారని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. అదేవిధంగా పలుచోట్ల పోలీసులపై ఈ ముఠా సభ్యులు గతంలో పలుమార్లు దాడులు చేసినట్లు అంగీకరించారని తెలిపారు. 11 మంది నిందితు లను అరెస్టు చేసి వారి వద్ద నుండి రెండు బొలెరో వాహనాలు,6 పిడిబాకులు, రాళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో హిందూపురం ఏఎస్పీ కేవీ మహేష్, సిఐలు కరీం, ఆంజనేయులు, జనార్ధన్, ప్రసాద్ బాబు ఉన్నారు.




# తిరుపతిలో దీపాలతో స్మారక కార్యక్రమం

**తిరుపతి,సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఏకం చేసిన ఘటన అప్పట్లో తాజా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని సైకో జగన్ మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు చేయడమేనని తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జి జెబి శ్రీనివాస్ అన్నారు. 2023లో సెప్టెంబర్ 9వ తేదీన వైసిపి అక్రమ అరెస్టు చేసి మూడేళ్ళు పూర్తి అయ్యింది. 53 రోజుల అనంతరం విడుదల కాగా కోర్టు అక్రమ కేసు అని, కేసులో వాస్తవం లేదని కొట్టివేసింది. దీనికి గుర్తుగా నిజం గెలిచింది పేరుతో దీపాల వెలిగించే కార్యక్రమం బుధవారం రాత్రి తిరుపతి టౌన్ క్లబ్ కూడలిలో నిర్వహించారు. తిరుమల శ్రీవారి పరమభక్తుడైన ముఖ్యమంత్రిని అక్రమంగా నిర్బంధించడంతో సైకో పోవాలి సైకిల్ రావాలని పిలుపు ప్రారంభమైంది. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర ప్రారంభిస్తామని అంటున్నావు.. నువ్వు రాష్ట్ర వ్యాప్తంగా కాదు ప్రపంచ వ్యాప్తంగా పాదయాత్ర చేసిన కూడా సిఎం కాలేవన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షురాలు, టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి ్ర, బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహా యాదవ్, టిడిపి నాయకులు అన్నా అనిత, పుష్పావతియాదవ్, శ్రీధర్ వర్మ, ఊట్ల సురేంద్ర నాయుడు, మహేష్ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, కృష్ణ యాదవ్, బ్యాంకు శాంతమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలకు చంద్రబాబు, లోకేష్ బాధ్యులు


## - మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**నెల్లూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త - వైద్యం:** డీఎస్సీ అక్రమాలకు చంద్రబాబు, లోకేష్ లే బాధ్యులు అని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు.ఆధారాలతో అక్రమాలు బట్టబయలవ్వడంతో ప్రభుత్వం, అధికారులు స్వరం మార్చారన్నారు. డిఎస్సీలో ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ ఫైర్ అయ్యారు. నెల్లూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. డిఎస్సీ 2025 మహా కుంభకోణానికి చంద్రబాబు, లోకేష్‌లే ప్రత్యక్ష బాధ్యులు అని, తక్షణమే మంత్రి పదవికి లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. అధికారుల వివరణతోనే డిఎస్సీ అక్రమాలు బట్టబయలైనట్లు తెలిపారు. నిరుద్యోగుల గొంతు నొక్కే కుట్రలను తిప్పికొడతామని నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. డిఎస్సీ 2025 నియామకాల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆధారాలతో సహా నిరూపితమైనా కూటమి ప్రభుత్వం ఇంకా బుకాయించడం సిగ్గుచేటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిఎస్సీ కుంభకోణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల ప్రత్యక్ష పాత్ర ఉందని స్పష్టం చేశారు. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యమంత్రి పరిధిలోనే ఉన్నందున, క్రీడల కోటాలో పోటీ పరీక్ష లేకుండా సర్వీస్ నిబంధనలను సవరిస్తూ జీవో ఇవ్వడం వెనుక సీఎం బాధ్యత కాదనలేనిదని గుర్తుచేశారు. అధికారులు ప్రెస్ మీట్ పెట్టి ఇచ్చిన వివరణలతోనే డిఎస్సీలో అక్రమాలు వాస్తవమేనని తేలిపోయిందని, ఆధారాలు బయటకు వచ్చాక ఇప్పుడు విచారణ చేస్తామనడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు.

# ధర్మవరంలో నూతన యోగ సాధన మందిరం ప్రారంభం

## యోగా నిత్య జీవన విధానంగా మారాలి : మంత్రి సత్యకుమార్ యాదవ్



ధర్మవరంలో నూతన యోగ సాధన మందిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, యోగా గురువు భీష్మయ్య

**ధర్మవరంటౌన్ , సెప్టెంబరు 9 ప్రభాతవార్త** యోగా కేవలం ఒకరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగం కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. అనారోగ్యం వచ్చిన తర్వాత చికిత్స అందించడం కంటే ముందుగానే వ్యాధులను గుర్తించి నివారించే ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, వెల్‌నెస్ విధానంతో ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ టెర్రస్‌పై ధర్మవరం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సింధూర్ నిత్య ధ్యాన యోగ సాధన మందిరాన్ని బుధవారం మంత్రి సత్యకుమార్ యాదవ్, యోగా గురువు భీష్మయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.దాదాపు మూడున్నర దశాబ్దాలుగా యోగా సాధన చేస్తూ, ఎంతోమంది యోగా సాధకులను తీర్చిదిద్దుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న యోగా గురువు భీష్మయ్యను మంత్రి అభినందించారు. మందిర ఏర్పాటుకు కృషి చేసిన గాజుల సోమేశ్వర్ రెడ్డి, ఆయన మిత్రబృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.యోగా.. నిత్యజీవితంలో భాగం కావాలి భారతీయ సంస్కృతిలో యోగా, ప్రాణాయామం, ఆయుర్వేదానికి వేల సంవత్సరాల ఘనమైన వారసత్వం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషితో యోగా ప్రపంచవ్యాప్తంగా మరింత ప్రాచుర్యం పొందిందన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవానికే పరిమితం కాకుండా ప్రతి రోజూ సాధన చేసే విధంగా ప్రజల్లో అవగాహన పెంచడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో యోగా సాధనను విస్తరించేందుకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తున్నామన్నారు.

### రాపూరు చిట్వేలీ ఘాట్ రోడ్డులో చిరుతల సంచారం

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** రాపూరు..చిట్వేలి ఘాట్ రోడ్డులో ఇటీవల కాలంలో చిరుతపులిల సంచారం ఎక్కువగా వున్నట్లు పలువురు తెలుపుతున్నారు.గతంలో ఎప్పుడో ఒకసారి రోడ్డుపై కనిపిస్తూ వచ్చిన చిరుత పులిలు ఇటీవల కాలంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. గత వారం రాజంపేట నుండి పెంచలకోనకు వస్తున్న భక్తులకు ఘాట్ రోడ్డు గోడపై కూర్చొని వున్న చిరుత పులి కనపడింది. దీంతో వారు దానిని వారి సెల్‌ఫోన్‌లో రికార్డు చేశారు.

# ఎమ్మెల్సీ భరత్‌పై కుప్పంలో కేసు నమోదు

**కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త** ఎమ్మెల్సీ, కుప్పం వైఎస్సారీ్స ఇన్‌చార్జ్ కెఆర్‌జె భరత్‌పై కుప్పం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళవారం ఎమ్మెల్సీ భరత్‌పై టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, స్థానిక నేతలు కుప్పం పిఎస్‌లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఎమ్మెల్సీ భరత్ ప్రసంగం శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా ఉండడంతో పాటు తన అనుచరులను రెచ్చగొట్టేలా ఆయన ప్రస ంగించారన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా గొడవలు జరిగేలా ఆయన మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలు యుద్ధ వాతావరణంలో జరుగుతాయని ప్రసంగించారన్నారు. వైఎస్సార్సీ అభ్యర్థులు చంపేందుకు లేదా చచ్చేందుకు సిద్ధం కావాలని అవసరమైతే రక్తపాతం సృష్టించాలని ప్రస ంగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కుప్పం పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్సీ భరత్‌పై సెక్షన్ 192,353(1)(బి), 351(2) భారత న్యాయస ంహిత చట్టం ప్రకారం అర్బన్ ఎస్సై బాబు కేసు నమోదు చేశారు.

### ఎస్పీడిసిఎల్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**తిరుపతి, సెప్టెంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడిసిఎల్ యూనిట్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ గణాంక అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. నరేంద్ర నాయుడు బుధవారం తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా టి. రవికుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం. శివకుమార్, కోశాధికారిగా ఎం.ఎన్.పి. శైలజ ఎన్నికయ్యారు.ఎస్పీడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం మురళీ కుమార్ ఎం. శ్రీకాంత్ ల సమక్షంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. మధుసూదన్, సంయుక్త కార్యదర్శి పి. బాలాజీ ల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షులుగా జె. సుభాష్ చంద్రబోస్, ఎస్. సిన్హా, సంయుక్త కార్యదర్శులుగా సి హెచ్ అనిల్ కుమార్, కె.వి. సుబ్బారావు, సంస్థాగత కార్యదర్శులుగా వై.ఆర్. రవి కుమార్ రెడ్డి, ఆర్. పాపయ్య, మహిళా ప్రతినిధిగా ఎస్. ప్రశాంతి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా టీ. వెంకట సుబ్బయ్య, సి. శ్రీనివాసులు, జె. రామకృష్ణ, ఎస్. వెంకటేశ్వర్లు, ఎన్. అశోక్ వర్ధన్ గుప్తా ఎన్నికయ్యారు.

# బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

## రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం

**ఏలూరు, సెప్టెంబర్09, (ప్రభాతవార్త)** బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఏలూరు ప్రత్యేక పోక్సో కోర్టు జీవిత ఖైదు విధించింది. బాధిత బాలికకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రత్యేక పోక్సో సెషన్స్ జడ్జి గాజుల వెంకటేశ్వర్లు సెప్టెంబర్ 8న తీర్పు వెలువరించారు. జిల్లాలోని మండవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన కేసులో ఐపీసీ 376ఏబి, పోక్సో చట్టంలోని సెక్షన్లు 5(ఎం)(ఎన్) రెడ్‌విత్ 6 కింద కేసు నమోదైంది. దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు.

# మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామాలు

విజయవాడ,సెప్టెంబరు9,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ మద్యం కుంభకోణం కేసులో మాజీ కమిషనర్ వాసుదేవరెడ్డి ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పీఎంఎల్ఏ చట్టం కింద ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ జీవో జారీ చేసింది. నకిలీ సంస్థల ద్వారా నిబంధనలు ఉల్లంఘించి ఆయన ప్రభుత్వానికి భారీ నష్టం చేకూర్చారు. మరోవైపు ఇదే కేసులో దుబాయ్ పారిపోయిన నిందితుడు ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కె దురైంది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

01. Tender Notice No.: Short Tender Notice

No.17/2026-27/GVMC/SE-Gwk/E.E-GWK Zone, Dt:08.09.2026 (07 days)

| | | |
|---|---|---|
| 1 | Number of Works | 04 No's. |
| 2 | Value of Works | Rs. 265.90 Lakhs |
| 3 | Down Load Starting Date | 09.09.2026 @ 02.00 PM |
| 4 | Down load Ending date | 16.09.2026 @ 03.00 PM |

Note: Further details @ www.ape.procurement.gov.in
EE-Gwk or SE-Gwk (Contact No.9848933235)

sd/- For Commissioner

10-09pg10:10-09pg10.qxd 9/9/2026 11:41 PM Page 1



# వరల్డ్ ఆర్చరీ టైటిల్ కైవసం చేసుకున్న శీతల్

**అహ్మదాబాద్:** తొలి ఎడిషన్‌లో మూడో అంచెగా బుధవారం అహ్మదాబాద్‌లో జరిగిన వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్‌లో భారత స్టార్ శీతల్ దేవి తన తొలి మహిళల కాంపౌండ్ వ్యక్తిగత టైటిల్‌ను కైవసం చేసుకుంది. థాయ్‌లాండ్, చెకియాలలో జరిగిన గత రెండు దశల్లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత, ఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన ఐజాదా సెయిడాన్‌ను ఓడించిన శీతల్ చివరకు ఆ అడ్డంకిని అధిగమించింది. 144 పాయింట్లతో స్కోర్లు సమం అయిన తర్వాత, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ చివరి ఎండ్‌లో వెనుక నుండి పుంజుకుని షూట్‌ఆఫ్‌కు దారితీసింది. ఆ తర్వాత షూట్‌ఆఫ్‌లో, సీడాన్ తొమ్మిది స్కోరు చేయగా, ఆమె ఇన్నర్‌టెన్ స్కోరు చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది.



ఈ టోర్నమెంట్‌లో శీతల్ భారతదేశం తరపున ఏకైక వ్యక్తిగత ఛాంపియన్‌గా నిలిచింది. మొత్తం మీద, భారత ఆర్చర్లు 4 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలతో సహా 15 పతకాలను సాధించారు. పారాలింపిక్ ఈవెంట్లలో భారతదేశానికి మరో నాలుగు వ్యక్తిగత కాంస్య పతకాలు లభించాయి. వీరిలో సరిత (మహిళల కాంపౌండ్), తోమన్ కుమార్ (పురుషుల కాంపౌండ్), భావనాచౌదరి (మహిళల రికర్వ్) స్వాతిచౌదరి (జూ1 మహిళలు) ఉన్నారు. ఇదే రోజు బుధవారం మరో మ్యాచ్‌లో హర్విందర్ సింగ్ మరియు భావనా చౌదరి నేతృత్వంలోని భారత పారా మిక్స్ రికర్వ్ జట్టు చైనాపై 6-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించి, వరుసగా తమ రెండవ పారా సిరీస్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

### వాలీబాల్ ఛాంపియన్‌షిప్..

# ఏడేళ్ల తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్

**జపాన్:** ఏవీసీ పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ 2026లో భారత పురుషుల వాలీబాల్ జట్టు బుధవారం జపాన్‌లో జరిగిన మ్యాచ్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. పూల్ ఎ చివరి మ్యాచ్‌లో ఒమన్‌పై బహ్రెయిన్ విజయం సాధించడంతో, పూల్ దశలో ఎనిమిదో ఉత్తమ జట్టుగా నిలిచిన భారత్ చివరి ఎనిమిది జట్లలోకి అర్హత సాధించింది. అంతకుముందు న్యూజిలాండ్‌పై స్ట్రెయిట్ సెట్స్ విజయంతో మూడు పాయింట్లతో తమ పూల్ స్టేజ్ ప్రచారాన్ని ఇప్పటికే ముగించిన భారత్, ఇతర ఫలితాలు తమకు అనుకూలంగా రావాలని ఎదురుచూస్తోంది. చైనా, ఇరాన్‌ల చేతిలో ఓడిపోయినప్పటికీ, న్యూజిలాండ్‌పై సాధించిన విజయం, సెట్‌పాయింట్ నిష్పత్తి ఆధారంగా బహ్రెయిన్‌ను అధిగమించి ఎనిమిదో స్థానాన్ని దక్కించుకోవడానికి సరిపోయింది. 2019లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్న తర్వాత,



ఏడేళ్లలో భారత్ క్వార్టర్ ఫైనల్‌కు చేరడం ఇదే మొదటిసారి. ఈ జట్టు 21 ఏళ్లుగా సెమీఫైనల్స్‌కు చేరలేదు. అయితే, గురువారం జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో పూల్ దశలోని అగ్రశ్రేణి జట్టును ఎదుర్కోనున్నందున వారికి మరింత కఠినమైన సవాలు ఎదురుకానుంది. జపాన్ ప్రస్తుతం 9 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది, కానీ చైనా, ఇరాన్‌ల (ఇరు జట్లు 6 పాయింట్లతో ఉన్నాయి) మధ్య ఒక మ్యాచ్ మిగిలి ఉంది, ఇది పట్టికలోని అగ్రస్థానాల తుది ర్యాంకులను నిర్ణయిస్తుంది.

### వియత్నాం ఓపెన్:



# వరుస గేమ్‌లలో తన్వి గెలుపు

**హో చి మిన్ సిటీ (వియత్నాం):** వియత్నాం ఓపెన్ 2026లో తన్వి శర్మ రాచెల్ చాన్‌ను వరుస గేమ్‌లలో ఓడించింది. బుధవారం వియత్నాం ఓపెన్‌లో జరిగిన రౌండ్ ఆఫ్ 32లో, టాప్ సీడ్ తన్వి శర్మ కెనడాకు చెందిన రాచెల్ చాన్‌ను 2-11-6, 21-17 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించి, బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 100 ఈవెంట్ తదుపరి రౌండ్‌కు చేరుకుంది. వరల్డ్ టూర్ సూపర్ 750 టోర్నమెంట్ ప్రారంభ రౌండ్‌లో డెన్మార్క్‌కు చెందిన అమలీ షుల్జ్‌ను 21-16, 21-17 తేడాతో వరుస గేమ్‌లలో అద్భుతంగా ఓడించి, భారత టీనేజర్ చివరి 16 మందిలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. అలాగే ఇదేరోజు అంతకుముందు మ్యాచ్‌లో భారత్ ప్లేయర్ అన్మోల్ ఖర్బ్ థాయ్‌లాండ్‌కు చెందిన సరున్రాక్ విటిడ్సార్న్ చేతిలో 14-21, 14-21 తేడాతో ఓడిపోగా, అలప్ మిశ్రా తన స్వదేశీయుడైన ఆర్య భివ్‌పతకిని 21-8, 21-14 తేడాతో ఓడించాడు. ఇక గత నెలలోనే, తైపీలో జరిగిన తైపీ ఓపెన్ సూపర్ 300 మహిళల సింగిల్స్ ఫైనల్‌లో వియత్నాంకు చెందిన ఆరో సీడ్ గుయెన్ థుయ్ లిన్‌ను 21-16, 21-16 తేడాతో ఓడించి తన్వి తన తొలి వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకుంది. కాగా గత ఏడాది యూఎస్ ఓపెన్ సూపర్ 300లో రన్నరప్‌గా నిలిచిన తన్వి, తుది పోరులో న్గుయెన్‌ను ఓడించడానికి కేవలం 36 నిమిషాలు మాత్రమే తీసుకుంది.

## ఆట

### మహిళల ఆసియా కప్..

# నేడే తొలి సెమీఫైనల్ మ్యాచ్

## భారత్ ప్రత్యర్థిగా బంగ్లాదేశ్

**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ 2026 నాకౌట్ సమరానికి తెరలేచింది. గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు ముగియడంతో సెమీఫైనల్స్ రేసు ఖరారైంది. యూఏఈపై ఉత్కంఠ విజయం సాధించిన బంగ్లాదేశ్ నాలుగో జట్టుగా సెమీస్ అర్హత సాధించింది. మొదటి సెమీఫైనల్లో టీమిండియా





బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది. గ్రూప్ బి లో తీవ్ర ఉత్కంఠ నడుమ సాగిన చివరి లీగ్ మ్యాచ్‌లో యుఏఈపై బంగ్లాదేశ్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లకు సమాన పాయింట్లు ఉండటంతో గెలిచిన జట్టుకే సెమీస్ అవకాశం లభించే పరిస్థితి ఏర్పడింది. మహిళల ఆసియా కప్ టోర్నీలో భారత్ హ్యాట్రిక్ విజయాలతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో నిలిచిన భారత మహిళల జట్టు, గ్రూప్‌బి లో రెండో స్థానంలో నిలిచిన బంగ్లాదేశ్‌తో మొదటి సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ ఈ నెల 10 గురువారం రాత్రి 8 గంటలకు దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో జరగనుంది. టోర్నీ పొడవునా అజేయంగా నిలిచిన హర్మన్‌ప్రీత్ సేన ఈ మ్యాచ్‌లో గెలిచి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. రెండో సెమీఫైనల్ మ్యాచ్ ఈ నెల 11 శుక్రవారం జరగనుంది.

మరోవైపు భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్ కూడా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. హాంగ్ కాంగ్‌తో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ 72 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. గ్రూప్ బి టాపర్ శ్రీలంక, గ్రూప్ ఎ లో రెండో స్థానంలో నిలిచిన పాకిస్థాన్ జట్లు ఈ పోరులో తలపడనున్నాయి. ఈ మ్యాచ్ కూడా దుబాయ్ వేదికగానే రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ రెండు సెమీఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన జట్లు ఈ నెల 13న జరిగే మహా ఫైనల్లో ఆసియా కప్ ట్రోఫీ కోసం పోరాడతాయి. కాగా గత చరిత్రను పరిశీలించినా భారత్ ఫైనల్ చేరడంలో ఎలాంటి సందేహం లేదు.

ఒకవేళ పాకిస్థాన్ కూడా శ్రీలంకను ఓడించి ఫైనల్ చేరితే మరోసారి దాయాదీ దేశాలు తలపడనున్నాయి. సెప్టెంబర్ 13(ఆదివారం) ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నీలో ఇప్పటికే ఇరు జట్ల మధ్య పోరు ఏకపక్షంగా ముగిసింది. పాకిస్థాన్ 55 పరుగులకు కుప్పకూలగా, భారత్ 8.4 ఓవర్లలోనే 56 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది.



### యుఎస్ ఓపెన్‌లో నవారోపై

# పెగులా విజయం

**న్యూయార్క్:** నవారోపై విజయం సాధించిన పెగులా, సబలెంకాతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యింది. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో, మూడో సీడ్ జెస్సికా పెగులా ఒక సెట్ వెనుకబడినప్పటికీ, 26వ సీడ్ ఎమ్మా నవారోను 3-6, 6-4, 6-3 తేడాతో 2 గంటల 21 నిమిషాల పాటు జరిగిన పోరులో ఓడించి, వరుసగా మూడో ఏడాది యూఎస్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. మొదటి సెట్ సర్వీస్ బ్రేక్‌ల మార్పిడితో ప్రారంభమైంది. పెగులా తన సర్వ్‌లో తడబడటంతో ఒకే గేమ్‌లో మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసి 2-4తో వెనుకబడింది. దాదాపు తొమ్మిది నిమిషాల పాటు సాగిన గేమ్‌లో నవారో నెగ్గింది. నవారో తన రెండవ సెట్ పాయింట్‌పై 6-3 తేడాతో కైవసం చేసుకుంది. పెగులా రెండవ సెట్‌ను ప్రారంభించినా స్కోరు 4-4తో సమం అయినప్పుడు, ఇద్దరిలో ఎవరూ తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకోలేకపోయారు. ఆ తర్వాత 4-5తో వెనుకబడి 30-30 వద్ద సర్వ్ చేస్తున్నప్పుడు, నవారో ఆ సెట్‌లో తన మొదటి డబుల్ ఫాల్ట్ చేసింది. దాంతో పెగులాకు మ్యాచ్‌లో మొదటి సెట్ పాయింట్ లభించడంతో రెండవ సెట్‌ను 6-4తో కైవసం చేసుకుంది. 3-2 ఆధిక్యంలో ఉన్న పెగులా, నవారో సర్వ్‌పై ఒత్తిడి పెంచి, ఆమె సర్వ్‌ను బ్రేక్ చేసి 4-2 ఆధిక్యం సాధించింది. అప్పుడే నిలకడగా ఆడే పెగులా తన సత్తా చాటడం మొదలుపెట్టింది. ఆమె తన సర్వ్‌ను నిలబెట్టుకుని ఆధిక్యాన్ని 5-2కు పెంచుకుంది. తన తర్వాతి సర్వ్‌లో, రెండవ మ్యాచ్ పాయింట్ వద్ద, పెగులా దానిని సద్వినియోగం చేసుకుని, సెట్‌ను 6-3తో, మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.



### పొదుపు పెరిగినా

# అప్పులూ ఎక్కువే!

## భారతీయ కుటుంబాల్లో ఆర్థికస్థితిపై ఆర్బీఐ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** భారతీయుల్లో పొదుపుచేయడం పెరిగినా అదేస్థాయిలో అప్పులు కూడా పెరిగాయని రిజర్వుబ్యాంకువెల్లడించింది. నాలుగేండ్ల క్రితం భారతీయ కుటుంబాలు తమ వద్ద ఉన్న ప్రతి 100 రూపాయల ఆర్థిక పొదుపునకు 27 రూపాయల అప్పును ఉంటే ఇపుడు రుణం 32 రూపాయలకు చేరింది. రిజర్వుబ్యాంకు తన 2026 ఆగస్టు బులెటిన్‌లో ప్రచురించిన తాజా గృహ ఆర్థిక స్థితిగతులు నివేదికలో ఈ అంశాన్ని ప్రస్తావించింది. ఈ ఏడాది మార్చి నాటికి భారతీయ కుటుంబాల వద్ద రూ.490.3 లక్షల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులు ఉన్నాయి. అదే సమయంలో వారిపై రూ.158.5 లక్షల కోట్ల రుణభారం ఉంది. ఇవి కేవలం ఆర్థిక పొదుపులు మాత్రమే. ఆస్తి, బంగారం ఇందులో పరిగణనలోకి తీసుకోలేదు. 2022 జూన్ నుంచి 2026 మార్చి వరకు ఉన్న 16 త్రైమాసికాల కాలంలో కుటుంబాల రుణాలు 78 శాతం పెరిగాయి. పొదుపు 49 శాతం పెరిగింది. ఆర్థిక వ్యవస్థ 41 శాతం వృద్ధి చెందింది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుతో పోలిస్తే రుణాల వృద్ధి రేటు దాదాపు రెట్టింపుగా ఉంది. కుటుంబాలు తమ వద్ద ఉన్న ఆస్తుల మొత్తాన్ని తగ్గించుకోలేదు. పైగా ఆ నాలుగు సంవత్సరాల కాలంలో ప్రతి సంవత్సరం ఆరంభంతో పోలిస్తే ముగింపు సమయానికి వారి వద్ద ఉన్న ఆస్తుల విలువ పెరిగిందని ఆర్బీఐ గణాంకాలు చెబుతున్నాయి. అయితే వాటికి తోడుగా తీసుకున్న అప్పుల విషయంలో మాత్రం మార్పు వచ్చింది. ఈ 49 శాతం ఆ మొత్తం నాలుగు సంవత్సరాల కాలానికి వర్తిస్తుంది. 2024 మార్చి నాటి గణాంకాలను పరిశీలిస్తే ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుతో పోలిస్తే పొదుపు వృద్ధి నెమ్మదిగా ఉందని ఆర్‌బీఐ డేటా వెల్లడిస్తున్నది. కేవలం అప్పులు మాత్రమే వేగంగా పెరుగుతూ వచ్చాయి. కుటుంబాలు తమ డబ్బును దాచుకునే విషయంలో మార్పు వచ్చింది. ఈ ఏడాది మార్చి నాటికి కుటుంబాల ఆర్థిక ఆస్తులలో 34.4 శాతంతో బ్యాంక్ డిపాజిట్లు ఇప్పటికీ అతిపెద్ద వాటాను కలిగి ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్స్ అత్యధిక వృద్ధిని నమోదు చేశాయి. వీటి వాటా 6.4 శాతం నుంచి 10.5 శాతానికి పెరిగింది. ప్రత్యక్ష షేర్ల పెట్టుబడులు 20.1 శాతం నుంచి 18.1 శాతానికి తగ్గాయి. కుటుంబ పొదుపులో ప్రతి 100 రూపాయల్లో సుమారు 29 రూపాయలు షేర్లు, మ్యూచువల్ ఫండ్ల రూపంలో ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం మార్కెట్ కదలికలకు అనుగుణంగా మారుతుంటుంది.

# వాణిజ్యం

## వరుస సమ్మెలతో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** బ్యాంకు ఉద్యోగ సంఘాలు వరుస సమ్మెలకు పిలుపునిచ్చాయి. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఈనెల 11న ఒకరోజు సమ్మెకు ప్రతిపాదించాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అదే విధంగా ఆల్ ఇండియా బ్యాంక్ అధికారి సేన మహాసంఘ్,




బ్యాంక్ కర్మచారి సేన మహాసంఘ్ కూడా ఈ సమ్మెల్లో పాల్గొనే అవకాశం ఉంది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మెకు ఈ సంఘాలు ప్రతిపాదించాయి. అంతేకాకుండా యుఎఫ్ బియు, ఎఐబిఎస్ఎం, బికెఎస్ఎం సంఘాలు అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లాలని ప్రతిపాదించినట్లు యూనియన్ బ్యాంక్ తెలిపింది. బ్యాంకింగ్ కార్యకలాపాలపై ప్రభావంఈ సమ్మెల వల్ల కలిగే ప్రభావాన్ని ప్రస్తుతం ఖచ్చితంగా అంచనా వేయలేమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేర్కొంది. సమ్మె జరిగితే దేశవ్యాప్తంగా బ్యాంకుశాఖలు, పరిపాలనా కార్యాలయాల కార్యకలాపాలపై ప్రభావంపడే అవకాశంఉందని తెలిపింది.

# సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలు!

**ముంబయి, సెప్టెంబరు 9:** భారత స్టాక్ మార్కెట్ బుధవారం భారీగా నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 813 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 203 పాయింట్లు నష్టపోయింది. బుధవారం ఉదయం ట్రేడింగ్ నష్టాల్లోనే మొదలైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 75,216.22 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. చివరకు 813.35 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ 74,764.23 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 203.60 పాయింట్లు నష్టపోయి 23,431.50 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 షేర్ ఇండెక్స్‌లో



టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఏసియన్ పెయింట్స్, ఎన్టీపీసీ, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. మరోవైపు మారుతి, ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లో నిఫ్టీ 100 షేర్ 0.72 శాతం, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.24 శాతం, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 1.79 శాతం పడిపోయాయి. ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు అత్యధికంగా 4.55 శాతం పతనమయ్యాయి. ఇన్ఫోసిస్ షేర్లు 4.43 శాతం, టెక్ మహీంద్రా షేర్లు 3.87 శాతం, టీసీఎస్ షేర్లు 2.26 శాతం పనతమయ్యాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 99.60 డాలర్లకు చేరింది. అమెరికాఇరాన్ యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, సౌదీపై హౌతీ ఉగ్రవాదులు దాడి చేయడం వంటి కారణాల వల్ల క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్ లాభాల్లో ముగియగా హాంకాంగ్ సెంగ్ ఇండెక్స్ నష్టాల్లో ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.11 వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ మార్కెట్లో 4,391.07 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




# 1.05 కోట్ల షేర్లను విక్రయించనున్న న్యూ ఇండియా అష్యూరెన్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఐపీఓలో భాగంగా 1.05 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నట్లు ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థ ది న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ వెల్లడించింది. కంపెనీ వివరాల ప్రకారం, మొత్తం 1,05,00,000 షేర్ల విక్రయం ద్వారా.. ఎన్ఎస్ఇలో తమకున్న మొత్తం వాటాలో సుమారు 29.83 శాతం వాటాను ఉపసంహరించుకోనుంది. అవసరమైన అన్ని నియంత్రణ సంస్థల అనుమతులు లభించిన తర్వాత, ఎన్ఎస్ఇ ఐపీఓలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో ఈ షేర్లను విక్రయించనున్నట్లు బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్ఇ నుంచి తమకు మొత్తం రూ.123.20 కోట్ల డివిడెండ్ అందినట్లు న్యూ ఇండియా అష్యూరెన్స్ తెలిపింది. ఐపిఒ ప్రక్రియలో భాగంగా ఎన్ఎస్ఇకు సంబంధించిన ఈక్విటీ షేర్లను 2026 సెప్టెంబర్ 8న ఎస్క్రో ఖాతాకు బదిలీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. సెబీ సూచించిన ప్రకారం, ఈ షేర్ల విక్రయం లేదా డిస్పోజల్ ప్రక్రియ 2026 సెప్టెంబర్ చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. రూ.1,7501,785గా ఎన్ఎస్ఇ ఐపీఓకు రూ.1,750 నుంచి రూ.1,785 వరకు ప్రైస్ బ్యాండ్ నిర్ణయించే అవకాశం ఉంది. ఎన్ఎస్ఇ ఐపిఒ పూర్తిగా ప్రస్తుత వాటాదారులు తమ షేర్లను విక్రయించే ఓఎఫ్ఎస్ రూపంలోనే ఉండనుంది. ఐపీఓలో విక్రయించనున్న ఈక్విటీ వాటాను గతంలో ప్రతిపాదించిన 6 శాతం నుంచి సుమారు 5.5 శాతానికి తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ ఐపీఓ ద్వారా ఎన్ఎస్ఇ సుమారు రూ.24,300 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

# నేనేమీ రుణాల ఎగవేతదారునికాదు

### -పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా



**లండన్, సెప్టెంబరు 9:** తనను పరారీలో ఉన్న వ్యక్తిగా పిలువడంపై ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా మండిపడ్డారు. తాను కావాలనే బ్రిటన్ లో ఉండిపోలేదని స్పష్టంచేశారు. బ్రిటన్ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రస్తుతం తనకు చట్టపరమైన అనుమతి లేదని అన్నారు. 1992 నుంచి బ్రిటన్లో శాశ్వత నివాస హక్కుతో ఉంటున్నానని మాల్యా చెప్పారు. భారత్‌కు రావాలన్నా ప్రస్తుత పరిస్థితుల్లో తాను దేశం విడిచి వెళ్లలేనని పేర్కొన్నారు. తన విషయంలో భారత ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల వ్యవహారంలో మాల్యా చాలాకాలంగా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్నారు. కింగ్‌ఫిషర్ భారీ నష్టాల్లో కూరుకుపోయి బ్యాంకుల రుణాలు చెల్లించలేకపోయిన సమయంలో 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి బ్రిటన్‌కు వెళ్లారు. బ్యాంకుల కన్సార్టియంకు దాదాపు రూ.9,000 కోట్ల బకాయిలు ఉన్నట్లు కేసులు నమోదయ్యాయి. 2019లో ముంబై ప్రత్యేక కోర్టు ఆయనను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించింది. మాల్యాను భారత్‌కు తీసుకొచ్చేందుకు 2017లో కేంద్ర ప్రభుత్వం బ్రిటన్ సర్కారు అనుమతి కోరింది. అదే ఏడాది లండన్లో ఆయన అరెస్టయ్యారు. తర్వాత బెయిల్ లభించినా బ్రిటన్ విడిచి వెళ్లకూడదన్న షరతు విధించారు. భారత్‌కు అప్పగించాలన్న దిగువ కోర్టు నిర్ణయాన్ని మాల్యా హైకోర్టులో సవాల్ చేశారు. ఇదే సమయంలో తనను బ్రిటన్ నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదని మాల్యా చెబుతున్నారు. ఇటీవల బాంబే హైకోర్టులోనూ ఇదే విషయాన్ని ఆయన తరఫు న్యాయవాదులు వెల్లడించారు. భారత్‌కు ఎప్పుడు వస్తారో చెప్పాలని కోర్టు కోరగా బ్రిటన్ కోర్టుల ఆంక్షల వల్ల ఇంగ్లండ్, వేల్స్ నుంచి బయటకు వెళ్లలేమని తెలిపారు. మాల్యా పాస్‌పోర్టు కూడా రద్దయిందని చెప్పారు. కింగ్‌ఫిషర్ రుణాల విషయంలో బ్యాంకులు అసలు బకాయిల కంటే ఎక్కువ మొత్తాన్ని ఇప్పటికే రికవరీ చేశాయని మాల్యా తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు.




# భారత్ బ్యాంకుల డిపాజిట్లలో 15% వృద్ధి: మూడీస్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** భారత బ్యాంకుల డిపాజిట్ వృద్ధి 2027 ఆర్థికసంవత్సరంలో సుమారు 15 శాతానికి వేగవంతం కావచ్చని రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అంచనా వేసింది. ముఖ్యంగా విదేశీ కరెన్సీ నాన్‌రెసిడెంట్ డిపాజిట్లలో భారీ పెరుగుదల దీనికి తోడ్పడనుందని తెలిపింది. విదేశీ కరెన్సీ నాన్‌రెసిడెంట్‌డిపాజిట్ల ప్రభావాన్ని మినహాయిస్తే, 2027లో బ్యాంకుల డిపాజిట్ వృద్ధి సుమారు 10 శాతంగా ఉండొచ్చని మూడీస్ పేర్కొంది. ఇదే సమయంలో బ్యాంకుల రుణవృద్ధి 13-15% మధ్య ఉండొచ్చని అంచనా వేసింది. రిజర్వ్ బ్యాంకు చేపట్టిన స్వాప్ పథకాలు దేశ విదేశీ మారక నిల్వలను పునర్నిర్మించడంలో, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడ్డాయని మూడీస్ తెలిపింది. ఎఫ్‌సిఎన్నార్బీ డిపాజిట్లు పెరగడం వల్ల బ్యాంకుల నిధుల సమీకరణ సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందని, అయితే దీని ప్రయోజనాలు అన్ని బ్యాంకులకు ఒకే విధంగా ఉండవని పేర్కొంది. ఎఫ్‌సిఎన్నార్బీ డిపాజిట్లు భారీగా వస్తే, బ్యాంకులు అధిక వ్యయంతో కూడిన నిధుల స్థానంలో తక్కువ ఖర్చుతో నిధులను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అలాగే దేశీయ డిపాజిట్ల కోసం బ్యాంకుల మధ్య ఉన్న పోటీ తగ్గవచ్చని మూడీస్ తెలిపింది. ఈ పరిణామం బ్యాంకింగ్ రంగానికి క్రెడిట్ పాజిటివ్గా ఉంటుందని పేర్కొంది. సమీప కాలంలో భారత బ్యాంకుల లిక్విడిటీ కవరేజ్ రేషియో ఎల్‌సిఆర్ 130 శాతానికి పైగా పెరగవచ్చని మూడీస్ అంచనా వేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

10- 9 pg 9:10- 9 pg 9.qxd 9/9/2026 11:48 PM Page 1





# ఇ-ఫాస్టింగ్ ఇలా చేస్తే..

ఆ మధ్య మధ్యప్రదేశ్ బేగంగంజ్ ప్రాంతంలో కొందరు జైనులు.. పర్యూషణ్ పర్వ్ సందర్భంగా ఆ రోజు డిజిటల్ ఫాస్టింగ్ చేశారు. ఆధ్మాత్మిక భావనలో గడిపేశారు. ఆత్మశుద్ధి చేసుకోగలగడం, ఆత్మ పరిశీలనకు అవకాశం కలగడంతోపాటు ఆధ్యాత్మికంగా తమను తాము మెరుగుపర్చుకోవడానికి అవకాశముంటుందని ఈ ప్రయోగం చేశారట.

కొన్ని గంటలు లేదా ఒరోజు పూర్తిగా ఎలక్ట్రానిక్ వస్తువులు, గ్యాడ్జెట్లకు దూరంగా ఉండటమే ఈ-ఫాస్టింగ్! దీనివల్ల ఒత్తిడి అదుపులో ఉంటుంది. అశాంతి ఆమడ దూరం పారిపోతుంది. అందుకే, నెలలో కనీసం రెండు రోజులైనా దీన్నిపాటించాలంటున్నారు నిపుణులు. ఈ ఫాస్టింగ్‌కు అలవాటు పడటం అంత సులువేం కాదు. ముందు మీ రోజువారీ అవసరాలేంటి? ఎలక్టానిక్ వస్తువులైన ఫోన్, ల్యాప్‌టాప్, స్మార్ట్ వాచ్.. ఇలా ఏదీ లేకుండా ఉండగలమా లేదా?అన్నది గమనించుకోండి. దానికి కొన్ని రోజుల ముందు నుంచే చిన్నగా ఒక్కో అలవాటునీ తప్పించుకోండి. ఉదయం నిద్ర లేవడానికి గడియారంలోనే అలారం పెట్టండి. ఫోన్‌లో కాలక్షేపానికి వినియోగించే అనవసరమైనయాప్స్‌ను తొలగించండి. సామాజిక మాధ్యమ ఖాతాలను సైన్‌అవుట్ చేసేయండి. నిద్రలేచిన వెంటనే ఫోన్ లేకుండా.. ఆరుబయట అందాలను ఆస్వాదించొచ్చు. నులివెచ్చని సూర్యోదయాన్ని చూస్తూ కాఫీ తాగుతూ ఉల్లాసంగా గడిపేయొచ్చు. చిన్న చిన్న స్ట్రెచ్‌లు, నడక, యోగాసనాలుప్రయత్నిస్తూ శరీరాన్ని దృఢంగా ఉంచుకోవచ్చు. ఆపై రోజువారీ ప్రణాళిక చేసుకోవడం, సకాలంలో పనులు పూర్తిచేయడం వంటివన్నీ చకచకా పూర్తయిపోతాయి. పత్రికలు, మ్యాగజీన్‌లు చదవండి. చుట్టుపక్కల వారితో మాట్లాడండి. ఇవన్నీ మీకో కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. అదీ లేదంటే ఆసక్తి ఉన్న మరో అంశంపై దృష్టిపెట్టండి. విరామమో, విశ్రాంతో అంటూ.. గ్యాడ్జెట్స్‌తో గడిపేసిన మీరు కుటుంబానికి తగిన సమయం కేటాయించి ఉండకపోవచ్చు. ఇందుకు ఈ టైమ్‌ని వాడండి. కలిసి భోజనం చేయండి. అంతా కలిసి ఆటలాడండి. ఇవన్నీ మీలో ఆందోళనల్ని దూరం చేస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. నిద్రలేమి సమస్యను తగ్గించి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ◻

# పసుపు మరకలా ?




పండుగలు, వ్రతాల మాసం. వేడుకలైనా పసుపు, కుంకుమల మరకలు. ఈ పసుపు, గంధం మరకలు మరీనూ! ఓ పట్టాన వదలవు. మీకూ అదే సమస్యా? ఇవి ప్రయత్నించి చూడండి. పసుపు మరక కడిగితే విస్తరిస్తుంది. సబ్బు పెడితే ఎర్రగా మారుతుంది. రెండు తలనొప్పి తెచ్చేవే అందుకే దాన్ని జాగ్రత్తగా శుభ్రం చేయాలి. ముందు పసుపు అంటిన ప్రాంతాన్ని నీటితో కడగండి. వేడి నీటి సమస్యలను మరింత జటిలం చేస్తుంది. కాబట్టి, చల్లటివే మేలు. ఆపై కాస్త బేకింగ్ సోడా తీసుకుని, దానికి తగినన్ని నీళ్లు కలిపి మందమైన పేస్ట్‌గా చేయాలి. ఆ మిశ్రమాన్ని మరక ఉన్నచోట రాయాలి. 20 నిమి షాలు పక్కనపెట్టేయాలి. ఆపై చల్లటి నీటితో ఉతికేయడమే. మరక ఇంకా కనిపిస్తే మళ్లీ ఈ ప్రక్రియను పునరావృతం చేయాలి. లేదంటే చల్లటి నీటితో కడిగాక లిక్విడ్ డిష్వాష్ని వేసి, వేళ్లతో బాగా రుద్దాలి. దాన్ని పది నిమిషాలు పక్కన పెట్టి, ఆపై నీటితో కడిగేసిన ఫలితం ఉంటుందట. లేదంటే నీళ్లతో కడిగాక దాన్ని నేరుగా ఎండలోనైనా పెట్టొచ్చుట. పసుపులోని కర్క్యుమిన్ రేడియేషన్కి వస్తోంది. పసుపుతో పిగ్మెంటేషన్ మాయమవు తుంది. లిక్విడ్ డిష్వాష్ చిట్కా గంధానికి కూడా పని చేస్తుంది. గంధం మరక అంటిన చోట నిమ్మ చెక్కతో రుద్ది చూడండి. లేదంటే కొన్నినీళ్లకి వినెగర్ చేర్చి, ఆ నీళ్లతో కడిగిన ఫలితం ఉంటుంది. కాసేపు పచ్చిపాలల్లో నానబెట్టి, తరవాత ఉతికినా గంధం, కుంకుమ మరకలు పోతాయి. ◻

**చిట్కా:** ✦ మిక్సీలో ఎండుద్రాక్ష వేసేటపుడు కొద్దిగా నిమ్మరసం కలిపితే ద్రాక్షలు బ్లేడ్‌కు అంటుకోకుండా వుంటాయి. ✦. కొత్తిమీర పొడికి కొద్దిగా ఉప్పు నిల్వవుంచితే ఎక్కువకాలం తాజాగా వుంటుంది. ✦ ఆమ్లేట్ లావుగా రావాలంటే సొన గిలకొట్టాక కొద్దిగా నీరు కలపాలి. ✦. ఉల్లి పాయలు తరిగేందుకు అరగంట ముందు వాటని పాలధిన్ కవర్లోవేసి ఫ్రిజ్‌లో పెడితే తరిగేటప్పుడు కళ్ళుముండవు. ✦.ఎండుకొబ్బరిని సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్ల చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి. ◻

# వ్యథ



**ప్రశ్న:** నాకు మగవాళ్లంటేనే నమ్మకం పోయింది. నా తండ్రి, ప్రేమించిన వ్యక్తి, పెళ్లి చేసుకున్న భర్తను చూసిన తరువాత సమాజం పట్ల నమ్మకం పోయింది. మా నాన్న స్వార్థపరుడు. దురాశతో నా మెడలు వంచి ఒక శాడిస్టుకి ఇచ్చి పెళ్లి చేశాడు. శాడిస్టు అయిన అతనితో వేగలేక పెళ్లయిన ఏడాదికే ఇల్లు వదిలి వెళ్లిపోయాను. తరువాత కేసు పెట్టాను. అతను పెద్దల సమక్షంలో విడాకులు తీసుకుని విడిపోయాం. తర్వాత ఒక వ్యక్తి ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. పెళ్లి చేసుకుంటానని

**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

## గతం కాదు, భవిష్యత్తు చూడండి !

నమ్మించి నేను దాచుకున్న డబ్బు తీసుకుని జల్సాలు చేసుకున్నాడు. అతని వ్యవహారం బయటపడటంతో ప్రేమకు స్వస్తి చెప్పి చీటింగ్ కేసు పెట్టాను. పోలీసులు అతని వద్ద లంచాలు తీసుకుని కేసును నీరుగార్చారు. నేను ఎంబీఏ చదివి ఒక కంపెనీ లో ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తున్నాను. నెలకు లక్షకు పైగా జీతం వస్తుంది. వయస్సు 34 ఏళ్లు కావస్తోంది. ఒకప్పుడు చక్కని భర్త, మంచి పిల్లలు, అంద మైన కుటుంబం అంటూ కలలు కనేదానిని. ఈ అనుభవాలతో ప్రేమ, పెళ్లి అంటేనే అసహ్యం వేస్తోంది. అయితే తెలియని శూన్యత మనసును వెంటాడు తోంది. డబ్బు ఉన్నా మనసుకు శాంతి దొరకడం లేదు. చురుకు దనం తగ్గి పోయింది. నిత్యం మనసు కల్లోలంగా ఉంటోంది. నిద్ర పట్టడం లేదు. ఈ దశలో అన్ని సమస్యలకు దూరంగా ఉండేందుకు తగిన సలహా ఇవ్వండి.- **సరళ (పేరు మార్చాం), విశాఖపట్నం**



**జవాబు:** అమ్మా.. గతాన్ని చూసి కుమిలిపోవడం మానండి. మంచి భవిష్యత్తు కోసం ఆలోచించండి. మీరు ఎదుర్కొన్న చేదు అనుభవాల వల్ల పురుషులపైనా, ప్రేమపైనా, సమాజంపైనా నమ్మకం కోల్పోవడం సహజమే. కానీ కొందరి చెడు ప్రవర్తనను మొత్తం సమాజానికి ఆపాదించడం మంచిది కాదు. మీరు బలహీనురాలు కాదు.. గాయపడిన బలమైన మహిళ మాత్రమే. ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడ గలిగిన మీ సామర్థ్యమే మీ బలం. ప్రస్తుతం ప్రేమ, పెళ్లి గురించి ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోకండి. కొంతకాలం మీకు మీరే సమయం కేటాయించండి. మనసుకు విశ్రాంతి ఇవ్వండి. ప్రతిరోజూ నడక, యోగా లేదా ధ్యానం అలవాటు చేసుకోండి. క్రమబద్ధమైన నిద్రకు ప్రాధాన్యత ఇవ్వండి. నమ్మకమైన స్నేహితులతో మనసు విప్పి మాట్లాడండి. గతాన్ని పదేపదే గుర్తు చేసుకోవడం మాని, కొత్త లక్ష్యాలను వెదకండి. డబ్బు భద్రతను ఇస్తుంది కానీ మానసిక ప్రశాంతతను కొనలేం. మీకు ఇప్పుడు కావాల్సింది కొత్త ప్రేమ కాదు.. మానసిక ప్రశాంతత. నిద్రలేమి, ఆందోళన, చురుకుదనం తగ్గడం కొనసాగితే నిపుణులను సంప్రదించండి. సైకాలజిస్ట్ వద్ద కౌన్సెలింగ్ తీసుకోండి. జీవనశైలిని మార్చుకోండి. సమాజం పట్ల మీ దృష్టి కోణాన్ని మార్చుకోండి. కొందరిని చూసి అందరూ అలాగే ఉంటారని అను కోకండి. ఎంబీఏ చేసిన మీరు శాస్త్రీయంగా నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం, కొత్త లక్ష్యాలను ఎంచుకోవడంపై దృష్టి పెట్టండి. ◻

# భక్తజన రక్షకుడే భగవంతుడు

భగవంతుడు తన భక్తులను ఎప్పుడూ ఓ కంట కని పెట్టుకుంటూ ఉంటాడు. ధర్మబద్ధమైన .. న్యాయ బద్ధమైన వారి అవసరాలను తీరుస్తూ, ఆపదల నుంచి .. ప్రమాదాల నుంచి వాళ్లని కాపాడుతూ ఉంటాడు. సాధు జీవనాన్ని గడిపే తన భక్తులకి హాని తలపెట్టడానికి ఎవరు ప్రయత్నించినా ఆయన ఎంతమాత్రం సహించడు. అందుకు ఉదాహరణగా విష్ణుభక్తుడైన అంబరీషుడి జీవితంలోని ఒక సంఘటన కనిపిస్తుంది. ప్రతి ఏడాదిలానే ఆ ఏడాది కూడా అంబరీషుడు 'ద్వాదశీ వ్రతం' ఆచరిస్తాడు. ఈ వ్రతం ఆచరించేవారు ఏకాదశి రోజున ఉపవాసం ఉండి .. ద్వాదశి ఘడియలు వచ్చిన తరువాతనే భోజనం చేయాలి. ఆ వ్రతాన్ని ఆయన పూర్తిచేస్తుండగా దూర్వాసుడు అక్కడికి వస్తాడు. త్వరగా స్నానం చేసి తమ ఆతిథ్యం స్వీకరించవలసిందిగా దూర్వాసుడిని అంబరీషుడు కోరతాడు. నదీ స్నానానికి వెళ్లిన దూర్వాసుడు ఎంతకీ రాకపోవడంతో, ద్వాదశీ ఘడియలు మించిపోతున్నాయనే ఉద్దేశంతో వ్రతభంగం కాకుండా అంబరీషుడు కొంచెం నీరు మాత్రం తీసుకుంటాడు. అంతలో అక్కడికి వచ్చిన దూర్వాసుడు నువ్వు సేవించినది జలమే అయినా .. అది భోజనంతో సమానమే అంటూ ఆగ్రహిస్తాడు. తనని భోజనానికి పిలిచి అవమానపరి చావంటూ ఎడమకాలుతో తన్ని .. పది నీచ జన్మలు ఎత్తమని అంబరీషుడిని శపిస్తాడు. క్షమించమని అంబరీషుడు అంటున్నా వినిపించుకోకుండా మరో శాపం ఇవ్వడానికి సిద్ధమవుతాడు. అప్పుడు తన భక్తుడిని రక్షి ంచుకోవడానికి శ్రీమహావిష్ణువు 'సుదర్శన చక్రం' వదులుతాడు. సుదర్శన చక్రం బారి నుంచి తనని రక్షి ంచే శక్తి ఎవరికీ లేదని తెలిసిన దూర్వాసుడు, శ్రీమహావిష్ణువు పాదాలనే ఆశ్రయిస్తాడు. అంబరీషుడినే శరణు వేడుకోమని స్వామి చెప్పడంతో, దూర్వాసుడు అక్కడికే పరిగెడతాడు. అప్పుడు అంబరీషుడు ..

# ఉలవల సూప్..



**పశువులకు దాణాగా వాడే ఉత్పత్తులు మనకూ ఎంతో ఆరోగ్యకరమైనవే.** కానీ, పోషకాలు పుష్కలంగా ఉండే ఈ సూపర్‌ఫుడ్‌తో చాట్‌లు, వడలు.. వంటి మరెన్నో రకాల వంటకాలనూ చేసుకోవచ్చు. ఉలవల్లో సాల్యు బుల్ ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఈ గింజల్ని డైట్‌లో చేర్చుకోవడం వల్ల మలబద్ధకం, గ్యాస్‌వంటి జీర్ణ సంబంధిత సమస్యలూ ఎదురు కావు. ఆకలినీ పెంచుతాయి. అధికబరువునీ నియంత్రి స్తాయి. పైగా వీటిల్లో గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తపోటు, చక్కెర వ్యాధి అదుపులో ఉంటాయి.

✦ ఉలవల్ని, కొత్త బియ్యాన్ని సమానంగా తీసు కుని జావ చేసుకుని తాగితే కాల్షియం లభిస్తుంది. ఎముకలకు కండరా లకు తక్షణ శక్తి లభిస్తుంది. అలానే, వీటికి యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉండటం వల్ల గాయాలు త్వరగా మానతాయి.

✦ ఈ గింజల్లోని ఫెనోలిక్ సమ్మేళనాలు కొలెస్ట్రాల్‌ని కరిగిస్తే, ఇవి యాంటీ లిథోజెనిక్‌గా పనిచేయడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలానే ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్ వంటివాటితో పాటు బి1,బి2, బి6, సి విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. దీనివల్ల మాంసాహారానికి సమానంగా ప్రొటీన్ కూడా దొరుకుతుంది. ఇక, రక్తహీనతతో, ఎముకల బలహీనతతో బాధపడే మహిళలు, చిన్నారులు రోజూ సూప్‌లా తాగితే సరి. సమస్యలు తగ్గుముఖం పడతాయి. ◻

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' అందమైన ప్రయాణం: ఆనంద్ దేవరకొండ



**ఎపిక్ సినిమా ఎలా ఉండబోతుంది?**
ఎపిక్ సినిమాపై టీమ్ అంతా మొదటి నుంచి ఎంతో నమ్మకంగా ఉన్నాం. 80ఎస్, 90ఎస్, 2000ఎస్ ఇలా అన్ని జనరేషన్ల వారికి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. చదువు కోసం విదేశాలకు వెళ్లిన వారికి మాత్రమే కాకుండా, కుటుంబానికి దూరంగా ఉండే ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది.

**ఆదిత్య పాత్రలో మిమ్మల్ని మీరు చూసుకున్నారా?**
నూటికి నూరు శాతం చూసు కున్నాను. ఎపిక్ కథ వింటున్నప్పుడే ఇదేంటి నా కథ లాగే ఉంది అనుకున్నాను. నేను అమెరికాలో చదువుకున్నాను. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ అనే తేడా లేకుండా విదేశాల్లో చదువుకుంటున్న తెలుగువారంతా ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతారు.

**ఆదిత్య పాత్ర ఎలా ఉండబోతుంది?**
నేను పోషించిన ఆదిత్య పాత్ర చాలా ఇన్నోసెంట్‌గా ఉంటుంది. ప్రతి విషయంలో కన్ఫ్యూజ్ అవుతుంటాడు. లైఫ్ లో తనకి నచ్చింది చేయాలా? లేక పేరెంట్స్‌కి నచ్చినట్టు బ్రతకాలా?

**బేబీ ప్రభావం ఈ సినిమాపై ఎంతవరకు ఉంటుంది?**
బేబీ అంత పెద్ద విజయం సాధించింది కాబట్టి, నేనువైష్ణవి కలిసి నటిస్తున్నప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడటం సహజమే. అయితే బేబీకి, ఎపిక్ సినిమాకి పోలిక లేదు. రెండూ దేనికవే ప్రత్యేకమైనవి. బేబీ ఒక సంచలనమైతే, ఇది ఒక అందమైన ప్రయాణం లాంటిది.

**90ఎస్ సిరీస్ కి కొనసాగింపుగా ఎపిక్ సినిమా ఉంటుందా?**
90ఎస్ సిరీస్‌కి సీక్వెల్ కాదు. కానీ, ఆ ప్రపంచంలో నుంచి, ఆ పాత్రల నుంచి పుట్టిన కథే ఇది. చిన్న కొడుకు ఆదిత్య విదేశాలకు చదువుకోవడానికి వెళ్ళినప్పుడు అక్కడ జరిగే కథగా ఇది ఉంటుంది.

**వైష్ణవి చైతన్య పోషించిన కడలి పాత్ర ఎలా ఉండబోతుంది?**
కడలి పాత్ర ప్రతి అమ్మాయికి కనెక్ట్ అవుతుంది. ఒక అమ్మాయి పైకి నవ్వుతూ కనిపిస్తున్నంత మాత్రాన, తను సంతోషంగా ఉందని కాదు.

**మీ వదిన రష్మికతో సినిమాల గురించి చర్చిస్తూ ఉంటారా?**
సినిమాల గురించి పెద్దగా మాట్లాడుకోము. కానీ, ఎపిక్ ఎప్పుడు విడుదల చేయాలని రిలీజ్ డేట్ కోసం కొంచెం టెన్షన్ పడుతున్న సమయంలో.. వదిన నాకు మెంటల్ గా సపోర్ట్ గా నిలబడ్డారు.

**మీ వదిన రష్మికతో సినిమాల గురించి చర్చిస్తూ ఉంటారా?**
సినిమాల గురించి పెద్దగా మాట్లాడు కోము. కానీ, ఎపిక్ ఎప్పుడు విడుదల చేయాలని రిలీజ్ డేట్ కోసం కొంచెం టెన్షన్ పడుతున్న సమయంలో.. వదిన నాకు మెంటల్‌గా సపోర్ట్‌గా నిలబడ్డారు.

# తెర

లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్ నిర్మాణంలో రాబోతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ "సిగ్మా . సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా ద్వారా జేసన్ సంజయ్

## 'సిగ్మా' రేజ్ ఆఫ్ సిగ్మా సాంగ్ రిలీజ్


దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన తొలి రెండు పాటలు "సిగ్మా స్టైల్, "అయ్యయ్యో అమ్మాడ్డి సినిమాపై మరింత బజ్ క్రియేట్ చేశాయి. రెండు పాటలు విభిన్నమైన మూడ్స్‌తో ఆకట్టుకోవడంతో "సిగ్మాపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ మరింత పెరిగింది. తాజాగా మేకర్స్ రేజ్ అఫ్ సిగ్మా పాటని రిలీజ్ చేశారు. తమన్ అందించిన పవర్‌ఫుల్




మ్యూజిక్, సీన్ రోనాల్డ్ ఎనర్జిటిక్ వోకల్స్‌తో Rage Of Sigmae సాంగ్ ఆకట్టుకుంటోంది. విడుదలైన వెంటనే ఈ పాటకు సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.లైకా ప్రొడక్షన్స్, ఏ. సుభాస్కరన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, సంపత్ రాజ్, శివ పండిట్, అన్బు థాసన్, యోగ్ జపి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి తమన్ ఎస్. సంగీతం అందిస్తున్నారు. కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, హరిహరసుధన్ వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

# 'మహేంద్రగిరి వారాహి' భారీ బడ్జెట్‌తో నిర్మించాం:

**నిర్మాత మధు కలిపు**



**మీ సినీ ప్రయాణం గురించి చెప్పండి?**
నాకు ముందేం సినిమా నేపథ్యం లేదు. దర్శకుడు శేఖర్ కమ్ములతో 'హ్యాపీడేస్' సమయం నుంచి పరిచయం ఉంది. అలాగే కిరణ్, అడివి శేష్‌కూడా నాకు మంచి మిత్రులు. అలా నేను సినిమాల్లోకి వచ్చాను. అంతకంటే ముందు బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రంగాల్లో వ్యాపారాలు చేశాను.

**'మహేంద్రగిరి వారాహి' సినిమా ఎలా మొదలైంది?**
'రంగమార్తాండ' తర్వాత మరొక మంచి సినిమా చేయాలనుకుంటున్న సమయంలో దర్శకుడు సంతోష్ ఈ వారాహి అమ్మవారి స్క్రిప్ట్ చెప్పారు. కథ బాగా నచ్చడంతో ప్రాజెక్ట్ ప్రారంభించాము.

**చాలా మంది స్టార్స్ వున్నారు కదా?**
అవునండి. సుమంత్, సిద్ధు జొన్నలగడ్డ గారు, ఐశ్వర్య రాజేష్‌ఇలా అద్భుతమైన నటీనటులు నటించిన పర్ఫెక్ట్ మల్టీస్టారర్ ఇది. సుమంత్ నటన అద్భుతంగా ఉంటుంది. ఐశ్వర్య రాజేష్‌అమ్మవారి రూపంలో చాలా అద్భుతంగా కనిపిస్తారు. సిద్ధుపాత్ర చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది.

**లక్ష్మణ్ ఎలా వచ్చారు?**
లక్ష్మణ్ రంగమార్తాండ నుంచి నా తోడున్నారు. ఈ కథ నచ్చి ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు.

**సినిమాలో స్పెషల్ ఎఫెక్ట్స్, విజువల్స్ ఎలా ఉంటాయి?**
డివోషనల్ ఎలిమెంట్స్‌తో వస్తున్న సినిమా ఇది. కథలో ఏముందో ఎక్కడా రాజీ పడకుండా తీశాం. దాదాపు గంట పాటు విఎఫ్ఎక్స్ (VFX) వర్క్ ఉంటుంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో చేయించిన ఈ వర్క్ అంతా చాలా నేచురల్‌గా, అద్భుతంగా వచ్చింది. అలాగే సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకి మేజర్ అసెట్‌గా నిలుస్తాయి.

**చిత్రీకరణ ఎక్కడెక్కడ జరిపారు?**
మేము దాదాపుగా అన్నీ ఒరిజినల్ లొకేషన్లలోనే తీశాం. రామ చంద్రపురం కోట, ముచ్చింతల్, గండికోట, ఒరిస్సాలోని వివిధ ప్రాంతాల్లో షూట్ చేశాం. కేవలం అమ్మవారి గర్భగుడికి మాత్రం

**బ్రహ్మానందం పాత్ర గురించి?**
బ్రహ్మానందం గారి క్యారెక్టర్ చాలా డివోషనల్‌గా ఉంటుంది. ఇప్పటివరకు ఆయన ఇలాంటి పాత్ర చేయలేదు, చాలా డిఫరెంట్‌గా ఉంటుంది.

**పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ప్రభావం ఉందా?**
పవన్ కళ్యాణ్ 'వారాహి' యాత్ర వల్ల ఈ పేరుకు మంచి ప్రచారం వచ్చింది. ఆ తర్వాత వారాహి అమ్మవారి గుప్త నవరాత్రులు జరగడం, కాకినాడలో ఆలయ నిర్మాణం జరగడం చూశాం. పవన్ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచి అద్భుతమైన ఫలితాలు పొందారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉంటాయి.

**బిజినెస్ గురించి?**
సినిమా టీజర్‌తోనే ఓటీటీ డీల్స్ క్లోజ్ అయిపోయాయి. ట్రైలర్ విడుదలయ్యాక చాలామంది థియేట్రికల్ కోసం అడిగారు, కానీ కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో ప్రపంచవ్యాప్తంగా మేమే సొంతంగా భారీస్థాయిలో విడుదల చేస్తున్నాము. దాదాపు 900 స్క్రీన్స్ లో రిలీజ్ చేస్తున్నాం.ప్రమోషన్లలో భాగంగా దాదాపు 150 థియేటర్లలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించాము.

**మీ నెక్స్ట్ ప్రాజెక్ట్‌లు ఏమిటి?**
దర్శకుడు సంతోష్‌తో మరొక సినిమా చేసే ఆలోచన ఉంది. దాంతో పాటు ఒక హాలీవుడ్ స్టూడియోతో కలిసి నేరుగా ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ఒక హారర్ సినిమా చేస్తున్నాం.

# 'కాకా' అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి వాల్తేరు వీరయ్య సక్సెస్ తర్వాతప్రతిష్టాత్మక చిత్రం 'కాకా'తో రాబోతున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలను నెలకొల్పుతోంది. భారీ స్థాయి లో హైఇంటెన్సిటీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ లో మెగాస్టార్ ను రెండు డిఫరెంట్ షేడ్స్‌లో చూపించడంతో సినిమాపై మాస్‌లో భారీ క్రేజ్ ఏర్పడింది. ఈ సినిమాలో కీలక పాత్ర లో నటిస్తున్న అనస్వర రాజన్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఆమె వెనుక పడిన నీడ పోస్టర్ మూడ్‌ను పూర్తిగా మార్చేస్తోంది. గోడపై మెగాస్టార్ చిరంజీవి సిల్హౌట్ కనిపిస్తూ, అనస్వర సాఫ్ట్, చీర్‌ఫుల్ అప్పియరెన్స్‌కు ఆసక్తికరమైన కాంట్రాస్ట్‌ను క్రియేట్ చేస్తోంది. అనస్వరను మేకర్స్ హార్ట్ ఆఫ్ కాకా"గా ఆమె పాత్రను అమ్ములు పాప"గా రివిల్ చేశారు.ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

# 'కళ్యాణం కమనీయం జీవితం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



ఈ నెల 18న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ..వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరో హీరోయిన్స్‌గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "కళ్యాణం కమనీయం జీవితం'. ఈ సినిమా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ మురళీ కార్తికేయ మాట్లాడుతూ నేను కంపోజ్ చేసిన ఒక పాట వల్ల నాకు ఈ మూవీ అవకాశం వచ్చింది. ప్రొడ్యూసర్ పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ యూఎస్ లో సాఫ్ట్ వేర్ రంగంలో ఉన్న మాకు సినిమా అంటే ప్యాషన్. మేము గతంలో 24 కిస్సెస్ మూవీ నిర్మించాం. కొత్త వాళ్లకు అవకాశం కల్పిస్తూ ఇన్నోవేటివ్ కంటెంట్ ను ఆడియెన్స్ కు చూపించాలనే ప్రయత్నంతో మా సొంత బ్యానర్ పై "కళ్యాణం కమనీయం జీవితం' సినిమాను నిర్మించాం. ప్రొడ్యూసర్ కిషోర్ గుండాల మాట్లాడుతూ నా మిత్రుడు ప్రసాద రావు ఈ కథ గురించి చెప్పిన వెంటనే ఇంకేమీ ఆలోచించకుండా సినిమా ప్రొడక్షన్ లో భాగమయ్యాను. డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ ఈ సినిమా చిన్నదే గానీ సినిమా తీసిన వాళ్లు చిన్న వాళ్లు కాదు. ఈ చిత్రంతో ఒక కొత్త దర్శకుడికి అవకాశం కల్పించినందుకు ప్రొడ్యూసర్స్ ప్రసాదరావు, కిషోర్‌కి మా డైరెక్టర్స్ అందరి తరుపున థ్యాంక్స్ ప్రొడ్యూసర్ కేఎల్ దామోదరప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కొత్త ప్రొడ్యూసర్స్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత మన ఇండస్ట్రీ పై ఉంది. వాళ్లు బాగుంటే మరో నాలుగు సినిమా తీసి కొత్త వాళ్లకు అవకాశం కల్పిస్తారు. దర్శక నిర్మాత అయోధ్యకుమార్ మాట్లాడుతూ నిర్మాత ప్రసాదరావు నాకు చిరకాల మిత్రులు. 24 కిస్సెస్ తర్వాత ఆయన నిర్మిస్తున్న రెండో చిత్రమిది.

# ఘనంగా సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్ వేడుక

ప్రతిష్టాత్మక TNIT సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్ వేడుక ప్రెస్ మీట్ దక్షి ణాది మీడియా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన జర్నలి స్టులు, మీడియా సంస్థలు, డిజిటల్ క్రియేటర్ల సేవలను గుర్తించి పురస్కరించేందుకు TNIT మీడియా అకాడమీ ఆధ్వర్యం లో TNIT సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్ 2026ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని వెల్లడిం చేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. యాక్టర్ అలీ మాట్లాడుతూ అవార్డులు నటులకు, దర్శకులకు, టెక్నీషియన్లకు, మిగతా అన్ని డిపార్ట్‌మెంట్లకు కూడా దొరుకుతుంటాయి. కానీ వాళ్లందరినీ హైలైట్ చేసే ఒక రిపోర్టర్‌కు అవార్డు ఇవ్వాలనే ఆలోచన రావడం చాలా అద్భుతమైన విషయం. రఘుకి ఇలాంటి ఆలోచన రావడం చాలా ఆనందంగా ఉంది. రిపోర్టర్ల కు, ఫోటో గ్రాఫర్లకు ఇలా మీడియా రంగంలోని అందరికీ అవార్డులు ఇవ్వడంతో పాటు ఒక హెల్త్ కార్డు కూడా ఇస్తే బాగుంటుందని నా ఆలోచన. దానికి నా సపోర్ట్ కూడా ఉంటుంది. ఈ హెల్త్ కార్డు ప్రతి కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది. అక్టోబర్ 23న బెంగళూరులో ఈ వేడుక జరుగు తుంది. దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ: మీడియా సినీ పరిశ్రమలోని కళాకారులను ప్రోత్స హిస్తుంది. వాళ్లు లేకపోతే మాకు గుర్తింపు లేదు. అలాంటి మీడియాను TNIT సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్‌తో సన్మానించడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాత రామ్ సత్య నారాయణ మాట్లాడుతూ: కెమెరా వెనక ఉండే వాళ్లకు కూడా అవార్డులు ఇవ్వడం గొప్ప విషయం. రఘు భట్ మాట్లాడుతూ: అలీకి, రామ్ సత్యనారాయణకి, రేలంగి నరసింహారావుకి




10-9Pg8exHMNWJQE:10-9Pg8exHMNWJQE.qxd 9/10/2026 12:22 AM Page 1



# వెయ్యి ఎకరాల్లో రెన్యువబుల్ ఎనర్జీ జోన్

**● నీటి వనరులను కాపాడుకోవాలి: మంత్రి గొట్టిపాటి రవికుమార్**



బుధవారం అద్దంకి ఆర్‌డిఓ ఆఫీస్‌లో రైతులకు పరిహారం చెక్కులు అందజేస్తున్న మంత్రి రవికుమార్

**అద్దంకి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** అద్దంకి నియోజకవర్గంలో దేశంలోనే మొదటగా ఏర్పాటు కాబోయే రెనెవబుల్ ఎనర్జీ మ్యాను ఫ్యాక్చరింగ్ జోన్‌తో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రెమ్స్‌కు భూములిచ్చిన రైతులకు బుధవారం పరిహారం చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. సంతమాగులూరు, బల్లికురవ మండలాలకు చెందిన 64 మంది రైతులకు సుమారు రూ.19.09 కోట్ల విలువైన చెక్కులను మంత్రి గొట్టిపాటి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ రెమ్స్‌ను వెయ్యి ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే 500 ఎకరాలు సేకరించామని మంత్రి తెలిపారు. మొత్తం భూమి అందుబాటులోకి వచ్చిన వెంటనే పరిశ్రమల స్థాపన చేపడతామన్నారు. రెమ్స్ తరహా రెనెవబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటు దేశంలోనే తొలిసారిగా జరుగుతోందని పేర్కొన్నారు. ఎనర్జీ జోన్ ద్వారా అద్దంకితో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన ఎంతోమంది నిరుద్యోగులకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి లభిస్తాయని స్పష్టం చేశారు. రెనెవబుల్ ఎనర్జీ కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి., త్వరగా పూర్తి చేసి భూములను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు.

**నీటి వనరులను కాపాడుకోవాలి:** పట్టణంలోని ఎన్‌టిఆర్ నగర్ 20వ వార్డులో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి జల కేంద్రాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. నీటి వనరులను కాపాడుకోవడం తోపాటు భవిష్యత్తు తరాలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై వుందని, మంత్రి పేర్కొన్నారు. చెరువులు, కాలువలు, కుంటలు, ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఎన్నినా ఎదుర్కోవాలంటే నీటి వనరులను కాపాడుకోవడంలో ప్రజలు బాధ్యత తీసుకోవాలని మంత్రి సూచించారు. వాటర్ ప్లాంట్ ప్రారంభం అనంతరం అక్కడ చేరిన మహిళలతో మంత్రి మాట్లాడారు.

**ఎన్ని కేసులు పెట్టినా క్లీన్‌చిట్‌తో చంద్రబాబు బయటపడ్డారు:** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అబద్ధాలతో చంద్రబాబు నాయుడిపై కేసులు పెట్టి అనవసరంగా ఇబ్బందులకు గురిచేశారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టినా అన్యాయంగా అసత్యాలతో కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు. చంద్రబాబును అనవసరంగా ఇబ్బందిపెట్టి 50 రోజులకుపైగా జైలులో ఉంచారని అన్నారు. ఎవరు ఎన్ని అబద్ధపు కేసులు పెట్టినా చంద్రబాబు క్లీన్‌చిట్‌తో బయటపడ్డారని తెలిపారు. అందుకే గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. మంచి పక్షాన నిలిచిన ప్రజలు కూటమికి ఓటు వేసి అధికారాన్ని అప్పగించారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

# గోదావరి పుష్కరాలు రోడ్లకు రూ.300 కోట్లు

**● నిధుల మంజూరుకు ఆర్థికశాఖ ఆమోదం: మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి**

**సచివాలయం, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టనున్న గోదావరి పుష్కరాలు–2027కు తరలివచ్చే కోట్లాది భక్తులకు అత్యుత్తమ, సురక్షితమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రహదారుల మరమ్మత్తులు, పునరుద్ధరణ పనుల కోసం రూ.300కోట్ల నిధులకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. గోదావరి పరిసర ప్రాంతాల్లోని 6జిల్లాల్లో పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించడానికి, భక్తుల ప్రయాణాన్ని సుగమం చేయడానికి యుద్ధప్రాతిపదిక ఈ నిధులను కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. గోదావరి తీర, పరిసర ప్రాంతాలైన తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, పోలవరం, ఏలూరు జిల్లాల్లో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ జిల్లాల పరిధిలో 78 రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మంజూరైన రూ.300 కోట్ల నిధులతో ఈ జిల్లాల వ్యాప్తంగా దాదాపు 431కిమీ పొడవైన స్టేట్ హైవేలు, జిల్లా ప్రధాన రహదారులను అభివృద్ధి చేయనున్నారు. స్టేట్ హైవేల పనులకు సంబంధించి 275కిమీ విస్తరించి ఉన్న 41రోడ్ల పనుల కోసం రూ.185.75 కోట్ల నిధులు కేటాయించారు. జిల్లా ప్రధాన రహదారులకు సంబంధించి 155కిమీ మేర గల 37కీలక రహదారుల అభివృద్ధి కోసం రూ.114.25 కోట్ల నిధులను ఖర్చు చేయనున్నారు. గోదావరి పుష్కరాల వంటి ఆధ్యాత్మిక వేడుకకు దేశవ్యాప్తంగా భారీగా వచ్చే భక్తులకు ఎలాంటి ట్రాఫిక్, ప్రయాణ ఇబ్బందులు కలగకుండా రూ.300 కోట్ల నిధులతో గోదావరి తీర ప్రాంత రహదారుల రూపురేఖలను పూర్తిగా మారిపోతాయని మంత్రి జనార్ధన్ రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు.

# పర్యాటకుల భద్రత ప్రభుత్వ బాధ్యత

**● శాఖల మధ్య సమన్వయానికి కేబినెట్ సబ్ కమిటీ: మంత్రి కందుల దుర్గేష్**

**సచివాలయం, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** పిలిగ్రిమ్ (ఆధ్యాత్మిక) టూరిజంలో యాత్రికుల, పర్యాటకుల భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఇస్తు ప్రభుత్వం కఠినమైన భద్రతా నిర్ణయాలు అమలు చేస్తున్నామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. విదేశీ పర్యటనల అనుభవాలతో రాష్ట్రంలో వెల్‌నెస్ టూరిజం (యోగా, ఆయుర్వేద) రంగాన్ని ప్రోత్స హించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే బాబా రామ్‌దేవ్, ఎఐటిఓ వంటి సంస్థల భాగ స్వామ్యంతో ఎపికి ప్రాచుర్యాం కల్పిస్తున్నా మన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" జాతీయ అవార్డును కూడా కైవసం చేసుకుందని గుర్తుచేశారు. పర్యాటక రంగాభివృద్ధిలో దేవాదాయ, అటవీ, ఇరిగేషన్ అర్ అండ్ బి శాఖల మధ్య ఉండే భూ కేటాయింపులు, అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి పలు సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు.

"అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే సరికొత్త ప్రదేశం, సదస్సులో భాగమైన ఎఐటిఓలు అవార్డులు, ప్రతిష్మాత్మక ఐఎటివో గాట్ టాలెంట్. కొరాకే మ్యూజిక్ పోటీలు (సీజన్ 6) ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో ఐఏటిఓ జాతీయ అధ్యక్షుడు రవి గోసేన్, ఛైర్మన్ సునీల్ మిశ్రా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రజనీష్ కైస్తా, సంజయ్ రజ్దాన్, ఎపిటిఎ డిప్యూటీ సిఇఒ శ్రీనివాస్, చీఫ్ మార్కెటింగ్ కమ్యూనికేషన్ అధికారిణి పద్మారాణి సీలా తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ వేదికగా ఐఎటిఒ జాతీయ సదస్సు: మంత్రి దుర్గేష్

**విశాఖపట్నం, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** ఆంధ్ర ప్రదేశ్‌ను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యాటక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. విశాఖలోని నోవాటెల్‌లో బుధవారం నిర్వహించిన ఐఎటీఓ జాతీయ సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఇండియా–ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" థీమ్‌తో సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ సదస్సు జరగనుంది. ప్రారంభోత్సవానికి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఐఏటీఓ జాతీయ సదస్సుకు విశాఖ ఆతిథ్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. దేశ వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా పర్యాటక రంగ ప్రతినిధులు, టూర్ ఆపరేటర్లు, పారిశ్రామిక వేత్తలు పాల్గొంటారని చెప్పారు. ఈ సదస్సుతో ఏపీ సముద్రతీరం, అరకు లోయ, గిరిజన సంస్కృతి, బౌద్ధ క్షేత్రాలు, ఆధ్యాత్మిక ప్రాంతాలు, ప్రకృతి అందాలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర టూర్ ఆపరేటర్లకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఐఏటీఓ సభ్యత్వానికి ఉండే రూ.10 వేల వన్‌టైమ్ అడ్మిషన్ ఫీజును ఏపీ భాగస్వాములకు రద్దు చేసినట్లు చెప్పారు. ఈ అవకాశం 2026 డిసెంబర్ 31 వరకు ఉంటుందని తెలిపారు. సదస్సు రిజిస్ట్రేషన్ ఫీజును ఏపీ ప్రతినిధులకు రూ.3,000గా నిర్ణయించినట్లు వెల్లడించారు. గత రెండేళ్లలో పర్యాటక రంగంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించినట్లు మంత్రి తెలిపారు. విశాఖలో రూ.5,529 కోట్లతో 16 పర్యాటక ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని, వీటి ద్వారా 950 కొత్త గదులు, 10 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. 2029నాటికి రాష్ట్రంలో 50 వేల కొత్త గదులను అందుబాటు లోకి తీసుకు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

# నర్సీపట్నంలో ఘనంగా 'జయహో బీసీ' సభ

## భారీగా తరలివచ్చిన టిడిపి శ్రేణులు





**విశాఖపట్నం, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** బీసీని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేసి గౌరవించిన పార్టీ తెలుగుదేశమని సభాపతి అయ్యన్నపాత్రుడు కొనియాడారు. బీసీలకు రాజ్యాధికారం కట్టబెట్టిన ఘనత తెలుగుదేశం వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుదేన్నారు. అదే పరంపరను చంద్రబాబు కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. 137 బీసీ కులాలకు సముచిత స్థానం ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయిచారని తెలిపారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కూటమి నేతలు "జయహో బీసీ" కార్యక్రమం నిర్వహించారు. స్థానికల ఎన్నికల్లో బీసీలకు 34!! రిజర్వేషన్లు కల్పించినందుకు చంద్రబాబు, లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సభకు సభాపతి అయ్యన్నపాత్రుడుతో పాటు మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

**45 వేల మంది బీసీలు సర్పంచ్‌లు కాబోతున్నారు:** ఈ సందర్భంగా సభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, "1983లో ఎన్టీఆర్ నన్ను పిలిచి ఎమ్మెల్యేగా పోటీ చేయమని కోరారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎమ్మెల్యేగా పోటీ చేయలేను అని చెప్పాను. తంగేటి రాజులకు ఎదురొడ్డి నిలవలేనని చెప్పాను. నీకు నేను అండగా ఉంటాను, పోటీ చేయి అని ఎన్టీఆర్ ధైర్యం చెప్పారు. ఎన్టీఆర్ మాట విని ఎన్నికల్లో నిలబడ్డాను, గెలిచాను. రాష్ట్రంలో బీసీల్లో 137 కులాలు ఉన్నాయి. రాష్ట్రంలో 57 శాతం బీసీల ఓటర్లు ఉన్నారు. సంక్షేమాన్ని మాటల్లో కాదు, చేతల్లో చేసి చూపించే పార్టీ టీడీపీ. జగన్ టీచర్ ఉద్యోగాలు ఇవ్వలేదు, చంద్రబాబు ఇస్తే ఓర్చుకోలేరు. జగన్‌కు ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి, రోడ్లపై మాట్లాడటమేంటి? అసెంబ్లీకి వచ్చి మాట్లాడటానికి జగన్‌కు భయం ఎందుకు? ఎన్నికల్లో 11 సీట్లు గెలిచి, ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలంటారు. చంద్రబాబు కొండను తవ్వి, అనకాపల్లి జిల్లాకు గోదావరి నీళ్లు ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు చంద్రబాబు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. రిజర్వేషన్లు పెంచడం వల్ల, 45 వేల మంది బీసీలు సర్పంచ్‌లు కాబోతున్నారు" అని అయ్యన్నపాత్రుడు తెలిపారు.

**1983కు ముందు బీసీల బతుకులు ఎలా ఉన్నాయి?:** మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, "1983కు ముందు బీసీల బతుకులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలి. దేశానికి 1947లో స్వాతంత్రం వచ్చి ఉండొచ్చు, బీసీలకు మాత్రం రాలేదు. టీడీపీ స్థాపించిన తర్వాతే, బీసీలకు స్వాతంత్రం వచ్చింది. ఎన్టీఆర్ వల్లే, రాజకీయాల్లోకి బీసీ ప్రజాప్రతినిధులు వచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీసీలకు ఎన్టీఆర్ 24 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. మనల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి, బీసీలను అథఃపాతాళానికి తొక్కేశారు. వైఎస్సార్సీపీ హయాంలో బీసీ ప్రజాప్రతినిధులపై జగన్ కేసులు పెట్టించారు. కేసులు పెడితే భయపడతాం అనుకున్నారు, భయం మా బ్లడ్‌లోనే లేదు. బీసీలపై చిత్తశుద్ధి ఉన్న పార్టీ టీడీపీ. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే, గొడ్డలిపార్టీ కోర్టుకు వెళ్లింది. ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలని వైఎస్సార్సీపీ చూస్తోంది" అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

**బీసీలకు న్యాయం జరగాలంటే, టీడీపీ అధికారంలో ఉండాలి:** అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, " స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు బీసీ బిడ్డలకు బంగారు బాట. మనకు మంచి భవిష్యత్, స్వేచ్ఛ ఉండాలంటే 2029 చాలా ముఖ్యం. రాజకీయ కక్షతో వైఎస్సార్సీపీ హయాంలో బీసీ నేతలపై కేసులు పెట్టారు. రాజకీయ పదవుల్లో బీసీలకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చారు. వైఎస్సార్సీపీ హయాంలో ఒకే సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇచ్చారు. టీడీపీ అంటేనే సమసమాజ స్థాపన. ఇప్పటికీ అసెంబ్లీలో అడుగుపెట్టని కులాలకు సముచిత స్థానం ఇస్తాం. బీసీలకు న్యాయం జరగాలంటే, టీడీపీ అధికారంలో ఉండాలి" అని పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తున్న బీసీలు:** బీసీలకు 34!! రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారని రాష్ట్రవ్యాప్తంగా బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీసీల రక్షణకు చట్టం తెస్తామని యువగళంలో లోకేశ్ ఇచ్చిన హామీ త్వరలో సాకారం కానుందని తెలిపారు. బీసీల రాజకీయ, సామాజిక ఎదుగుదలకు అండగా నిలుస్తున్న చంద్రబాబు, లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# మజ్జి శ్రీనుకు విజయనగరంలో ఘన స్వాగతం



**విజయనగరం, సెప్టెంబకె 9 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన అనంతరం తొలిసారి విజయనగరానికి వచ్చిన ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను కలిసేందుకు కూటమి నాయకులు, టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ధర్మపురిలోని ఆయన క్యాంప్ కార్యాలయం సందడిగా మారింది. ఈ సందర్భంగా నిర్వహించిన పత్రికా సమావేశంలో మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)తో పాటు ఆయన కుమార్తె మజ్జి సిరి సహస్ర (సిరమ్మ) కూడా పాల్గొన్నారు. అనంతరం చిన్న శ్రీను మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరినట్లు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్ష పదవికి, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. తన రాజకీయ ప్రయాణం రెండు దశాబ్దాలుగా సాగిందని, ఒక దశాబ్దం ప్రత్యక్షంగా, మరో దశాబ్దం పరోక్షంగా రాజకీయాల్లో కొనసాగినట్లు తెలిపారు. ఈ ప్రయాణంలో తనకు సహకరించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లాకు చెందిన మాజీ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రయాణంలో తనతో కలిసి నడిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యం:** ఉత్తరాంధ్ర, విజయనగరం ప్రాంతం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే టీడీపీలో చేరినట్లు చిన్న శ్రీను తెలిపారు. 'ఈ ప్రాంత బిడ్డగా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనేది నా ఆలోచన' అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, అభివృద్ధి, సంక్షేమం రెండు సమపాళ్లలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉత్తరాంధ్రలోని వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయానికి వచ్చిన కూటమి నాయకులు, టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు చిన్న శ్రీనును కలిసి కలిసి అభినందనలు తెలిపారు.

# పార్టీలోకి వస్తుంటారు.. పోతుంటారు!

**● చిన్న శ్రీను పార్టీ మార్పుపై బొత్స హాట్ కామెంట్స్**



**విశాఖపట్నం, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరడంపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందిస్తూ హాట్ కామెంట్స్ చేశారు. రాజకీయ పార్టీ ఎప్పుడూ ఉంటుంది... మనుషులు వస్తుంటారు.. పోతుంటారు. రాజకీయాల్లో మనిషి అనేవాడికి స్వార్థం ఉంటుంది. పార్టీ పని పార్టీ చేస్తుంది. ఇందులో ఏముంది.. మాకైతే ఇదేమీ కొత్త కాదు" అంటూ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. చిన్న శ్రీను పార్టీ మార్పుపై ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. స్వయానా మేనల్లుడే పార్టీ నుంచి వైదొలగడంపై బొత్స సత్యనారాయణ అంతర్మథనంలో పడ్డారంటూ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. చిన్న శ్రీను టీడీపీలో చేరికతో ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేచిన నేపథ్యంలో బొత్స వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## సైబర్‌వార్‌రూం ఏర్పాటుకు చర్యలు: డిజిపి

**విజయవాడ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** సైబర్‌నేరాలు పెరిగిపోతున్న తరుణంలో బాధితులకు ఊరట కల్పించేందుకు రాష్ట్రంలో సైబర్ వార్‌రూంను ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా తెలిపారు. విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌ను బుధవారం డిజిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ మాదిరిగా సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశంతో డ్రగ్స్‌ను సమర్ధవంతంగా అరికట్టామని, ఇదే స్ఫూర్తితో సైబర్ నేరాలను నియంత్రించేందుకు సైబర్‌గార్డ్ పాలసీని తీసుకురానున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలోనూ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక బృందాలను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిజిల్లాకు 20మంది సుశిక్షతులైన సైబర్ కానిస్టేబుళ్ళను నియమిస్తున్నట్లు డిజిపి తెలియచేసారు. సైబర్ నేరం జరిగిన వెంటనే జాప్యం చేయకుండా ఫిర్యాదు చేయాలని 1930 నెంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రజల డిజిటల్ భద్రతకోసం బాధితుడి ఫిర్యాదు నుండి నేరస్తుడి ఆనవాళ్ళ వరకు ప్రతి సమాచారాన్ని విశ్లేషిస్తూ, ప్రతి ఆధారాన్ని అనుసరిస్తూ సైబర్‌నేరాలు జరుగకుండా నియంత్రించటం తోపాటు, నేరాలు జరిగినపుడు బాధితులకు న్యాయం అందించటమే లక్ష్యంగా ఈసైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్రపోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ యండి రవిప్రకాష్, డిసిపిలు కృష్ణకాంత్ పటేల్, కె.తిరుమలేశ్వరరెడ్డి, కెజివి.సరిత, ఉదయరాణి, కె.కృష్ణప్రసన్న, బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సాధిక్‌ఖాన్ విచారణ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** సంచలనం రేపిన కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ నూకరాజు కుటుంబ సభ్యుల ఆత్మహత్య, జగదీష్‌రెడ్డి హత్య కేసులో నిందితుడైన సాధిక్‌ఖాన్‌ను సర్పవరం పోలీసులు మూడు రోజుల కస్టడీలో రెండో రోజు సర్పవరం సీఐ సిహెచ్ ప్రకాష్ బృందం లోతుగా విచారణ చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచి కేసుకు సంబంధించిన అంశాలపై ప్రశ్నిస్తున్నారు. కస్టడీలో 70కి పైగా ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. అయితే తొలి రోజు విచారణలో తనకు ఏమీ తెలియదని సాధిక్‌ఖాన్ సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. నూకరాజు కుమార్తె రాసిన మరణ వాంగ్మూలం ఆధారంగా కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను రాబట్టేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వేదాయపాలెంలో పట్టపగలే చోరీ

**నెల్లూరు క్రైం, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** స్థానిక కొత్తూరు, భారత్ నగర్ నివాసం ఉంటున్న రోళ్ళ రామకృష్ణ కుటుంబం కూలీ పనులకు వెళ్లిన సమయంలో దొంగలు ఇంట్లో చొరబడి బీభత్సం సృష్టించారు. బాధితుడి కథనం ప్రకారం మంగళవారం తన ఇద్దరు కుమారులు కాలేజీకి, తాను, తన భార్య కూలీ పనికి వెళ్లారు. మధ్యాహ్నం చిన్న కుమారుడు లక్ష్మీనారాయణ కాలేజీ నుండి ఇంటికి వచ్చేసరికి ఇంటి ఇనుప గేటు, మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి తండ్రికి ఫోన్ చేశాడు. తల్లిదండ్రులు ఇంటికి చేరుకుని చూడగా ఇంట్లోని బీరువా తాళాలు పగలగొట్టి అందులో మొత్తం 36 గ్రాముల బంగారు ఆభరణాలు, విలువ సుమారు రూ.90,000లను దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మెదడువాపు లక్షణాలతో విద్యార్థిని మృతి

**గన్నవరం(కృష్ణా), సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** మెదడువాపు వ్యాధి లక్షణాలతో 9వతరగతి విద్యార్థిని మృతిచెందింది. గన్నవరం మండలం అల్లాపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రామారావు పెద్దకుమార్తె సుస్మిత (14) దావాజీగూడెంలోని జడ్పీ హైస్కూల్‌లో 9వతరగతి చదువుతుంది. మంగళవారం జ్వరం రావటంతో స్థానికంగా వైద్యచికిత్స తీసుకుంది. బుధవారం జ్వరానికి తోడు తీవ్రమైన తలనొప్పి, ఫిట్స్ రావటంతో తల్లిదండ్రులు గన్నవరం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువెళ్ళారు. పరీక్షించిన వైద్యులు సిటీ స్కాన్ చేయించాలని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్ళాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు విజయవాడ ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతు ్యఒడికి చేరింది.

## బాలికతో అసభ్యకర ప్రవర్తన.. పోక్సో కేసు

**అనంతపురం క్రైమ్ సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** అభం శుభం తెలియని ఓ ఎనిమిదేళ్ల బాలికపై ఓ కామాంధుడు కన్నేసాడు. అసభ్యకరంగా ప్రవర్తించాడు. సర్వసభ్య సమావేశం సమాజం తలదించుకునేలా చేశాడు. నిందితునిపై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసిన ఘటన అనంతపురం నగరంలో చోటుచేసుకుంది. మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శివప్రసాద్ అందించిన వివరాల మేరకు నగరంలోని జీసస్ నగర్ లో ఉన్న ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదేళ్ల బాలిక రెండవ తరగతి చదువుతోంది. ఈనెల 3న ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లిన బాలిక వాష్ రూమ్ కి వెళ్ళిన సమయంలో అక్కడే పని చేస్తున్న ఓ కామాంధుడు 50 ఏళ్ల ఎల్లప్ప అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లితో వాపోయింది. గతంలో కూడా ఇలాగే ప్రవర్తించడని బాధితురాలు తన తల్లితో వాపోయింది. దీంతో రెండో పట్టణ పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టామన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుని పై ఫోక్సో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టమన్నారు. పాఠశాలలో పనిచేసే సిబ్బందిలో కేవలం ఇతను ఒకడే పురుషుడు, మిగతా సిబ్బంది అంతా మహిళలని తెలిపారు. అలాగే నిందితున్ని బుధవారం అరెస్టు చేసామన్నారు. త్వరలోనే కోర్టు ఎదుట హాజరుపరచడానికి సిద్ధంగా ఉంచామన్నారు. ఈమేరుకు లోతుగా దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## డిజె గొడవ... అర్ధరాత్రి వరకు ఆందోళన

**అనంతపురం క్రైమ్ సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** ఎంతో భక్తిశ్రద్ధలతో సాగాల్సిన వినాయక చవితి సంబరాలు వివాదాస్పదంగా మారాయి. పోలీసులకు టిడిపి కార్యకర్తల మధ్య గొడవ మొదలైంది. స్థానికుల వివరాల మేరకు నగరంలోని భవాని నగర్ ప్రాంతం యువత, టిడిపి కార్యకర్తలు గణేష్ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కోలాహలంగా తెచ్చారు. ఈ నేపథ్యంలో సంబరాల్లో డీజే ను ఏర్పాటు చేసి యువత కేరింతలు కొడుతూ ముందుకు సాగారు. డిజె సౌండ్‌తో చుట్టుపక్కల వారు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి అక్కడ పరిస్థితిని సమీక్షించారు. కాగా డీజే నిర్వహించుకోవడానికి ఎలాంటి అనుమతులు లేవని వెంటనే డీజే ని బంద్ చేయాలని పోలీసులు యువతకు వార్నింగ్ ఇచ్చారు. దీంతో సీఐకు యువతకు టిడిపి కార్యకర్తలకు వాగ్వాదం చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం నుండి వివాదాస్పదం ముదిరింది. ఈ వ్యవహారంలో ఓ టిడిపి కార్యకర్తపై సీఐ చేయి చేసుకున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో అర్ధరాత్రి వరకు అక్కడ పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. చివరకు కొందరు టిడిపి నాయకులు జోక్యం చేసుకొని పోలీసులతో చర్చలు జరిపి రాజీ ప్రయత్నం చేశారు దీనితో వివాదం కాస్తా సద్దుమణిగింది.

## దసరా ఏర్పాట్లపై సిపి క్షేత్రస్థాయి పరిశీలన

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లు గురించి ఇంద్రకీలాద్రి అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దుర్గా ఘాట్, మోడల్ గెస్ట్ హౌస్, ఘాట్ రోడ్, బ్యాటరీ వెహికల్స్ పార్కింగ్, క్యూ లైన్లు ను పరిశీలించి, ప్రధాన ఆలయం చుట్టు ప్రక్కల ఏర్పాట్లు, దర్శనం అనంతరం భక్తులు బయటకు వెళ్లే మార్గం పరిశీలన చేశారు. మహా మండపం దిగువ ప్రాంతం, దేవస్థానం సిబ్బంది, సర్వీస్ పర్సన్స్ ఎంట్రీ మార్గాలు గురించి దేవస్థానం ఇంజినీరింగ్ సిబ్బందికి పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేశారు. భక్తులకు తగు మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ శీనా నాయక్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ దుర్గా రావు, వన్ టౌన్ సిఐ గుణ రాము, ఈఈ రమాదేవి, ట్రస్ట్ బోర్డు మెంబర్స్ ఎ. శ్రీనివాసరావు, పి.రాఘవ రాజు తదితరులు పాల్గొన్నారు.

**ఇంద్రకీలాద్రి ఏర్పాట్లు పరిశీలన:** అమరావతి డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ డి. లక్ష్మి పార్థసారధి ఇంద్రకీలాద్రిపై భక్తులకందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఇంద్రకీలాద్రి పై పచ్చదనం పెంపు, సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు ఆవిడ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రదేశములను తమ అధికారులతో కలిసి పరిశీలన చేసారు. కార్యక్రమంలో ఈవో వికె శీనా నాయక్, ఈఈ రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మి పార్థసారధి దుర్గమ్మవారిని దర్శించుకుని వేద పండితుల ఆశీస్సులు పొందారు.

**దుర్గమ్మ హుండీ లెక్కింపుల్లో రు.3కోట్లు:** దుర్గమ్మకి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు బుధవారం లెక్కించగా రు.3కోట్ల 8లక్షల 81వేల 464ల నగదు, 301గ్రాముల బంగారం, 3కెజిల 10 గ్రాముల వెండి, 1840 యుఎస్ఎ డాలర్స్, 7 మలేసియా రింగెట్స్, యుఎఇ దిర్హామ్స్ 870, సింగపూర్ డాలర్స్ 6, యురోలు 215, ఇంగ్లాండ్ పౌండ్స్ 170, టర్కీ లైరసీలు 610, కువైట్ దినార్లు 0.50, కతార్ రియాల్స్ 91, ఒమన్ బైసాలు 300, కెనడా డాలర్స్ 190, న్యూజిలాండ్ డాలర్స్ 100, ఆస్ట్రేలియన్ డాలర్స్ 380 లభించినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. హుండీలెక్కింపులను ఇఓతో పాటు ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ అధికారులు పర్యవేక్షించగా సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథక విభాగమునకు తాడేపల్లికి చెందిన పి నాగ ఆదిత్య రు.1లక్ష విరాళం బుధవారం అందించారు. హైదరాబాద్‌కు చెందిన శరధి వల్లభ జ్యోస్యుల రు.1,00,000 విరాళం అందించారు.

# బియ్యం సరఫరాలో రాష్ట్రానికి జాతీయ అవార్డు

**విజయవాడ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** మెరుగైన ప్రమాణాలతో కస్టమ్ మిల్డ్‌రైస్(సియంఆర్) సరఫరా చేసినందుకు రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ప్రశంసించటంతోపాటు, జాతీయ అవార్డు బహూకరించింది. కెయంఎస్ 2025–26లో మెరుగైన ప్రమాణాలతో కస్టమ్ మిల్డ్‌రైస్ సేకరణ, సకాలంలో భారీ పరిమాణంలో సరఫరా చేసినందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక అవార్డుతో సత్కరించింది. ఈమేరకు మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన రాష్ట్రాల ఆహార కార్యదర్శుల సదస్సులో ఈఅవార్డును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమీషనర్ కన్నబాబు అందుకున్నారు.

సియంఆర్‌కు సంబందించి దేశంలో 2022–23లో చేపట్టిన పైలట్ ప్రాజెక్టును మన రాష్ట్రం సక్రమంగా అమలు చేసింది. 2024–25లో పదివేలటన్నుల సియంఆర్‌ను ఎఫ్‌సిఐకు అందించగా, 2025–26లో 20.50లక్షల టన్నుల భారీలక్ష్యాన్ని విజయవంతంగా పూర్తిచేసింది.

ఈవిధానంలో 10శాతం నూకలు, పార్బాయిల్ సియంఆర్‌ను 5శాతం నూకలు మించకుండా సరఫరా చేయాల్సి ఉంది. బియ్యం నాణ్యతా ప్రమాణాలతోపాటు గన్నీబ్యాగులకు క్యూఆర్‌కోడ్ ఆధారిత ట్రేసబిలిటీ, జిపిఎస్ ట్రాకింగ్, నూకలు ప్రత్యేకంగా వేరు చేసి భద్రపరచటం సరఫరాపై నిరంతర పర్యవేక్షణ వంటి పలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసింది. వచ్చే ఏడాదికూడా లక్ష్యాన్ని చేరుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమీషనర్ కన్నబాబు, పౌరసరఫరాలశాఖ అధికారులు ధీమ వ్యక్తం చేస్తున్నారు.